
ఆంధ్రభూమి

సంపుటి: 29 . సంచిక: 232 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | సోమవారం 22 జనవరి, 2018 | 20 పేజీలు | ధర: రూ.3.00

కొండగట్టు.. రాజకీయ మెట్టు



నేటి నుంచి పవన్ కళ్యాణ్ తెలంగాణ పర్యటన

ఆంజనేయస్వామికి పూజల అనంతరం జనసేనాని యాత్ర

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 21: పవర్ స్టార్, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తన రాజకీయ యాత్రను కరీంనగర్ జిల్లా కొండగట్టు నుంచి ప్రారంభించేందుకు ఆదివారం రాత్రి షెడ్యూల్‌ను ఖరారు చేశారు. పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత జిల్లాల వారీగా తిరిగి తన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజలకు తెలియజేసి, ఆయా స్థానిక సమస్యలపై స్పందించేందుకు వీలుగా తన యాత్రను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గత కొన్ని రోజులుగా నిశ్శబ్ధంగా ఉన్న పవన్ కళ్యాణ్ రాజకీయంగా మరో అడుగు ముందుకు వేశారు. కరీంనగర్ జిల్లా కొండగట్టు వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం అక్కడి నుంచే రాజకీయ యాత్ర చేపట్టేందుకు నిర్ణయించారు. ఆంజనేయస్వామి తమ ఇంటి ఇలవేల్పు అయినందున కొండగట్టు నుంచి ప్రారంభించేందుకు నిర్ణయించినట్లు పవన్‌కళ్యాణ్ వెల్లడించారు. దీనిలో భాగంగా ఆదివారం రాత్రి తెలంగాణలో తన పర్యటనను ఖరారు చేశారు. సోమవారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమై మధ్యాహ్నం 3 గంటలకు కొండగట్టుకు చేరుకుంటారు. అక్కడ హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం రాత్రికి కరీంనగర్ చేరుకుంటారు. 23వ తేదీ ఉదయం కరీంనగర్, నిజామాబాద్ ఆదిలాబాద్ జిల్లాల్లో పర్యటిస్తారు. ఆ తర్వాత 24వ తేదీ ఉదయం కొత్తగూడెం చేరుకుని అక్కడ ప్రజలతో మాట్లాడతారు. అనంతరం అదే రోజు మధ్యాహ్నం ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లోని కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారు. ఈ రాజకీయ యాత్ర ద్వారా ప్రజా సమస్యలను తన అభిమానులు, పార్టీ నాయకుల ద్వారా తెలుసుకుని భవిష్యత్ కార్యాచరణను ప్రకటించేందుకు పవన్ ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. కేవలం ప్రజా సమస్యల అధ్యయనం కోసమే యాత్ర చేస్తున్నామని చెబుతున్నా, పాదయాత్రలో ఎక్కువ మందిని కలిసే అవకాశం ఉందని తెలుస్తోంది.

సెయింట్ థెరిస్సా బసిలికా చర్చిలో పవన్ దంపతుల ప్రార్థనలు

సికింద్రాబాద్‌లోని సెయింట్ థెరిస్సా బసిలికా చర్చిలో పవన్‌కళ్యాణ్, ఆయన భార్య అన్నా పవన్‌కళ్యాణ్‌తో ఆదివారం ప్రార్థనలు నిర్వహించారు. వీరితో పాటు పోలాండ్ నుంచి వచ్చిన రాయబారి ఆడమ్ బురాకోవస్కీకూడా పాల్గొన్నారు. భారతీయ జీవనశైలి, విద్యావిధానాన్ని అధ్యయనం చేసేందుకు వచ్చిన పోలెండ్ విద్యార్థి బృందం కూడా చర్చిలో ప్రార్థనలకు విచ్చేశారు. చర్చిలో వీరికి - మిగతా 7వ పేజీలో



పవన్ కళ్యాణ్ దర్శించుకోనున్న కొండగట్టు ఆంజనేయస్వామి

శుభోదయం

కలియుగం - 5119

శాలివాహన శకం - 1939

శ్రీ చాంద్రమాన హేమలంబ నామ సం॥ ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: శుద్ధ పంచమి మ.12.45; నక్షత్రం: ఉత్తరాభాద్ర రా.తె.4.54; వర్జ్యం: మ.2.13 నుండి 3.50 విశేషాలు: వసంత పంచమి దుర్ముహూర్తం:మ.12.24 నుండి 01.12 వరకు, తిరిగి మ.02.48 నుండి 03.36 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు

కొత్త సీఈసీ ప్రకాశ్ రావత్

23న పదవీ స్వీకారం



న్యూఢిల్లీ, జనవరి 21: కొత్త ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఓంప్రకాష్ రావత్ ఈ నెల 23న పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. 64 సంవత్సరాల రావత్ ప్రస్తుత సిఇసి హాచెల్‌కుమార్ జోతి స్థానే ఈ బాధ్యతలు చేపడతారు. 2015 ఆగస్టులో ఎన్నికల కమిషనర్‌గా రావత్ పదవిని చేపట్టారు. గతంలో కేంద్ర, రాష్ట్రాల్లో అనేక కీలక పదవులు నిర్వహించారు. 1994లో దక్షిణాఫ్రికాలో జరిగిన జాతి వివక్ష అనంతర తొలి ఎన్నికలకు ఐక్యరాజ్యసమితి పరిశీలకుడిగా రావత్ వెళ్లారు. కాగా రావత్ స్థానే ఎన్నికల కమిషనర్‌గా మాజీ ఆర్థిక కార్యదర్శి అశోక్ లవాస ఎన్నికల కమిషనర్‌గా నియమితులయ్యారు. మధ్యప్రదేశ్ క్యాడర్‌కు చెందిన రావత్ 1993లో తొలిసారిగా రక్షణ మంత్రిత్వశాఖలో సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. 2010లో అత్యుత్తమ సేవలకు గాను ప్రధానమంత్రి అవార్డును ఆయన పొందారు.

అనర్హత వేటుకు రాష్ట్రపతి ఆమోదం

- 20 మంది ఆప్ ఎమ్మెల్యేలు ఇక ఇంటికే
- లాభదాయక పదవులు చేపట్టినందుకు ఫలితం

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 21: ఢిల్లీ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. లాభదాయక పదవులు చేపట్టిన కారణంగా ఢిల్లీ అధికార ఆమ్ అద్మీ పార్టీకి చెందిన 20 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కేంద్ర ఎన్నికల సంఘం పంపిన సిఫార్సుకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదముద్ర వేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆదివారం కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. దీనితో ఆప్‌కు చెందిన 20 మంది ఎమ్మెల్యేలు అర్హత కోల్పోయారు. 2015 మార్చి 13 నుంచి 2016 సెప్టెంబరు 8 వరకు ఈ 21 మంది ఆప్ ఎమ్మెల్యేలు పార్లమెంటరీ కార్యదర్శులుగా పదవిలో ఉండటంద్వారా - మిగతా 7వ పేజీలో

పనిచేస్తే మనకే పట్టం

- అన్ని సీట్లూ మనవే! • ప్రజల్లో మరింత నమ్మకం పెంచుకోండి
- ఎవరికీ అవకాశం ఇవ్వద్దు • పార్టీ నేతలు, శ్రేణులకు బాబు దిశా నిర్దేశం

విజయవాడ (క్రైం), జనవరి 21: 'మన పని తీరు బాగుంటే ఎన్నిసార్లయినా ఎన్నుకోడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. గతంలో మనం రెండుసార్లు అధికారంలో ఉన్నాం. మళ్లీ గెలిచాం. ప్రజలకు చేరువయ్యాం. జవాబుదారీతనంతో వ్యవహరిస్తే మనల్ని ఎవరూ ఓడించలేరు'అని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఇతర పార్టీలకు అవకాశం ఇవ్వకుండా ప్రజల్లో నమ్మకం పెంచుకోవాలని, తద్వారా 2019 ఎన్నికల్లో 175 శాసనసభ, 25 పార్లమెంట్ స్థానాలు గెలుచుకోవాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వపరంగా గడిచిన మూడున్నరేళ్లలో చేసిన పనులన్నీ ప్రజలకు వివరించాలని, పోలవరం ప్రాజెక్టుతో రాష్ట్ర ముఖచిత్రం మారనుందని చెప్పారు. విభజన చట్టంలోని అన్ని అంశాలు సాధించుకుందామన్నారు. ప్రధానంగా ప్రతిపక్ష, ఇతర చిన్న పార్టీల కుట్రలను దాటుకుని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను పార్టీ వైపు తిప్పుకోవాలని పిలుపిచ్చారు. దళితులను దరిచేర్చుకోవడమే లక్ష్యంగా పార్టీ ముందుకెళ్లాలని సూచించడం ద్వారా పార్టీ శ్రేణులను వచ్చే ఎన్నికలకు అధినేత సమాయత్తపరిచారు. రానున్న మూడు, నాలుగు నెలల్లో రాజకీయ లబ్ధికి నాంది పలకాలని పిలుపునిచ్చారు. ఉండవల్లిలోని తన నివాసం వద్ద గ్రీవెన్స్ సెల్ భవనంలో ఆదివారం జరిగిన పార్టీ వర్క్‌షాప్‌లో 13 జిల్లాల ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో గడిచిన మూడున్నరేళ్ల కాలం సంతృప్తినిచ్చిందని, రాష్ట్ర విభజనను సవాల్‌గా తీసుకుని పనిచేశామన్నారు. గతంలోకన్నా ఇప్పుడు ప్రజల్లో చాలా మార్పు వచ్చిందన్నారు. దక్షిణ భారతదేశంలో ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధిలో ముందున్నా తలసరి ఆదాయంలో మాత్రం వెనుకబడి ఉందన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీ సర్వనాశనమైందన్నారు. విభజన చట్టంలోని - మిగతా 7వ పేజీలో



టీడీపీ వర్క్‌షాప్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



శ్రీకాళహస్తిలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న వైకాపా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

స్వార్థంతోనే హోదా తాకట్టు


- వైఎస్ పథకాలను భూస్థాపితం చేశారు
- చంద్రబాబుపై జగన్ నిప్పులు

శ్రీకాళహస్తి, జనవరి 21: తన స్వార్థం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేక హోదాను కేంద్ర ప్రభుత్వానికి తాకట్టు పెట్టారని వైకాపా అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. ప్రజా సంకల్పయాత్ర 67వ రోజైన ఆదివారం శ్రీకాళహస్తి పట్టణంలో బహిరంగ సభ జరిగింది. పట్టణంలోని పెళ్లిమండపం వద్ద స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన ఈ వేదికపైకి స్థానిక నాయకులు, ప్రజలు రావడంతో అది కూలిపోయింది. ఈ సంఘటనలో 24మంది గాయపడ్డారు. ప్రత్యేక రథంపై నుంచే మాట్లాడిన జగన్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన పథకాలన్నీ ఇప్పటికీ అసంపూర్ణంగా ఉన్నాయని, వాటిని పూర్తిచేయడంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని దుయ్యబట్టారు. రాష్ట్ర విభజన - మిగతా 7లో

చైనాను దాటేస్తున్నాం

- అత్యంత వేగవంతమైన వృద్ధి దిశగా భారత్
- ఐదో ఈక్విటీ మార్కెట్‌గా అవతరించే అవకాశం
- తాజా అధ్యయనంలో వెల్లడి

5



పారదర్శకంగా కేసుల కేటాయింపు

- సీజే ఆలోచనలో కొత్త విధానం
- పరిష్కారం దిశగా సుప్రీం సంక్షోభం

బొక్కసానికి గండి!

- నిబంధనలకు తిలోదకాలు • ట్రెజరీల నుంచి నేరుగా నిధుల మళ్లింపు
- ప్రభుత్వ శాఖల డ్రాయింగ్ అధికారుల పేరిట చెల్లింపులు
- కమీషన్ల కోసం కక్కుర్తి • ట్రెజరీ, డ్రాయింగ్ అధికారుల కుమ్మక్కు

నిమ్మరాజు చలపతిరావు

విజయవాడ, జనవరి 21: ఆర్థిక సంస్కరణల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆంధ్రప్రదేశ్ ముందంజ వేస్తూ అనేకానేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు సాధిస్తున్నా..నిధుల దుబారాను అరికట్టలేకపోతోంది. రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల డ్రాయింగ్ అధికారులు, 13 జిల్లాల ఖజానా కార్యాలయాల అధికారులు కుమ్మక్కై ప్రభుత్వ బొక్కసానికి గండి కొడుతున్నారు. తమలో తాము లాలూచీ పడుతూ ఏనాడో కాలంచెల్లిన బ్రిటీష్ కాలం నాటి విధానాలను నేటికీ తు.చ.తప్పక పాటిస్తూ తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వందలు, వేల కోట్ల రూపాయల్లో నిధులు నేటికీ ఆయా ప్రభుత్వ శాఖల డ్రాయింగ్ అధికారుల బ్యాంక్ ఖాతాల పేరిటే జమ అవుతున్నాయి. నిబంధనల మేరకు ప్రైవేట్ వ్యక్తుల నుంచి అందుకునే సేవలు, అనేక రకాల కొనుగోళ్లకు సంబంధించి అన్నిరకాల బిల్లుల తనిఖీల అనంతరం నేరుగా ట్రెజరీల నుంచే సంబంధిత యజమానుల బ్యాంక్ ఖాతాలకే నిధులు జమకావాల్సి ఉంది. అయితే ఇక్కడ బిల్లుల ఆమోదం తర్వాత అటు ట్రెజరీ సిబ్బంది, ఇటు డ్రాయింగ్ అధికారులు కుమ్మక్కయి ఆ మొత్తాలను తమ బ్యాంక్ ఖాతాలకు జమ చేయించుకుంటున్నారు. ఆపై సంబంధిత వ్యక్తులు లేదా యజమానులను తమవద్దకు రప్పించుకుని కమీషన్లు పొంది తిరిగి చట్ట ప్రకారం వారి పేరిట చెక్కులు అందజేస్తున్నారు. ఒకవైపు ప్రధాని మోదీ నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు వరకు ఆర్థిక లావాదేవీల్లో మధ్యవర్తులు, - మిగతా 7వ పేజీలో





కడప జిల్లా గండికోట ఉత్సవాల్లో భాగంగా నృత్యం చేస్తున్న కళాకారిణులు.. జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న మంత్రి ఆదినారాయణరెడ్డి

ఫన్‌గామా



ఆర్థిక పరిస్థితి అధ్వానం!

◆ కేంద్ర నిధుల పైనే సర్కారు దృష్టి
◆ అప్పులతో నెట్టుకొచ్చే ప్రయత్నం
◆ నాలుగో త్రైమాసికంలో ఇబ్బందికర స్థితి
◆ ఖర్చు 7వేల కోట్లు.. ఆదాయం 2వేల కోట్లే!

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 21: ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వీలైనంతగా కేంద్రం నుంచి వివిధ పథకాల కింద నిధులను రాబట్టే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. రెండంకెల వృద్ధిరేటు సాధించినప్పటికీ ఆమేరకు ఆర్థిక కార్యకలాపాలు పెరగపోవడంతో నిధుల కోసం ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించింది. కేంద్రం నుంచి వివిధ పథకాల కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 10,522 కోట్ల రూపాయలు విడుదల కావాల్సి ఉంది. ఇప్పటివరకూ 5468 కోట్ల రూపాయలు విడుదల కాగా, మరో 5054 కోట్లు విడుదల కావాల్సి ఉంది. వీటికి యుటిలైజేషన్ సర్టిఫికెట్ ఇస్తే, నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. అయితే కొన్ని శాఖల అధికారులు ఈ సర్టిఫికెట్లను పంపడంలో జాప్యం చేయటంపై ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం వల్ల కేంద్రం నుంచి వచ్చే నిధులు నిలిచిపోయే పరిస్థితి తీసుకురావద్దని హెచ్చరించారు.

కేంద్రం నుంచి ఉపాధి హామీ, గృహ నిర్మాణ పథకాల కింద ఎక్కువ నిధులు రాష్ట్రానికి వస్తున్నాయి. మరిన్ని కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకుంటే ఎక్కువ నిధులు వస్తాయని భావిస్తున్నారు. కేంద్రం 82 పథకాలను అమలు చేస్తోంది. అందులో 16 పథకాలను ఎక్కువగా రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకుంటోంది. 10 పథకాలను ఇప్పటివరకూ ఉపయోగించుకోలేదు. దీంతో ఆ పథకాలను కూడా రాష్ట్రంలో అమలుచేసేలా కసరత్తు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. కేంద్ర ప్రకటిస్తున్న పథకాల గురించి ఆరా తీసేందుకు, నిధుల విడుదల, కేంద్రంతో సమన్వయం చేసేందుకు ఢిల్లీలోని ఆంధ్రా భవన్ కేంద్రంగా రెండు ఉన్నతాధికారుల బృందాలు పనిచేస్తున్నాయి. ఒక బృందం వివిధ పథకాలను గురించే పనిలో నిమగ్నం కాగా, మరో బృందం రాష్ట్రంలో వాటి అమలు, నిధుల విడుదల వంటి అంశాలను సమన్వయం చేస్తోంది. కాగా నాలుగో త్రైమాసికంలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. జనవరి మాసాంతానికి దాదాపు 7వేల కోట్ల రూపాయలు అవసరమౌతాయని అంచనా వేయగా, ఆదాయం మాత్రం 2వేల కోట్ల రూపాయలకు మించే అవకాశం లేదని ఆర్థిక శాఖ అంచనా.

వడ్డీలు, అప్పుల అసలు, జీతాలు, ఇతర నిర్వహణ ఖర్చులకు భారీగా నిధులు అవసరం అవుతుండటంతో ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా వివిధ సంస్థల ద్వారా అప్పులు తెచ్చేందుకు, అందుకు ప్రభుత్వం గ్యారంటీర్‌గా వ్యవహరించేందుకు నిర్ణయించింది. తాజాగా రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ ద్వారా 2వేల కోట్ల రూపాయలను బ్యాంక్‌ల నుంచి రుణం తీసుకునేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వనుంది.

ప్రజాసమస్యలపై నేనే నిరాహార దీక్ష చేస్తా!

★ పనిచేయకుంటే కష్టకాలమే..
★ కొందరు ఎమ్మెల్యేలకు చంద్రబాబు వార్నింగ్

ఆంధ్రభూమి బ్యూరో


విజయవాడ, జనవరి 21: చిత్తూరు, అనంతపురం, శ్రీకాకుళం ఎమ్మెల్యేలకు ఇక కష్టకాలమేనని, పనిచేయకపోతే మీకు ఇబ్బందులు తప్పవని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఉండవల్లిలో జరుగుతున్న టీడీపీ ఒకరోజు వర్క్‌షాప్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ 'నేనే మీదగ్గరకు వచ్చి నిరాహార దీక్ష చేస్తా.. అప్పుడైనా మీపైన ఒత్తిడి పెరుగుతుంది' అని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో గాంధీజీ ఇదే పద్ధతి అనుసరించారని గుర్తుచేశారు. ప్రజలు ఎంతో నమ్మకంతో మనల్ని గెలిపించాక పనిచేయకపోతే ఎలా? అని ప్రశ్నించారు. మూడు జిల్లాల పార్టీ ఎమ్మెల్యేలు పనితీరు మార్చుకోవాలని హితవు పలికారు. 'అన్ని గ్రామాల్లో సిమెంట్ రోడ్లు వస్తున్నాయి. మట్టిరోడ్లు కనిపించడం లేదు. ఒక సమస్యను పరిష్కరిస్తుంటే మరో సమస్య ముందుకొస్తోంది. బురద అవుతుందని సిమెంట్ రోడ్డు వేస్తే మోకాళ్ల నొప్పులు వస్తున్నాయి. ఆరోగ్యం దెబ్బతింటుంది' అంటూ ఈ విషయాన్ని అందరూ అర్థం చేసుకోవాలన్నారు. 'మా ఊరు వెళితే అన్నీ సిమెంట్ రోడ్లుగా మారాయి. ఎక్కడా ఒక్క మట్టిరోడ్డు కూడా కనిపించలేదు' అని సీఎం తెలిపారు. వచ్చే ఏడాది జూదాల నియంత్రణపై దృష్టి పెట్టాలని, కోస్తా జిల్లాల్లో మహిళలపై జరుగుతున్న అరాచకాలను అదుపు చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలు ప్రజలను రెచ్చగొడుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో కోడిపందాలను నేతలే ప్రోత్సహించడం సరికాదన్నారు. సంప్రదాయాలు కాపాడుకునే క్రమంలో జూదాలు ఎక్కువైతే సహించేది లేదని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది జూదాలను నియంత్రించడంపైనే ఫోకస్ పెట్టాలని నేతలకు సూచించారు. హైదరాబాద్‌కు డబ్బులు వచ్చాయి.. ఆతర్వాత పబ్బులు వచ్చాయి.. పబ్బుల్లోకి డ్రగ్స్ వచ్చాయంటూ చంద్రబాబు చమత్కరించారు.

'నవయుగ'కు పోలవరం పనులు

పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే, స్పిల్ చానల్ పనులు చేపట్టేందుకు నవయుగ సంస్థ ముందుకొచ్చిందని, ఆ సంస్థకే కాంట్రాక్టు ఇచ్చేందుకు ఆమోదిస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. పాత రేట్లకే పనులు చేపట్టేందుకు నవయుగ సంస్థ ముందుకొచ్చిందన్నారు. నవయుగ ప్రతిపాదనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించాయని సీఎం తెలిపారు. రెండు రోజుల్లో ఎస్క్రో అకౌంట్ తెరుస్తామని, ఎట్టి పరిస్థితుల్లో 2019 నాటికి పోలవరం ప్రాజెక్ట్ పూర్తిచేస్తామని మరోసారి స్పష్టం చేశారు. పోలవరం విషయంలో పారదర్శకతతో ఉన్నామని, విమర్శలకు అవకాశం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. కాగా, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నాయకులు ప్రణాళికలు రచించుకోవాలని చంద్రబాబు సూచించారు. నేతల పనితీరు బాగుంటే ప్రజలు నిరంతరం వారిని ఆదరిస్తారన్నారు. రాష్ట్రంలో టీడీపీని ఓడించే శక్తి ఎవరికీ లేదని ధీమా వ్యక్తం చేశారు. పోలవరంతో రాష్ట్ర ముఖచిత్రమే మారిపోతుందన్నారు. కాంట్రాక్టర్లు ఎవరన్నది అనవసరమని, ప్రాజెక్టులు సకాలంలో పూర్తిచేయడమే తమ సంకల్పమన్నారు. ఎన్నికలంటే గతంలో ప్రభుత్వ వ్యతిరేకత మీద ఆధారపడి ఉండేవని, ఇప్పుడు పనితీరుపై ఆధారపడి ఫలితాలు వస్తాయన్నారు. హైదరాబాద్‌కు మనం చేసిందేమీ లేదని కొందరు అంటున్నారని, 1995కు ముందు, ఆతర్వాతి హైదరాబాద్ ఎలావుందో చూస్తే వాస్తవం అర్థమౌతుందని చంద్రబాబు స్పష్టం చేశారు.

జనం నాడి పడుతున్న జనసేనాని!

■ పీఆర్పీ అనుభవాలతో ముందుజాగ్రత్తలు
■ అభిమానులను కట్టడి చేస్తున్న పవన్
■ బహిరంగ లేఖ లక్ష్యం అదే



ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 21: పార్టీకి, తనకు బలం, బలహీనతగా మారిన అభిమానుల విషయంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆచితూచి అడుగులు వేస్తున్నారు. తాను ప్రచారం చేసిన ప్రజారాజ్యం పార్టీ పతనానికి, ఉభయ గోదావరి జిల్లాల్లోనూ సింహభాగం స్థానాలు కైవసం చేసుకోలేకపోవడానికి వెనుక కారణాలు పసిగట్టిన పవన్, తన జనసేనకూ అలాంటి దుస్థితి రాకుండా ఇప్పటినుంచే అడుగులు వేస్తున్నట్లు ఆయన ఇటీవలి కాలంలో రాస్తున్న లేఖలు, చేస్తున్న ప్రసంగాలు స్పష్టం చేస్తున్నాయి. తాజాగా సోషల్ మీడియాలో పవన్ అభిమానులు, విమర్శకులకు మధ్య పతాక స్థాయిలో జరుగుతున్న మాటల యుద్ధం వికటించి చేయిచేసుకునే వరకూ వెళ్లడం, అది మీడియాలో ప్రముఖంగా రావడంతో పవన్ నష్ట నివారణకు దిగాల్సి వచ్చింది. ముఖ్యంగా పవన్ నటించిన అజ్ఞాతవాసి సినిమా ఫెయిలయిందంటూ ఆవేదన చెందిన పవన్ అభిమాని, స్వయంగా ఆయన పోస్టర్‌ను కొట్టిన దృశ్యాలకు రెచ్చిపోయిన పవన్ అభిమానులు సదరు సహచర అభిమానిని గుర్తించి పట్టుకుని మరీ అతని దుస్తులు విప్పి గాయపరిచి అదే పోస్టర్‌కు బలవంతంగా దండం పెట్టించిన వీడియో హల్‌చల్ చేసింది. ఒకరకంగా అది ప్రజల్లో వ్యతిరేక సంకేతాలు పంపినట్లయింది. ఇలాంటి వికృత, హింసాత్మక చర్యల ప్రభావం భవిష్యత్తులో పార్టీపై పడుతుందని గ్రహించిన పవన్ దిద్దుబాటు చర్యలకు దిగి, అభిమానులకు లేఖ రాయవలసి వచ్చింది. తనను ఎవరు దూషించినా, మాటలతో అవమానించినా, తనను వ్యక్తిగతంగా, పార్టీపరంగా కించిపరిచినా ఎవరూ స్పందించవద్దని పవన్ తన లేఖలో కోరాల్సి వచ్చింది. జనక్షేత్రంలో దిగేవరకూ అంతా సంయమనం పాటించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. పవన్ లేఖ రాసిన రోజునే ఆయనను తరచూ విమర్శించే విమర్శకులు కూడా మెత్తబడటం, ఇకపై పవన్ గురించి వ్యక్తిగతంగా ఎక్కడా మాట్లాడబోమని హామీ ఇవ్వడం చకచకా జరిగిపోయాయి. 'కల్యాణ్ గారి పార్టీకి అభిమానులే బలం, బలహీనత. వారు లేకపోతే కార్యక్రమాలు సక్సెస్ కావు. అలాగని వారిని పూర్తిగా నెత్తిన పెట్టుకోవడం కష్టం. అలాగని వదిలేస్తే, ఆలోచన లేకుండా ఉండే వారి ఆవేశం భవిష్యత్తులో పార్టీకి నష్టం కలిగిస్తుంది. పీఆర్పీ అనుభవం మాకందరికీ ఇదే చెప్పింది. అందుకే ఇప్పటినుంచే అభిమానులను ఒక పద్ధతి ప్రకారం, వారు ఇబ్బంది పడకుండా వ్యవహరించాల్సి ఉంది' అని జనసేన నేత ఒకరు వ్యాఖ్యానించారు. చిరంజీవి పీఆర్పీ స్థాపించినప్పుడు కూడా అభిమానులే కీలక పాత్ర పోషించారు. వారి అత్యుత్సాహం, తమ వర్గానికి చెందిన వ్యక్తిని ఎలాగైనా సీఎం చేయాలన్న తపనతో మిగిలిన వర్గాలను సమన్వయం చేసుకోలేకపోవడం, పార్టీపై పడిన కాపు ముద్ర కలిసి పుట్టిముంచాయి. ప్రధానంగా ఉభయ గోదావరి జిల్లాల్లో బలంగా ఉండే కాపులను బీసీ వర్గాలు సంప్రదాయకంగా వ్యతిరేకిస్తాయి. ఆ సమయంలో ఒక వర్గానికి చెందినవారు, అభిమానులు మోతాదుకు మించి వ్యవహరించడంతో 'అధికారంలోకి రాకముందే పరిస్థితి ఇలా ఉంటే ఇక అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంకెంత భయంకరంగా ఉంటుందో'నన్న ప్రచారం క్షేత్రస్థాయికి వెళ్లడం కూడా పీఆర్పీ ఓటమికి మరో ప్రధాన కారణమయింది. పీఆర్పీలో ఎక్కువ మంది కాపులే ఉండటం, ఆ పార్టీపై కులం ముద్ర పడటంతో ఆ వర్గాన్ని వ్యతిరేకించే మిగిలిన సామాజికవర్గాలన్నీ ఏకమై పీఆర్పీని ఓడించాయి. ఫలితంగా చిరంజీవి తన సొంత నియోజకవర్గంలో ఓడిపోయి, బలిజల సహకారంతో తిరుపతిలో స్వల్ప మెజారిటీతో గెలిచి గట్టెక్కాల్సి వచ్చింది. ఇలాంటి అనుభవాలను పరిగణనలోకి తీసుకున్న పవన్, భవిష్యత్తులో జనసేనకు అలాంటి పరిస్థితి రాకుండా ఇప్పటినుంచే జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆయన చర్యలు స్పష్టం చేస్తున్నాయి. పీఆర్పీ సమయంలో చిరంజీవి చుట్టూ ప్రైవేటు సైన్యం ఎక్కువగా ఉండటంతో ఆయన జనంలోకి వెళ్లలేకపోయారు. చిరంజీవి మీడియా సమావేశాల్లో కూడా అభిమానులు చొరబడి గందరగోళం సృష్టించేవారు. చిరంజీవిని ఎవరైనా విమర్శిస్తే వారిపై దాడులకు దిగేవారు. ప్రస్తుతం పవన్ పర్యటనల్లోనూ అవే దృశ్యాలు పునరావృతం కావడం జనసేన నేతలను ఆందోళనకు గురిచేస్తోంది. పవన్‌కు వ్యతిరేకంగా మాట్లాడితే వారిపై నేరుగా దాడి చేయడం, విలేఖరుల సమావేశాల్లో కూడా చొరబడి మీడియాను ప్రశ్నలు వేసే అవకాశం లేకుండా జిందాబాదులు కొట్టడంతో పాటు, వారే విలేఖరుల మాదిరిగా ప్రశ్నలు వేయడం వంటి చర్యలు చికాకు తెప్పిస్తున్నా, వారిని అదుపు చేయలేని పరిస్థితి కొనసాగుతోంది. అటు పవన్ తనకు కులాలు, మతాలు లేవని చెబుతున్నప్పటికీ, ఆయన పర్యటనలో కనిపించే ఫ్లెక్సీలు, కనిపించే వారంతా కాపు సామాజిక వర్గానికి చెందినవారే కావడంతో, తిరిగి పీఆర్పీ మాదిరిగా పార్టీపై కులముద్ర పడే అవకాశం ఉందన్న ఆందోళన జనసేన నేతల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకునే పవన్.. ఇటీవలి కాలంలో అభిమానులను సున్నితంగా నియంత్రించే అంశంపై దృష్టి సారించినట్లు కనిపిస్తోంది.

రోజువారీ ధరలతో మాయాజాలం!

★ లీటర్ రూ. 80కి చేరువలో పెట్రోల్
★ అదే స్థాయిలో డీజిల్ ★ 50రోజుల్లో రూ. 10 పెరుగుదల

ఆంధ్రభూమి బ్యూరో

కర్నూలు, జనవరి 21 : పెట్రోల్ ధర ఒక రూపాయి పెరిగినా రోడ్లెక్కి ఆందోళనలు చేసిన జనం ఇప్పుడు ఎంత ధర పెరిగినా మౌనంగానే ఉంటున్నారు. రోజువారీ ధరల మార్పు నిర్ణయంతో ప్రతి రోజూ పెట్రోల్ ధర పెరుగుతూ లీటర్ పెట్రోల్ రూ. 80కి చేరువవుతున్నా ప్రజలు నిస్సహాయ స్థితిలో ఉన్నారు. గత 50 రోజుల్లో లీటర్ పెట్రోర్ ధర ఏకంగా రూ. 10.43 పెరిగినా నోరు విప్పకుండా భారం మోస్తూనే ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రజలు లోలోన తీవ్ర ఆగ్రహంతో ఉన్నా అవసరమైన సమయంలో బహిరంగ పడతారన్న భావన వ్యక్తమవుతోంది. కేంద్ర ప్రభుత్వం రోజు వారీ ధరల మార్పు నిర్ణయం తీసుకున్న తరువాత 3 రోజులు మాత్రమే తగ్గుదల కనిపించదని మిగిలిన అన్ని రోజుల్లోనూ ధరల్లో పెరుగుదల నమోదవుతోందని పెట్రో డీలర్లు సైతం పేర్కొంటున్నారు. కర్నూలులో డిసెంబర్ 1వ తేదీ లీటర్ పెట్రోల్ ధర రూ. 67.71 ఉండగా 21వ తేదీ ఆదివారం నాటికి అది రూ. 78.14లకు చేరింది. అంటే సరిగ్గా 50 రోజుల వ్యవధిలో లీటర్ పెట్రోల్‌పై రూ. 10.43 పెరిగినట్లు పెట్రోల్ డీలర్ల ద్వారా వెల్లడవుతోంది. ఇక డిసెంబర్ 1వ తేదీ రూ. 67.71, 15వ తేదీ రూ. 70.50, ఈ ఏడాది జనవరి 1వ తేదీ రూ. 71.78, 15వ తేదీ రూ. 74.20 ఉండగా తాజాగా రూ. 78.14గా ఉంది.

ఇక గత వారం రోజుల్లో లీటర్ పెట్రోల్‌పై రూ. 3.90 పెరగడం గమనార్హం. పెట్రోల్ ధరతో పాటు డీజిల్ ధర కూడా గత 50 రోజుల్లో అదేస్థాయిలో పెరిగినట్లు డీలర్లు స్పష్టం చేస్తున్నారు. అంతర్జాతీయ క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా, పెరిగినా ఇక్కడ మాత్రం పెరుగుదలే నమోదవుతోందని వారు వెల్లడిస్తున్నారు. కాగా పెట్రోల్ ధర దేశంలో అన్ని రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువగా ఉన్నట్లు వారు స్పష్టం చేస్తున్నారు. పొరుగున ఉన్న కర్నాటక కంటే మన రాష్ట్రంలో పెట్రోల్‌పై లీటరుకు రూ. 6, తమిళనాడు కంటే రూ. 4, తెలంగాణ కంటే రూ. 2 ఎక్కువగా ఉందని వారంటున్నారు. కాగా పెట్రో ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకొస్తే వినియోగదారులకు ఊరట లభిస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు. అంతేగాక చిన్న తేడాతో దేశ వ్యాప్తంగా ఒకే ధర అమలులో ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు. పెట్రోల్ ధరల్లో పెరుగుదలతో ఉడికిపోతున్న ప్రజలు భవిష్యత్తులో ఏదో ఒక రోజు బహిరంగపడి తీవ్ర చర్యలకు దిగుతారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బడ్జెట్ సమావేశాల్లో 'చలో అమరావతి'

• మండలాల్లో యాత్రలు, ఆందోళనలు
• రేపు, ఎల్లుండి బాధితుల సర్వసభ్య సమావేశాలు
• నష్టపరిహారం చెల్లింపు నిర్ణయం హర్షణీయం
• అగ్రిగోల్డ్ బాధితుల భవిష్యత్ కార్యాచరణ:ముప్పాళ్ల

విజయవాడ (బెంజిసర్కిల్), జనవరి 21: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తున్న నేపథ్యంలో వచ్చే బడ్జెట్ సమావేశాల్లో బాధితులతో కలిసి 'చలో అమరావతి' ఆందోళన కార్యక్రమం నిర్వహించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్ణయించింది. దీంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా మండలాల్లో బాధితులకు భరోసా కల్పించేందుకు యాత్రలు, ఆందోళనలు నిర్వహించనున్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో బాధితులకు చైతన్యం కలిగించే క్రమంలో సర్వసభ్య సమావేశాలు కూడా నిర్వహించాలని నిర్ణయించారు. ఇదే సమయంలో ఆత్మహత్యలు చేసుకున్న బాధితులకు పోస్టుమార్టం రిపోర్టు లేకుండానే నష్టపరిహారం చెల్లించాలని ఏపీ కేబినెట్ నిర్ణయం తీసుకోవడం పట్ల అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. విజయవాడలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అసోసియేషన్ భవిష్యత్ కార్యాచరణను వెల్లడించారు. అగ్రిగోల్డ్ సంస్థ మూతపడి ముడేళ్లు కాగా, కేసు కోర్టుకెళ్లి రెండేళ్లవుతున్నా బాధితులకు ఇంకా న్యాయం జరగలేదన్నారు. న్యాయస్థానంలో యాజమాన్యం లిటిగేషన్లు సృష్టిస్తూ మార్చి వరకు గడువు ఇస్తే బాధితులకు తామే డబ్బులు చెల్లిస్తామనే ప్రతిపాదన తాజాగా తెరపైకి తీసుకొచ్చిందన్నారు. ఇది కుట్రపూరితంగా ఉందని ముప్పాళ్ల విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 20లక్షల మంది బాధితులకు తక్షణమే 3965 కోట్ల రూపాయలను చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు చెపట్టాలన్నారు. గత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సీఎం చంద్రబాబు హామీ ప్రకారం డిపాజిట్లు తిరిగి చెల్లిస్తారన్న ఆశ పెరిగిందని, కానీ కేసు జాప్యం అవుతుండటంతో బాధితుల్లో రోజురోజుకీ ఆందోళన పెరుగుతోందని చెప్పారు. కేసు వాయిదా పడిన సందర్భంలో తీర్పు ఎలా వస్తోందోననే ఆందోళనతో బాధితులు రోజూ చచ్చిబతుకుతున్నారని చెప్పారు. బాధితుల్లో మనోధైర్యం పెంచే క్రమంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో త్వరలోనే మండల స్థాయిలో రెండు లేదా మూడురోజుల పాటు జీపుయాత్రలు నిర్వహిస్తామన్నారు. సత్వరమే బాధితులకు న్యాయం చేసేందుకు మండల కేంద్రాల్లో మూడు రోజుల ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. అప్పటికీ ప్రభుత్వం నుండి స్పందన రానిపక్షంలో బడ్జెట్ సమావేశాల్లో 'చలో అమరావతి' కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. హైకోర్టు ధర్మాసనం కూడా బాధితుల సమస్యపై సానుకూలంగా స్పందించి సత్వర న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇదే సమయంలో ఆత్మహత్యలకు పాల్పడిన, గుండెపోటుతో మరణించిన వారి కుటుంబాలకు పోలీసు ఎఫ్ఐఆర్, పోస్టుమార్టం రిపోర్టుతో సంబంధం లేకుండా 5లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని సీఎం చంద్రబాబు కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అసోసియేషన్ పోరాటం కారణంగానే మార్చి 12న ప్రభుత్వం నష్టపరిహారం చెల్లింపు కోసం జీవో తీసుకొచ్చిందన్నారు. అయితే ఇందులో ఉన్న నిబంధనలు బాధితులకు న్యాయం చేయలేకపోయాయన్నారు. ఈనేపథ్యంలో అసోసియేషన్ చైతన్య యాత్ర నిర్వహించడంతో పాటు విజయవాడలో 30 గంటల నిరాహార దీక్ష చేపట్టడంతో ప్రభుత్వం స్పందించిందన్నారు. నిబంధనలను సరళతరం చేస్తూ చంద్రబాబు నిర్ణయం తీసుకుని పరిహారం చెల్లింపునకు జీవో ఇవ్వాలంటూ సంబంధిత శాఖను ఆదేశించారని ముప్పాళ్ల వివరించారు.



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

కుయ్యో.. మొర్రో..!

★ కూత సన్నగిల్లుతూ పడకేస్తున్న '108'
★ రాష్ట్ర ప్రజలకు దూరమౌతున్న ప్రాథమిక వైద్యసేవలు
★ అత్యవసర మందుల్లేవు.. సిబ్బందికి జీతభత్యాల్లేవు
★ నిర్వహణ సంస్థలు మారినా దయనీయ పరిస్థితులే..
★ ప్రభుత్వ సాయం కోసం సిబ్బంది ఎదురుచూపులు



విజయవాడ (బెంజిసర్కిల్), జనవరి 21: అత్యవసర పరిస్థితుల్లో ఏసమయంలోనైనా నేనున్నానంటూ కుయ్.. కుయ్.. కుయ్.. అంటూ మరుక్షణమే ప్రత్యక్షమై క్షతగాత్రుల ప్రాణాలకు భరోసానిచ్చిన 108 అంబులెన్స్‌లు నేడు కుయ్యో.. మొర్రో అంటూ దయనీయ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. అక్కరుకు రాని మందులు, వెంటాడుతున్న వాహన మరమ్మతులు, చాలీచాలని సబ్బంది.. వెరశి రాష్ట్రంలో 108 అంబులెన్స్‌ల కూత సన్నగిల్లేలా చేస్తున్నాయి. స్వచ్ఛంద సేవలో భాగంగా ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభమైన 108 సేవలు నేడు దయనీయంగా మారాయి. ప్రభుత్వం అత్యవసరంగా దయతలిస్తే తప్ప 108 నడిచే పరిస్థితి నేడు కనిపించడం లేదు. 2005 ఆగస్టు 15న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేతులమీదుగా సుమారు 70కోట్ల రూపాయల సొంత నిధులతో నాటి సత్యం కంప్యూటర్స్ అధినేత రామలింగరాజు 108 సేవలకు ఉమ్మడి రాష్ట్రంలో శ్రీకారం చుట్టారు. ప్రారంభంలో కేవలం 50 వాహనాలతో నడిచిన ఈ సేవలను రాజశేఖరరెడ్డి చొరవ తీసుకుని 800 వాహనాల వరకూ విస్తరించారు. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్‌కు 468 వాహనాలను కేటాయించగా ప్రస్తుతం వాటి సంఖ్య గణనీయంగా తగ్గిపోతూ వస్తోంది. ఇందుకు అనేక కారణాలున్నా ప్రధానంగా ప్రభుత్వ నిర్లక్ష్యమే ఎక్కువగా కనిపిస్తోంది. సత్యం కంప్యూటర్స్‌లో నెలకొన్న అనిశ్చితితో ఈ సేవలను జీవీకే సంస్థ తన భుజాలపై వేసుకుంది. వాహనాల నిర్వహణ, సిబ్బంది జీతభత్యాల చెల్లింపులో విఫలం కావడం, ఉద్యోగులు, ప్రజల తీవ్ర నిరసనల మధ్య 2017 డిసెంబర్ 13 నుండి రాష్ట్రంలో 108 సేవలను యుకే ఎస్ఎఎస్‌డీవీజే సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం బదలాయించింది. సంస్థలు మారినప్పటికీ 108 నిర్వహణలో లోపాలు మాత్రం సరికాలేదు. 108 వాహనంలో ఐదుగురు సిబ్బందితో పాటు అత్యవసర వినియోగం కోసం 103 రకాల మందులను సంస్థ సరఫరా చేయాల్సి ఉండగా నామమాత్రపు చర్యలతోనే సరిపుచ్చుతున్నారు. అవసరాలకు తగినంతగా సిబ్బంది లేకపోవడంతో ఉన్నవారిపై పనిభారం పడుతోంది. దీనికితోడు వాహనాల మరమ్మతుల కోసం అప్పటి జీవీకే సంస్థ చేసుకున్న ఒప్పందాలకు అనుసరించి ఖర్చు చెల్లించకపోవడంతో మెకానిక్ షెడ్ యాజమాన్యం వాహనాలను రహదారిపైకి రానివ్వడం లేదు. ఈ పరిస్థితుల్లో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 80 వరకు వాహనాలు షెడ్లకే పరిమితమయ్యాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్రలో ఈ పరిస్థితి తీవ్రంగా ఉంది. వీటి నిర్వహణ ఖర్చుల కింద జీవీకే సంస్థ సుమారు 10 కోట్ల రూపాయల వరకు చెల్లించాల్సి ఉంది. ఇక సిబ్బంది పరిస్థితి మరీ దయనీయంగా మారింది. మూడు నెలలుగా వారికి యాజమాన్యం జీతాలు కూడా చెల్లించడం లేదు. ఒక్కొక్కరికి సుమారు 40 వేల రూపాయల వరకు బకాయి పడింది. ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్‌మెంట్ కూడా చెల్లించలేదని సిబ్బంది చెబుతున్నారు. నూతన యాజమాన్యం వచ్చినప్పటికీ ఉద్యోగ ధృవీకరణ పత్రాలు కూడా ఇవ్వలేదని 108 కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్‌కుమార్ ఆదివారం ఇక్కడ తెలిపారు. యాజమాన్యం జీతాలు చెల్లించనప్పటికీ అత్యవసర విభాగంలో ఉన్నందున ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తాము సేవలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఇదేవిషయమై ముఖ్యమంత్రి సహా సంబంధింత శాఖ మంత్రికి పలుమార్లు వినతిపత్రాలు అందించినట్లు చెప్పారు. ఇంతటి దయనీయ స్థితికి చేరిన 108 సేవలపై ప్రభుత్వం అత్యవసరంగా స్పందించాల్సిన అవసరముంది.

వినియోగదారుడే రారాజు!

★ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
★ ఇంధన శాఖ సలహాదారు రంగనాథంకు
26న జీవన సాఫల్య పురస్కార ప్రదానం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 21: ఏ రంగంలోనైనా వినియోగదారుల సంతృప్తే పరమావధిగా పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. ఏ సంస్థకైనా వినియోగదారుడే రారాజు అని స్పష్టం చేశారు. ఇదే స్ఫూర్తితో విద్యుత్ రంగంలో కె రంగనాథం 50 ఏళ్లుగా అందిస్తున్న సేవలు ఎనలేనివని కొనియాడారు. ప్రభుత్వ ప్రజానుకూల విధానాలకు తోడు ఇలాంటి వారి సేవలు, అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధి వల్లే లోటు విద్యుత్‌తో సతమతమైన ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు మిగులు విద్యుత్ కలిగిన రాష్ట్రంగా అవతరించిందని చెప్పారు. ఇంధనం, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన శాఖల సలహాదారుగా రంగనాథం విశేష సేవలందిస్తున్నారని, ఆయన సేవలు భవిష్యత్తులోనూ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. విద్యుదుత్పత్తి, సరఫరా, పంపిణీల్లో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ సంస్థల తరపున జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేయాలని నిర్ణయించారు. అమరావతిలో ఈ నెల 26న నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రంగనాథానికి ఈ అవార్డును అందజేస్తారు. 2002లో రంగనాథం ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీగా ఉన్నప్పుడు లక్ష్యానికి మించి రెవెన్యూ వసూళ్లు సాధించారని, అదే సమయంలో ఆనాడు ఇతర రాష్ట్రాలు భారీ డిమాండ్, వసూళ్ల తేడాతో సతమతమవుతున్నాయని చంద్రబాబు గుర్తుచేశారు. రంగనాథంను సలహాదారుగా నియమింపజేయడంలో ముఖ్యపాత్ర పోషించిన ఇంధన, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, సీఆర్‌డీఏల ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్ అందించిన వివరాల ప్రకారం దేశంలోనే తొలిసారిగా విద్యుత్ రంగంలో తిరుపతిలో స్పాట్ బిల్లింగ్ వ్యవస్థను ప్రవేశపెట్టడంలో రంగనాథం ఎంతో కృషిచేశారని ముఖ్యమంత్రి ప్రశంసించారు. తప్పుడు మీటర్ రీడింగ్‌లు, డిమాండ్ నోటీసులకు రశీదులు ఇవ్వకపోవడం వంటి అనేక ఫిర్యాదులు వస్తున్న ఆ సమయంలో తొలిసారిగా స్పాట్ బిల్లింగ్ విధానాన్ని ప్రవేశపెట్టామని గుర్తుచేశారు. వినియోగదారులు పూర్తిగా సంతృప్తి వ్యక్తం చేయడంతో ఆ విధానాన్ని తర్వాత రాష్ట్రమంతటా అమలు చేసినట్లు చెప్పారు. ఈసందర్భంగా ఆయన ప్రిన్సిపల్ సెక్రటరీ జి సాయిప్రసాద్, అజయ్ జైన్, ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ, జెన్‌కో ఎండీ కె విజయానంద్‌లతో మాట్లాడారు. విద్యుత్ రంగంలోని ఇంజనీర్లందరికీ రంగనాథం స్ఫూర్తిప్రదాత, రోల్ మోడల్ అని అజయ్ జైన్ కొనియాడారు. విశాఖలో హుదూద్ తుపాను విధ్వంసం సృష్టించిన సమయంలో ఆయన స్వచ్ఛందంగా ముందుకొచ్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఏపీ ట్రాన్స్‌కో జేఎండీలు దినేష్ పరుచూరి, ఉమాపతి, డిస్కంల సీఎండీలు ఎంఎం నాయక్, హెచ్‌వై దొర, విద్యుత్ సంస్థల డైరెక్టర్లు, ఉన్నతాధికారులు, ఏపీఎస్ఈబీ ఇంజనీర్ల అసోసియేషన్ ప్రతినిధులు ఈసందర్భంగా రంగనాథంకు అభినందనలు తెలిపారు.

మీ సహనాన్ని ప్రజలు గమనిస్తున్నారు!

- హోదా లేదు.. ప్యాకేజీ లేదు
- ఏపీ ప్రజలు తెలంగాణ వాసుల్లా ఆందోళనలు చేయరు
- బడ్జెట్ సమావేశాల్లోనైనా హామీలు అమలు కావాలి
- ఆవేశపూరితంగా ఎంపీ అవంతి శ్రీనివాస్ ప్రసంగం
- నేను తిరగబడితే.. ప్రజల్లో అసహనం పెరుగుతుంది
- చివరివరకు ప్రయత్నం.. కాకపోతే దండం పెడదాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందన
- టీడీపీ వర్క్‌షాప్‌లో మిన్నంటిన హర్షధ్వానాలు

విజయవాడ (బెంజిసర్కిల్), జనవరి 21: 'ప్రత్యేక హోదా బదులు ప్రత్యేక ప్యాకేజీ అన్నారు. కాని అదీ లేదు. అప్పటికీ ఓపికగా వారి దయ కోసం ఎదురుచూస్తున్నాం. కానీ విభజన చట్టంలోని హామీలు ఒక్కటి కూడా అమలు కావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో మన సహనాన్ని కేంద్రం పరీక్షిస్తోంది' అని అనకాపల్లి పార్లమెంట్ సభ్యుడు అవంతి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తపర్చారు. ఉండవల్లిలోని సీఎం నివాసం వద్ద గ్రీవెన్స్ సెల్ భవనంలో తెలుగుదేశం పార్టీ ఆదివారం నిర్వహించిన ఒక్కరోజు వర్క్‌షాప్‌లో ఆయన ఆవేశపూరితంగా మాట్లాడుతూ చంద్రబాబు ఏపీకి ముఖ్యమంత్రే కాదు ఐదు కోట్ల మందికి ప్రతినిధి అని, విభజన హామీల అమలు కోసం ఆయన 42సార్లు ఢిల్లీకి వెళ్లి మొరపెట్టుకున్నా వారు ఒక్కటి కూడా అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. కేంద్రం హామీ ఇచ్చిన ప్రత్యేక ప్యాకేజీతో పాటు రైల్వేజోన్ కూడా అమలుకు నోచుకోలేదన్నారు. రానున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనైనా దీనిపై స్పష్టత రావాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబుకు సముద్రమంత సహనం ఉందని అంటూ మీ సహనాన్ని ప్రజలు గమనిస్తున్నా వారికి మాత్రం మీ అంత సహనం లేదని వ్యాఖ్యానించారు. సమయం వచ్చినప్పుడు వారి తీర్పు చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. తెలంగాణ వాసుల్లా ఏపీ ప్రజలు ఆందోళనలు చేయరని, హక్కుల సాధన కోసం ఎంత సమయమైనా ఎదురుచూస్తారని అవంతి అన్నారు. అయితే అవి లభించని పక్షంలో వారే నిర్ణయం తీసుకుంటారన్నారు. ఎంపీ అవంతి ప్రసంగంపై సమావేశంలో హర్షధ్వానాలు మిన్నంటాయి. ఇదే సమయంలో దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర విభజన హక్కుల కోసం తాను అన్ని ప్రయత్నాలూ చేస్తున్నట్లు తెలిపారు. చివరిదాకా ప్రయత్నం చేస్తానని, మిగతావారిలా నేను తిరగబడితే ప్రజలు అసహనానికి గురౌతారని అన్నారు. చివరి వరకు ప్రయత్నిద్దామని, పనులు కాకపోతే కేంద్రానికి దండం పెడదామని ఘాటుగా వ్యాఖ్యానించారు. అప్పటివరకు వేచి చూడాలని చంద్రబాబు అందరినీ కోరారు.

బాబు గద్దెనెక్కితే నిరాదరణే!

ఆదరణ పథకంపై తులసిరెడ్డి విమర్శ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 21: ఎన్నికలకు ముందు హామీలివ్వడం, గద్దెనెక్కిన తర్వాత మరచిపోవడం ముఖ్యమంత్రి చంద్రబాబు సహజ లక్షణమని, ఏరుదాటాక బోడి మల్లన్న అనడం ఆయన నైజమని పీసీసీ అధికార ప్రతినిధి ఎన్ తులసిరెడ్డి విమర్శించారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా 1999 ఎన్నికలకు ముందు బీసీల కోసం ఆదరణ పథకాన్ని ప్రవేశపెట్టి ఎన్నికల తర్వాత తిలోదకాలు ఇచ్చారంటూ ఆయన గుర్తుచేశారు. 2014లో తాము అధికారంలోకి వస్తే ఆదరణ పథకాన్ని పునరుద్ధరిస్తామని టీడీపీ మేనిఫెస్టోలో చెప్పారన్నారు. నాలుగేళ్లయినా పట్టించుకోలేదని, ఎన్నికలొస్తాయి కనుక ఇప్పుడు జ్ఞాపకం వచ్చిందన్నారు. ఇప్పుడు ప్రకటించిన యూనిట్ ఖరీదు రూ. 10వేలు, 20వేలు, 30వేలు చాలవని, ఈ నిధులతో నాణ్యమైన పనిముట్లు లభించవన్నారు. ఇందులోనూ 20 శాతం రుణం, 10 శాతం లబ్ధిదారుని వాటా పేదలకు సాధ్యం కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో ప్రతి సంవత్సరం బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకాలకు ఆర్థిక సహాయం అందేదంటూ ఆయన గుర్తుచేశారు. అమ్మను మమ్మీ అన్నట్లు, పిల్లిని మార్జాలం అన్నట్లు కాంగ్రెస్ పథకానికే చంద్రబాబు ఆదరణ అని పేరు పెట్టారుతప్ప మరేమీ కాదని విమర్శించారు. చంద్రబాబుకు బీసీల పట్ల నిజంగా ప్రేమే ఉంటే ముఖ్యమంత్రి పదవి బీసీలకు ప్రకటించాలని, అంతే తప్ప ఆదరణ లాంటి చిట్కాలను బీసీలు నమ్మబోరని తులసిరెడ్డి స్పష్టం చేశారు.

బోయలను గిరిజనులుగా గుర్తిస్తే మూల్యం తప్పదు

గిరిజన ప్రజాసమాఖ్య జాతీయ అధ్యక్షుడు శంకర్‌నాయక్

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 21: సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా, విద్యా, ఉద్యోగపరం గా ఎంతో అభివృద్ధి చెందిన బీసీ-ఏ గ్రూప్‌లోని బోయలను గిరిజన జాబితాలో చేర్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఇక్కడ చట్టసభల్లో తీర్మానాలు చేయడమేగాక ఆమోదం కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నారని, అదే జరిగితే వచ్చే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని గిరిజన ప్రజాసమాఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్‌నాయక్ హెచ్చరించారు. ఆదివారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో చంద్రబాబు తాను గిరిజనుల్లో ఒకరిగా నిలిచి వారి సంక్షేమానికి పాటుబడతానంటూ 25 హామీలు ఇవ్వగా నేటివరకు వాటిల్లో ఏఒక్కటీ నెరవేరకపోగా గిరిజనుల జీవితాలతో ఆడుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దళితులు, గిరిజనులకు వేర్వేరుగా కమిషన్ల ఏర్పాటుకు జారీ అయిన జీవోలను తుంగలో తొక్కారన్నారు. దళితుడు చైర్మన్‌గా ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ గిరిజనుల సంక్షేమం గురించి ఆలోచించకపోగా బోయ, వడ్డెర, మత్స్యకారులను ఎస్టీలుగా గుర్తించే పనిలోనే నిమగ్నమై ఉందన్నారు.

అనంతపురం, ఇతర రాయలసీమ జిల్లాల్లో బోయలు 11లక్షల మందికి పైగా ఉన్నారనే దురాలోచనతో రాష్ట్రవ్యాప్తంగా 40లక్షల మంది వరకు ఉన్న గిరిజనులకు తీరని అన్యాయం చేయబోవటం ఎంతమాత్రం భావ్యం కాదన్నారు. రాజ్యాంగం తమకు కల్పించిన హక్కులను కాలరాసే అధికారాన్ని బాబుకు ఎవరిచ్చారని శంకర్‌నాయక్ ప్రశ్నించారు. 500 మంది జనాభా కలిగిన గిరిజన తండాలు, గూడెంలను పంచాయతీలుగా గుర్తిస్తానంటూ ఇచ్చిన హామీని బాబు నెరవేర్చలేదని, అయితే తెలంగాణలో కేసీఆర్ ఇందుకోసం రంగం సిద్ధం చేస్తున్నారని అన్నారు. స్వాతంత్ర్యానంతరం తొలిసారిగా రాష్ట్రంలో గిరిజన ఎమ్మెల్యే లేని మంత్రివర్గాన్ని చూస్తున్నామన్నారు.



విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అంబర్ కిషోర్‌ఝా

ముగ్గురు మావోయిస్టు దళ సభ్యుల అరెస్టు

- 130 డిటోనేటర్లు, 51 జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం
- మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు
- జిల్లా ఎస్పీ అంబర్ కిషోర్‌ఝా వెల్లడి

కొత్తగూడెం, జనవరి 21: మావోయిస్టు పార్టీకి చెందిన ముగ్గురు దళ సభ్యులను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్పీ అంబర్ కిషోర్‌ఝా తెలిపారు. ఆదివారం ఇక్కడి ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నుంచి చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి మావోయిస్టులకు అవసరమైన సామగ్రి సరఫరా అవుతోందనే పక్కా సమాచారంతో వాహనాలు తనిఖీ చేశారు. ముగ్గురు దళ సభ్యులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. చర్ల మండల పరిధిలో మడివి సమ్మయ్య, ఓయం నందా, భద్రాచలం పట్టణం సమీపంలోని దేవనగరంలో మెరుగం అర్జున్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి 130 డిటొనేటర్లు, 51 జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకులు చంద్రన్న, ఆనందన్న, హరిభూషణ్‌తో నిందితులకు సంబంధాలున్నట్లు వెల్లడైందన్నారు. మావోయిస్టులకు సహకరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసి ప్రశాంత జీవనం సాగించాలని కోరారు. అమాయకులను మావోయిస్టులు తమ అవసరాలకు వాడుకుంటున్నారని, దీనికి స్వస్తి పకాలని ఎస్పీ హితవు పలికారు. విలేఖరుల సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ సునీల్‌దత్, కొత్తగూడెం డీఎస్పీ ఎస్ఎం అలీ, సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ కెజి అహల్వర్ట్, ఎంటీవో సోములు, ఎస్‌బీ సీఐ సుబ్బారావు పాల్గొన్నారు.

సీబీఐ అదుపులో ఎమ్మెల్సీ వాకాటి

ఆంధ్రభూమి బ్యూరో



నెల్లూరు, జనవరి 21: నెల్లూరుకు చెందిన ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డిని ఆదివారం సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గతంలో బ్యాంకులకు రుణాలు ఎగవేత కేసులో వాకాటిపై కర్నాటకలో పోలీసు కేసు నమోదై ఉంది. ప్రస్తుతం ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేస్తోంది. గత ఏడాది నెల్లూరు నగరంలోని వాకాటి నారాయణరెడ్డి ఇంటిలో సీబీఐ అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. ఆ కేసుకు సంబంధించి విచారణ నిమిత్తం ఆదివారం ఉదయం బెంగళూరులోని సీబీఐ కార్యాలయంలో వాకాటి విచారణకు హాజరయ్యారు. రాత్రి పొద్దుపోయేవరకు సీబీఐ బృందం విచారించింది. ఆయనను అరెస్టు చేశారనే పుకార్లు వ్యాపించినప్పటికీ సీబీఐ అధికారులు మాత్రం అర్ధరాత్రి వరకు ఈ విషయాన్ని ధృవీకరించలేదు.

మరో ఉద్దానం 'పరవాడ'

- పదుల సంఖ్యలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు
- పది రోజుల్లో ఆరుగురు మృతి
- పెరుగుతున్న క్యాన్సర్ రోగుల సంఖ్య
- ప్రభుత్వం మేల్కొనకుంటే ముప్పు తప్పదు

ఆర్. కారునాయుడు



పరవాడ (విశాఖపట్నం), జనవరి 21: శ్రీకాకుళం జిల్లా ఉద్దానం కిడ్నీ వ్యథ మరువక ముందే, పక్క జిల్లా విశాఖలో కిడ్నీ వ్యాధి పడగ విప్పింది. విశాఖ జిల్లా పరవాడ ప్రాంతంలో గత కొద్ది రోజులుగా కిడ్నీ వ్యాధిగ్రస్తులు పెరిగిపోతున్నారు. చాలామందికి ఆ వ్యాధి సోకిందన్న విషయం కూడా తెలియదు. గడచిన మూడు నెలల వ్యవధిలో ఆరుగురు వ్యక్తులు కిడ్నీ వ్యాధితో చనిపోయారు. ఇందురు ముగ్గురు కేవలం వారం రోజుల వ్యవధిలోనే చనిపోవడం గమనార్హం. దీన్నిబట్టి పరవాడలో ఈ వ్యాధి తీవ్రత ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉద్దానంలో వైద్యులు, ప్రభుత్వాల నిర్లక్ష్యం వలన అనేక మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులు ప్రాణాలు కోల్పోయారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు వందల సంఖ్యలో పెరిగిపోయారు. ప్రభుత్వం ముందుగా మేల్కొనక పోవడం వలన ఇక్కడి పరిస్థితి చేయిదాటిపోయింది. వ్యాధిని అరికట్టే పరిస్థితులు కూడా కనిపించడం లేదు. అలాగే పరవాడలో కూడా కిడ్నీ వ్యాధి ప్రమాద ఘంటికలను మోగిస్తోంది.

కిడ్నీ వ్యాధి పరవాడ వాసులపై పగడవిప్పి చాలాకాలమే అయినా ఆ వ్యాధి గురించి గ్రామస్తులు తెలుసుకోలేకపోయారు. వ్యాధి ముదరడంతో రోగి చివరి దశలో ఆసుపత్రికి వెళుతున్నాడు. దీంతో వైద్యులు ఆ రోగిని కాపాడలేక చేతులెత్తేస్తున్నారు. మూడు నెలల వ్యవధిలో సుమారు ఆరుగురు రోగులు కిడ్నీ వ్యాధి బారిన పడి మృత్యువాత పడ్డారు. మరో 30 మంది వరకు ప్రస్తుతం కిడ్నీ వ్యాధి బారిన పడినట్లు నిర్ధారణ జరిగింది. ఇందులో పది మంది వివిధ ఆసుపత్రుల్లో డయాలసిస్ చేయించుకుంటున్నారు.

ఒక్కసారిగా పరవాడ మండలంలో కిడ్నీ వ్యాధి ప్రజ్వరిల్లడానికి గల కారణాలపై అంచనాలు వేస్తున్నారు. నీరు, వాయు కాలుష్యం వలనే ఈ వ్యాధి ప్రబలిందని వైద్యులు చెబుతున్నారు. ఎన్‌టీపీసీ, ఫార్మా యూనిట్ల నుంచి విడుదలవుతున్న కలుషిత జలాలు ప్రజల ప్రాణాలను బలిగొంటున్నాయి.

ఇదిలా ఉండగా కిడ్నీ రోగులతో సమానంగా పరవాడలో క్యాన్సర్ రోగులు పెరుగుతున్నారు. అత్యధికంగా మహిళలు ఈ వ్యాధి బారిన పడి ఆసుపత్రి పాలవుతున్నారు. మహిళలు అధికంగా గర్భ, రొమ్ముకు సంబంధిత క్యాన్సర్స్‌తో బాధపడుతున్నారు. ఈ ప్రాంతంలో క్యాన్సర్ వ్యాధితో పదుల సంఖ్యలో మహిళలు మృత్యువాత పడ్డారు.

వ్యాధులపై కొరవడిన అవగాహన

కిడ్నీ, క్యాన్సర్ వంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన లేదు. కనీసం ప్రజల్లో ఈ వ్యాధుల పట్ల అవగాహన తీసుకువచ్చే విధంగా ప్రభుత్వాలు కృషి చేయడం లేదు. అయితే పరవాడ గ్రామానికి చెందిన ఉప్పు గండివారివీధిలో కిడ్నీ, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు అధికంగా ఉన్నారని సర్పంచ్ చుక్క రాముసాయుడు, ఎంపీటీసీ పయిల శ్రీనివాసరావు తెలిపారు. వీరితోపాటు పరవాడ గ్రామంలో ప్రతీ వీధిలో ఈ వ్యాధి బారినపడిన వారు ఉన్నారు. కిడ్నీ, క్యాన్సర్ వ్యాధి లక్షణాలు తెలియకపోవడంతో వ్యాధులను ముదర పెట్టుకుని ఆసుపత్రికి వెళ్తున్నారు. పరవాడ మరో ఉద్దానం కాకముందే ప్రభుత్వం మేల్కొనాల్సిన అవసరం ఉంది. కానీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మాత్రం ఇక్కడ ప్రబలుతున్న కిడ్నీ, క్యాన్సర్ వ్యాధుల గురించి తమకు ఎటువంటి సమాచారం లేదని చెప్పడం శోచనీయం. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది నిర్లక్ష్యం వలనే ఉద్దానంలో కిడ్నీ వ్యాధి ముదిరిందన్నది ప్రభుత్వం గుర్తించాలి.

కాలుష్యమే కారణం

కిడ్నీ, క్యాన్సర్ వ్యాధులకు కాలుష్యమే కారణం. పారిశ్రామికంగా పరవాడ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో వ్యాధులు అధికం అవుతున్నాయి. ప్రధానంగా జల కాలుష్యం కారణంగా కిడ్నీ వ్యాధులు వస్తున్నాయి. సెల్ టవర్స్ కారణంగా క్యాన్సర్ వంటి రోగులు సోకుతున్నాయి.

- చుక్క రామునాయుడు, సర్పంచ్, పరవాడ

తాగునీటి వల్లే..

తాగునీరు కలుషితం కావడం వలనే అత్యధికంగా కిడ్నీ వ్యాధులు వస్తాయి. ప్రధానంగా తాగునీటిలో ఫ్లోరైడ్ అధికంగా ఉండడం వలన కిడ్నీ వ్యాధులు ప్రబలే అవకాశం అధికంగా ఉంటుంది. ప్రధానంగా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు గ్రామాల్లో మంచినీటి శాంపిల్స్‌ను సేకరించి పరీక్షలు చేయించాలి.

- ప్రసాద్, కిడ్నీ వ్యాధుల నివారణ వైద్యులు, విశాఖపట్నం

మాకు సమాచారం లేదు

పరవాడలో కిడ్నీ, క్యాన్సర్ రోగులు పెరుగుతున్నారన్న విషయమై తమకు ఎటువంటి సమాచారం లేదు. ఒకవేళ స్థానికుల నుండి సమాచారం వస్తే వెంటనే సర్వే నిర్వహించడంతోపాటు పరీక్షలు నిర్వహిస్తాం. ప్రజల్లో అవగాహన తీసుకువచ్చే సదస్సులను నిర్వహిస్తాం.

- రమేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, విశాఖపట్నం

ఏడాదిలో గండికోటకు పర్యాటక వైభవం

ఆంధ్రభూమి బ్యూరో

ఉత్సవాలు ప్రారంభించిన మంత్రి ఆదినారాయణరెడ్డి



కళాకారులతో కలెక్టర్ బాబూరావునాయుడు, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ లింగారెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్వేత, ఇతర అధికారులు

కడప, జనవరి 21 : ఏడాదిలోపు గండికోటకు ఊహించని పర్యాటక వైభవం తీసుకొస్తామని రాష్ట్ర మార్కెటింగ్, పశుసంవర్ధకశాఖ మంత్రి సి.ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. కడప జిల్లాలోని గండికోట క్షేత్రంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటల సమయంలో మంత్రి ఆదినారాయణరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి గండికోట ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆది మాట్లాడుతూ గండికోటను భానుకొండల్లో 900 ఏళ్ల క్రితం నిర్మించారన్నారు. కోటకు కొద్ది మైళ్ల దూరంలో చుట్టూ అగస్త్యేశ్వరకోన, గుర్రప్పకోన, కన్యతీర్థం వంటి 8 కోనలు, గండికోట ప్రాజెక్టు ఉన్నాయన్నారు. అగస్త్యేశ్వరకోన నుంచి గండికోట మీదుగా గండికోట ప్రాజెక్టు వరకూ ఈ కొండల్లో రోడ్డు నిర్మాణం చేపడుతామన్నారు. కోటకు పక్కనే ఉన్న గండి లోయ మీదుగా అవతలి కొండలపైకి వెళ్లేందుకు రోప్‌వేను ఏర్పాటు చేసేందుకు సీఎం చంద్రబాబు రూ. 7.5కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ ప్రాంతంలో త్వరలో స్టీల్‌ప్లాంట్ కూడా రాబోతోందన్నారు. జిల్లాలో సిద్దవటం కోట, కడపలో పెద్దదర్గా వంటి దర్శనీయ స్థలాలు ఉన్నాయన్నారు. ఒంటిమిట్టను భద్రాద్రి కంటే ఘనంగా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు సహకరిస్తున్నారన్నారు. గండికోట చుట్టూ పర్యాటక నిర్మాణాలన్నీ పూర్తయితే కడప జిల్లా ఒక మంచి పర్యాటక కేంద్రంగా మారుతుందన్నారు. కడప జిల్లాను ఫ్యాక్షన్ గడ్డ కాదు, ఫ్యాషన్ గడ్డ అనుకునేలా చేస్తామన్నారు. గండికోట ప్రాజెక్టుకు 40 టీఎంసీల నీరు వదిలిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. అలాగే దేశంలో వెనుకబడిన 150 జిల్లాల్లో కడప జిల్లాను చేర్చినందుకు ప్రధాని మోదీకి కూడా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. గండికోటలో నివశిస్తున్న 150 కుటుంబాలకు తగిన పరిహారం ఇచ్చి కోట వెలుపల ప్రభుత్వమే మంచి ఇళ్లు నిర్మించి ఇచ్చేలా కృషి చేస్తామన్నారు. ఇక పాత్రికేయులకు జిల్లాలోని అన్ని పట్టణాల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన కలెక్టర్‌ను ఆదేశించారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.లింగారెడ్డి మాట్లాడుతూ గోల్కొండ కోటను 420 సంవత్సరాల క్రితం నిర్మిస్తే గండికోటను 900 ఏళ్ల క్రితమే నిర్మించారన్నారు. ఈ కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సంకల్పంతో ఉందని, ఇక్కడికి వచ్చిన వారంతా తమకు తెలిసిన వాళ్లందరికీ కోట గురించి చెప్పాలన్నారు. సినీనటి ప్రజ్ఞాజైశ్వాల్ తెలుగులో రెండు మాటలు మాట్లాడి ఒక సినిమా పాట పాడి సభికులను అలరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మంత్రి ఆదితో పాటు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ చైర్మన్ ఎం.లింగారెడ్డి, కలెక్టర్ టి.బాబూరావునాయుడు, జాయింట్ కలెక్టర్ శ్వేత తెవతియ, జేసీ-2 శివారెడ్డి, పర్యాటకశాఖ రీజినల్ డైరెక్టర్ గోపాల్ పాల్గొన్నారు.

కోట పాలకుల వారసులు హాజరు

గండికోటను పాలించిన పెమ్మసాని వంశానికి చెందిన కొందరు వారసులు, ఆ తర్వాత కాలంలో పాలించిన నంద్యాల రాజుల వంశీకులు గండికోట ఉత్సవాలకు హాజరయ్యారు.

స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్-3లో నిలిచిన ఉత్పత్తి

పునరుద్ధరణకు సాగుతున్న చర్యలు

ఉక్కునగరం, జనవరి 21: ఒక సెక్షన్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో విశాఖ ఉక్కు కర్మాగారంలోని బ్లాస్ట్ ఫర్నేస్-3 విభాగంలో 24 గంటలు పైగా ఉత్పత్తికి అంతరాయం వాటిల్లింది. సమాచారం తెలుసుకున్న వెంటనే సిఎండి మధుసూదనరావుతోపాటు ఇతర ఉన్నతాధికారులు బ్లాస్‌ఫర్నేస్-3లో ఆదివారం సమస్యను పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన ఉత్పత్తి పునరుద్ధరణ పనులను చేపట్టాలని విభాగాధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీనికి సంబంధించి కార్మిక వర్గాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. థర్మల్ పవర్ ప్లాంట్ విభాగంలో సాంకేతిక లోపం కారణంగా శనివారం రాత్రి 8గంటల సమయంలో రెప్పపాటు కాలం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. టీపీపీ విభాగం నుండి బ్లాస్ట్ ఫర్నేస్-3కు అత్యధిక పీడనంతో గాలిని పంపిస్తారు. ఈ గాలి పీడనం తీవ్రత తగ్గింది. దీంతో కోకోఓవెన్, బ్లాస్‌ఫపర్నేస్-3లోని ఉత్పత్తి ప్రక్రియలో ఉపయోగించే రా-మెటీరియల్ మధ్యలోనే నిలిచిపోయింది. దీని కారణంగా బాస్ట్‌ఫర్నేస్-3లో క్యూయర్ల బ్లాక్ అయి ఉత్పత్తికి అంతరాయం కలిగింది. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి యుద్ధప్రాతిపదికన ఉత్పత్తి పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. బ్లాస్ట్ ఫర్నేస్-3లోగల అధికారులు, ఉద్యోగులు నిర్విరామంగా పనిచేసి ఆదివారం రాత్రి 8గంటల సమయానికి 23 క్యూయర్లను సిద్ధం చేసి ఉత్పత్తి ప్రక్రియను పునరుద్ధరణ చేశారు.పూర్తిస్థాయిలో పునరుద్ధరణకు చర్యలు కొనసాగుతున్నాయి. సోమవారానికి మిగిలిన క్యూయర్లను సిద్ధం చేసి ఉత్పత్తిని పునరుద్ధరణ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

పోలవరం 'పవర్' టెండర్లు ఖరారు

- మిగిలిన మట్టి పనులూ నవయుగ చేతికే
- మార్చిలో ప్రారంభం కానున్న కాంక్రీటు పనులు

ఆంధ్రభూమి బ్యూరో



పోలవరం పవర్‌హౌస్ నిర్మాణ ప్రాంతం... ఇక్కడ కనిపిస్తున్న కొండను తొలగించాల్సి వుంది

రాజమహేంద్రవరం, జనవరి 21: ఎట్టకేలకు పోలవరం పవర్‌హౌస్ నిర్మాణ పనులకు టెండర్లు ఖరారయ్యాయి. పోలవరం పవర్‌హౌస్ నిర్మాణ పనులు ఏపీ జెన్కో ఆధ్వర్యంలో నవయుగ సంస్థకు దక్కాయి. సాంకేతిక బిడ్‌లో అన్ని అర్హతలు ఈ సంస్థకు లభించడంతో పవర్‌హౌస్ నిర్మాణ కాంట్రాక్టు నవయుగ సంస్థకు లభించింది. మార్చిలో పవర్ హౌస్ కాంక్రీటు పనులు మొదలయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. పోలవరం హెడ్ వర్క్సులో భాగంగా పోలవరం పవర్‌హౌస్ మట్టి పనులు జరుగుతున్నాయి. కొంతమేర మిగిలిన పోయిన మట్టి పనులు కూడా నవయుగకే దక్కాయి. ఏపీ జెన్కో విద్యుత్ కేంద్ర నిర్మాణ పనులను చేపట్టడానికి గత జనవరిలో గ్లోబల్ టెండర్లు పిలిచింది. టెండర్ల ప్రక్రియ పూర్తయి పనులు చేపట్టడానికి దాదాపు ఏడాది పట్టింది. వాస్తవానికి గత మే నెలలోనే పునాది పనులు చేపట్టాలని అంచనావేశారు. కానీ మట్టి పని మందగించింది. ఆఖరికి మిగులు మట్టి పని కూడా పవర్ హౌస్ నిర్మించే నవయుగనే అప్పగించడంతో ఎట్టకేలకు పనులు ప్రారంభమవుతున్నాయి.

పోలవరం హెడ్‌వర్క్సులో మిగిలిపోయిన సుమారు రూ. 1400 కోట్ల అంచనా విలువ కలిగిన మిగులు పనులను టెండర్ల ద్వారా ఇతర సంస్థలకు అప్పగించారు. ఇందులో భాగంగా సుమారు రూ.200 కోట్ల అంచనా విలువైన పోలవరం పవర్‌హౌస్‌లో మిగులు మట్టి పనులను నవయుగకు 6సి కింద పోలవరం ప్రధాన కాంట్రాక్టర్ ట్రాన్స్‌స్ట్రాయ్ నుంచి తీసుకుని అప్పగించారు. దీంతో ఇటు పవర్‌హౌస్ నిర్మాణంతో పాటు మిగులు మట్టిపని వెరసి సుమారు రూ.3500 కోట్ల అంచనా విలువైన పవర్‌హౌస్ పనులు నవయుగకు దక్కాయి. ఫిబ్రవరి మొదటి వారం మట్టిపని చేపట్టనున్నారు. ఇంతవరకు ఈ మట్టిపనులను ప్రధాన కాంట్రాక్టు సంస్థ ట్రాన్స్‌స్ట్రాయ్ ఆధ్వర్యంలో త్రివేణి సంస్థ నిర్వహించింది. వాస్తవానికి ఇప్పటికే మట్టిపని పూర్తి కావాల్సివుంది. అఖండ గోదావరి నది ఎడమ గట్టు వైపు దేవీపట్నం మండలం అంగుళూరు గ్రామాన్ని ఖాళీ చేయించి పోలవరం పవర్‌హౌస్ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ ప్రాంతంలో ప్రధానంగా కొండను తొలగించాల్సి వుంది. ఈ కొండను తొలగిస్తే తప్ప అసలైన కాంక్రీటు పనులు చేపట్టడానికి అవకాశం లేదు. ఈక్రమంలో నవయుగ సంస్థ ప్రధానమైన కొండ తొలగింపు పనులు, మిగిలిపోయిన మట్టి పనులు పూర్తి చేయనుంది. ఈ పనులు పూర్తయ్యాక అసలు పనులు ప్రారంభం కానున్నాయి. దీనితో మార్చిలో కాంక్రీటు పనులు చేపట్టే అవకాశముంది. కాగా పవర్‌హౌస్‌లో కీలకమైన టర్బైన్లను బిహెచ్ఇఎల్‌తో సంయుక్తంగా నవయుగ సంస్థ ఇక్కడే నిర్మాణం చేపట్టనుందని తెలుస్తోంది.

ఎక్కడో తయారైన టర్బైన్లు ఇక్కడకు తీసుకురావడానికి రవాణాలో ఇబ్బందులు తలెత్తుతాయని భావించడంతో పవర్ హౌస్ నిర్మాణం స్థలంవద్దే భారీ టర్బైన్లు తయారీకి సన్నాహాలు జరుగుతున్నట్టు సమాచారం. పోలవరం ఎడమ ప్రధాన కాల్వ వైపు నిర్మిస్తున్న అండర్ టన్నెల్స్‌ను అనుసంధానం చేసుకుని పవర్‌హౌస్ నిర్మాణ పనులు పూర్తిచేయాల్సి వుంది. ఒక్కోటి 115 మీటర్ల పొడవు కలిగిన మొత్తం 12 టన్నెల్స్‌ను నిర్మిస్తున్నారు. ఈ టన్నెల్స్ నమూనా అధ్యయనం అనంతరం నివేదికను పవర్‌హౌస్ నిర్మాణానికి అనుసంధానం చేసుకుంటూ నిర్మాణం చేపట్టాల్సి వుంది.

బహుళార్ధసాధక ప్రాజెక్టు పోలవరంలో భాగంగా చేపడుతున్న 960 మెగావాట్ల హైడల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం కూడా విశేష రీతిలోనే నిర్మాణం కానుంది. అతి తక్కువ ధరకు విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునే అవకాశముండటంతో రాష్ట్ర ప్రభుత్వమే హైడల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నిర్మాణాన్ని చేపట్టింది. అంగుళూరు గ్రామం వద్ద 303 ఎకరాల్లో ఒక్కోటి 80 మెగావాట్ల సామర్ధ్యంతో 12 యూనిట్ల కేంద్రాన్ని నిర్మించనున్నారు. ఈ పవర్‌హౌస్‌లో పోలవరం ప్రాజెక్టు ద్వారా నీరు తీసుకుని, విద్యుత్ ఉత్పత్తి తర్వాత గోదావరి నదిలోకి (కాటన్ బ్యారేజి వైపు) నీటిని విడిచి పెడతారు. దీని వల్ల పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేల నుంచే కాకుండా విద్యుత్ కేంద్రం నుంచి కూడా నిరంతరం నీరు కాటన్ బ్యారేజికి చేరుతుంది. 80 మెగావాట్ల సామర్ధ్యం కలిగిన 12 టర్బైన్లలో విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు నిర్మాణ పనులు చేపట్టిన 58 నెలల్లో పూర్తిచేయాలని ఏపీ జెన్కో ప్రణాళిక రూపొందించింది.

మొదటి యూనిట్ 36 నెలల్లోనూ, మిగతా యూనిట్‌లు రెండేసి నెలలకొక యూనిట్ చొప్పున గ్రిడ్‌కు అనుసంధానం చేస్తూ మొత్తం ప్రాజెక్టు 58 నెలల్లో పూర్తి చేయాలని మొదట్లో ప్రణాళిక రూపొందించారు. అనుకున్నట్టుగా పనులు పూర్తికాలేదు కాబట్టి రానున్న రెండేళ్ల కాలంలో కనీసం సగం యూనిట్లయినా పూర్తిచేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ఈ విద్యుత్ ప్రాజెక్టు రాష్ట్రానికే తలమానికంగా నిలవడంతోపాటు అతి తక్కువ ధరకు విద్యుత్ లభ్యమవుతుందని ఏపీ జెన్కో పోలవరం సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కొలగాని వివిఎస్ మూర్తి అన్నారు.

ఆంధ్రభూమి
జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ
సోమవారం, 22 జనవరి 2018

'ఎడారి' రోదనం..

సౌదీ అరేబియాలోను, ఆ దేశానికి పొరుగున ఉన్న అరబ్బీ దేశాలలోను ప్రవాస భారతీయులు అమానుష వివక్షకు పాశవిక చిత్రహింసలకు గురి అవుతుండడం గురించి మనదేశంలో పెద్దగా ప్రచారం కావడం లేదు. ఉపాధి కోసం సౌదీ అరేబియా, కువాయిత్, ఖతార్, సమైక్య అరబ్ సంస్థానాలు - యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ - యూఏఈ-వంటి దేశాలకు వెళ్లిన భారతీయులకు ప్రభుత్వేతర వాణిజ్య సంస్థలు వేతనాలు చెల్లించకపోవడం సర్వసాధారణమైపోయింది. వేతనాలు దొరకని భారతీయ శ్రామికులు స్వదేశానికి తిరిగిరాలేక అక్కడ ఉండలేక ఆకలితో అలమటిస్తున్నారు. తరచూ ఏదో ఒక వాణిజ్య సంస్థ ఇలా నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడంతో భారతీయ ప్రవాసీ ప్రజలు నిరంతరం ఆర్థిక మానసిక అభద్రతకు గురి అవుతున్నారు! పనిచేయించుకొని వేతనాలను ఎగవేస్తున్న 'వాణిజ్య సంస్థల'కు వ్యతిరేకంగా న్యాయస్థానాలలో ఫిర్యాదు చేయడం గురించి, చేయవలసిన పద్ధతి గురించి తెలియని భారతీయ ఉద్యోగులు కార్మికులు మౌనంగా రోదిస్తున్నారు! కొంతమంది మాత్రమే న్యాయస్థానాలలో ఫిర్యాదు చేయగలుగుతున్నారు. ఇలా ఫిర్యాదు చేసిన ప్రవాస భారతీయులకు ఎక్కువ సందర్భాలలో న్యాయం జరగడం లేదు. వేతనాలను చెల్లించవలసిందిగా కొన్ని సంస్థలను న్యాయస్థానాలు ఆదేశించినప్పటికీ ఆయా సంస్థలవారు లెక్కచేయకపోవడం, న్యాయస్థానాలకెక్కిన ఉద్యోగులను, కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించడం వంటి సంఘటనలు సంభవిస్తూనే ఉండడం ఏళ్ల తరబడి కొనసాగుతున్న దారుణం! ఇటీవల సౌదీ అరేబియాకు చెందిన ఒక సంస్థను భారతీయ ఉద్యోగులకు జీతాలు చెల్లించవలసిందిగా ఒక స్థానిక న్యాయస్థానం ఆదేశించిందట. కానీ ఆ సంస్థవారు జీతాలు చెల్లించకపోవడంతో దాదాపు రెండు వందలమంది ఉద్యోగులు వీధులలో పడి బికారులవలె సంచరిస్తున్నారట! కువాయిత్‌లో కూడ అనేక సంస్థలు వందలాది భారతీయులకు వేతనాలను ఎగవేస్తున్నాయి. మన విదేశ వ్యవహారాల సహాయ మంత్రి విజయకుమార్ సింగ్ ఇటీవల కువాయిత్‌ను సందర్శించినపుడు ఈ వైపరీత్యం బయటపడింది. మన మంత్రి విజ్ఞప్తి మేరకు కువాయిత్ ప్రభుత్వం ఈ వేతన సమస్యను పరిష్కరించనున్నట్టు 'హామీ' ఇచ్చిందట. ఈ హామీ ఎప్పుడు కార్యరూపం ధరించగలదన్నది స్పష్టం కాలేదు. అనేక నెలల తరబడి జీతాలు దొరకని భారతీయులు 'కార్మిక శిబిరాల'లో తలదాచుకున్నారట! ఈ శిబిరాలలో కొన్ని 'సంస్థలు' అన్నపానీయాలను సమకూర్చుతున్నప్పటికీ ఈ కార్మికుల సమస్యకు శాశ్వత పరిష్కారం మాత్రం లభించలేదు. ఈ కార్మిక శిబిరాల - లేబర్‌కాంప్స్-తో వ్యాధిగ్రస్తులవుతున్నవారికి వైద్య చికిత్సలు అందుబాటులో లేవు. కువాయిత్‌లో పనిచేస్తున్న భారతీయ వైద్యులు కొందరు ఈ అభాగ్యులకు ఉచితంగా చికిత్స చేస్తుండడం కొంత ఊరట కలిగిస్తోందట...

కువాయిత్, 'యూఏఈ' వంటి 'పారశీక సింధుశాఖ' - పర్షియన్ గల్ఫ్ - దేశాలలో భారతీయుల కడగండ్లు ఈ 'వేతనాల' సమస్య ఒక ప్రతీక మాత్రమే! ప్రభుత్వాలు, ప్రభుత్వేతరులు రకరకాలుగా భారతీయ కార్మికులను అమానవీయ బీభత్సకాండకు బలి చేస్తున్నారు. సౌదీ అరేబియాలో 'గృహ సహాయిక'గా పనిచేస్తుండిన ఒక భారతీయ మహిళను ఆ ఇంటి యజమానురాలు రెండవ అంతస్థునుంచి కిందికి తోసేసింది, మరో యజమానురాలు భారతీయ గృహ సహాయిక వీపుపై 'పెనుము' కాల్చి పైశాచిక 'ముద్ర'లను వేసింది. నిస్సహాయులైన ఈ భారతదేశపు పనికత్తెలను, ఇతర గృహ కార్మికులను నిర్దయగా రోజుల తరబడి గదులలో కుక్కి నిర్బంధించిన ఘటనలు తిండిపెట్టకుండా రోజుల తరబడి మాడ్చిన ఘటనలు ఈ 'ఇస్లాం మతరాజ్యాల'లో కోకొల్లలు! సర్వమత సమభావ ప్రజాస్వామ్య దేశాలలో ప్రతి 'దారుణం' తక్షణం ప్రచారమౌతుంది. మత రాజ్యాంగ వ్యవస్థలున్న దేశాలలోను, ఇతర నియంతృత్వ దేశాలలోను జరిగిపోతున్న ఘోరాలు తొందరగా బయటపడవు. ఆయా దేశాలలోని స్థానికులు అన్యాయాలకు గురి అయినప్పుడు కూడ అవాస్తవాలు బయట దేశాలకు చాలా ఆలస్యంగా పొక్కుతున్నాయి. విదేశీయుల విషాద గాథలకు ప్రచారం మరింత తక్కువ. కడప జిల్లాకు చెందిన పి.సుబ్బలక్ష్మి అనే మహిళను సౌదీ అరేబియా రాజధాని రియాద్ నగరంలోనే 'మూడు నెలల పాటు' గృహ నిర్బంధంలో ఉంచారట! ఆమెచేత 'శౌచ గవాక్షం' - టాయ్‌లెట్ - లోని నీరు బలవంతంగా తాగించారట! మూడు నెలలు అలా 'చీకటి గది'లో అలమటించిన ఈ భారతీయ మహిళ జూన్ పదకొండవ తేదీన మళ్లీ వెలుగు ముఖం చూడగలిగింది. ఆమె స్వదేశానికి తిరిగి రాగలగడం దైవఘటన.. కానీ తిరిగి రాలేక 'ఎడారి' చీకటి గుడారాలలో పడి ఉన్నవారు ఎందరో..?!

ప్రభుత్వేతర సంస్థలు, స్థానిక ప్రజలు మాత్రమే కాదు ఈ 'గల్ఫ్' దేశాల ప్రభుత్వాలు సైతం భారతీయ కార్మికులను విచిత్ర హింసలకు గురిచేస్తుండడం నడుస్తున్న పైశాచిక క్రీడ. యజమానులు దాఖలు చేస్తున్న అబద్ధపు ఆరోపణలు ప్రాతిపదికగా ఈ గల్ఫ్ దేశాలలో పోలీసులు భారతీయ ప్రవాసులను నిరవధికంగా నిర్బంధంపాలు చేస్తుండడం 'ప్రభుత్వ బీభత్స కాండ'కు నిదర్శనం. జగిత్యాలకు చెందిన డి మధుసూదన్ అనే యువకుడు 'రియాద్'లో కారు డ్రైవరుగా పనిచేశాడు. పట్టభద్రుడైన మధుసూదన్‌కు యజమాని వేతనం సరిగా చెల్లించలేదు. వివిధ రకాలుగా హింసించాడు! ఈ హింసాకాండను సహించలేని 'వాహన చోదకుడు' రాజీనామా చేశాడు, కానీ యజమాని అంగీకరించలేదు. మధుసూదన్‌కు చెందిన 'పాస్‌పోర్ట్'ను ఇతర అధికార పత్రాలను తిరిగి ఇవ్వడానికి నిరాకరించాడు. విధిలేక పారిపోయిన మధుసూదన్ రియాద్‌లో మన దౌత్య కార్యాలయానికి చేరుకున్నాడు. దౌత్య కార్యాలయం సహాయంతో విమానమెక్కి స్వదేశానికి రానున్న మధుసూదన్ విమానాశ్రయంలో 'రియాద్' పోలీసులు నిర్బంధించి తీసుకువెళ్లారు. మధుసూదన్ తన కారును దొంగిలించినట్టు ఆ యజమాని ఫిర్యాదు చేశాడట. తెలంగాణ ప్రాంతానికి చెందిన దాదాపు ఇరవైమంది ఇలా అసత్య ఆరోపణలకు బలై సౌదీ అరేబియా జైళ్లలో మగ్గుతున్నారట! కేంద్ర ప్రభుత్వం ఎందుకు ఈ 'గల్ఫ్' దారుణాలను ఎప్పటికప్పుడు నిరోధించలేకపోతోంది??

గత సెప్టెంబర్ నాటి గణాంకాల ప్రకారం సౌదీ అరేబియాలోని జైళ్లలో రెండువేల మందికి పైగా భారతీయులు మగ్గుతున్నారట! మరణించిన కార్మికుల మృతదేహాలను మనదేశానికి తరలించడానికి వలసిన వ్యయాన్ని ఆయా సంస్థల యజమానులు చెల్లించాలన్న నిబంధనను సౌదీ ప్రభుత్వం అమలు జరిపించకపోవడం అమానుష, చిత్తవృత్తికి పరాకాష్ఠ! అనేకమంది భారతీయ కార్మికుల మృతదేహాలు సౌదీ అరేబియాలోని 'వైద్యగృహా'లలో నెలల తరబడి పడి ఉండడం ప్రచారం కాని విషాదం! ఖతార్, కువాయిత్, యూఏఈ 'జైళ్ల'లో సైతం వందలాది నిరపరాధి భారతీయులు ఏళ్ల తరబడి అలమటిస్తున్నారు. రెండేళ్ల క్రితం ఢిల్లీలోని ఒక సౌదీ అరేబియా దౌత్యవేత్త, వాడి మిత్రులు ఇద్దరు మహిళలను తన ఇంటిలో అనేక నెలలు నిర్బంధించి సామూహిక లైంగిక అత్యాచారానికి గురిచేసినట్టు ధ్రువపడింది. కానీ 'పిశాచి'ని మన ప్రభుత్వం నిర్బంధించలేదు, వాడు దర్జాగా విమానమెక్కి స్వదేశానికి వెళ్లిపోయాడు.. ఇదీ తేడా!

అణచివేత ఆపకపోతే పెనుమార్పులు?

చారిత్రక సత్యాలకు శాస్త్రీయత తులనాత్మకంగా చెప్పడం ఎంత కష్టమో, అవి పచ్చి అబద్ధాలని చెప్పడం అంతకన్నా కష్టం! సైన్సు ఎంతగా పురోగతిని సాధించినా, మానవాళి కల్యాణానికి ఎంత దోహదపడినా, నాడు నేడు మతమే మారణకాండకు కారణమవుతున్నది. పాలకపక్షాలకు ఇదో వజ్రాయుధంలా పనిచేస్తున్నది. రాజ్యాంగం పీఠికలోని మతరహిత (secular) అనే పదం గత ఏడు దశాబ్దాలుగా వెన్నెముక లేని సూత్రంగా, పాలకవర్గాలపై పరాన్నజీవిగా కొనసాగుతూనే వున్నది. ఈ విషయంగా కాంగ్రెసు నర్మగర్భితంగా వ్యవహరిస్తే, బిజెపి మాటల యుద్ధాన్నే సాగిస్తున్నది.

గత నెల 27న 'త్వరలోనే రాజ్యాంగాన్ని మార్చబోతున్నాం...' అంటూ కేంద్రమంత్రి అనంతకుమార్ హెగ్డె సెక్యులర్ అనే పదాన్ని దృష్టిలో పెట్టుకుని మాట్లాడగా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఎంఎల్‌ఏ విక్రమ్ సాహిని జనవరి 2న హిందుస్థాన్ కేవలం హిందువులదే అని పునరుద్ఘాటించటం పుండుపై కారం చల్లిన చందంగా వుంది. ఎప్పటిలాగానే బిజెపి ఈ మాటలతో పార్టీకి సంబంధం లేదని ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే జనవరి 1న జరిగిన కోరెగావ్ భీమా సంఘటన జరగడం, హింసకు దారితీయడం తెలిసిందే! మానవ మనుగడకోసమే మతం అని, మతం లేని సమాజం నిస్సారమని చెప్పే మతాలు ప్రపంచవ్యాపితంగా ప్రజల్నే కాదు, భూభాగాల్ని కూడా విభజించాయి, విభజిస్తూనే వున్నాయి. యుద్ధోన్మాదాన్ని రగిలిస్తూనే వున్నాయి. ఇంకా లోతుల్లోకిపోతే, ఆయా మతాల్లోనే ప్రజల్ని రెండుగా చీల్చి, అధఃపాతాళానికి తొక్కుతున్నాయి. మతం శాంతికేనని ప్రవచించవచ్చు. విలువల్ని పెంపొందించుటకేనని ఉద్ఘాటించవచ్చు! పరమత సహనం అనే గారడీ మాటల్ని మాట్లాడవచ్చు! చివరికి అహింసను ప్రవచించే బౌద్ధమతం కూడా తన మనుగడకు హింసను నమ్ముకోవడం చూస్తూనే వున్నాం. మతానికి అంకురార్పణ జరిగిన కాలం నుంచి, నేటిదాకా మతవ్యాప్తి హింసతోనే జరగడం, హింసతోనే కొనసాగడం చారిత్రక సత్యాలు. ఇందులో ఏ మతానికి ఉజ్జాయింపుగాని, మినహాయింపుగాని లేదు. భారతదేశ చరిత్ర పుటల్లో కూడా మతపు రక్తపు మరకలే కనపడుతున్నాయిగాని, మానవీయ ముద్రలు ఎక్కడా కానరావు. అయితే వీటిని గుర్తించనివారు, ఒప్పుకోనివారే ప్రపంచ వ్యాపితంగా అత్యధికులు.



మన దేశంలో మత ఘర్షణలకు ముందే కుల ఘర్షణలుండడం, దేశ విభజనతో వీటికి మత ఘర్షణలు తోడుకావడం గమనించాలి. ఈ కుల ఘర్షణలు అత్యధికంగా వర్గ వ్యవస్థను సమర్థించేవారికి, వ్యతిరేకించేవారికి మధ్యన జరగడం గమనార్హం. కులీన వర్గాలైన బ్రాహ్మణ, క్షత్రియ తదితర వర్గాలకు, ఉత్పత్తిలో భాగస్వామిగా వుంటూ, సంపదల్ని సృష్టించే మిగతా నిమ్న, దళిత వర్గాలకు నిరంతరం వైరుధ్యాలు కొనసాగుతూనే వున్నాయి. కర్మ సిద్ధాంతమనే మాయాజాలంతో కింది వర్గాలను పై వర్గాలవారు ఊడిగం చేయించుకోవడమేకాక, అంటరానివారిగా దూరంగా వుంచడం తెలిసిందే! ఈ సాంఘిక అసమానతల నుంచి పుట్టిందే సాహూ మహరాజ్ రిజర్వేషన్ ఆలోచన! జ్యోతీరావ్ పూలే ప్రబోధనలు, అంబేద్కర్ తిరుగుబాటు, భావజాలం- వీటన్నింటికీ పుట్టినిల్లు మహారాష్ట్రనే కావడం, మొన్నటి కోరేగావ్ భీమా హింసాకాండ కావడం కూడా గమనించాలి. ఏ దేశ చరిత్ర చూసినా, పాలకుల రక్షణకై సాధారణ, కిందిస్థాయి బడుగు, బలహీన వర్గాలే ఎల్లకాలాల్లో సమిధలుగా మారారు. రాజ్య విస్తరణకు, మనుగడకు, రాచరిక రీతికి, వ్యవస్థలకు, ప్రజాస్వామ్య, సామ్యవాద, సోషలిస్టు, కమ్యూనిస్టు వ్యవస్థల స్థాపనకు, వీటి కొనసాగింపునకు రక్తతర్పణ చేస్తున్నది కూడా ఈ వర్గాలవారే! వీరే సామాన్యుల్లో అతి సామాన్యులు! దళితులు! అంటరానివారు! గిరిజనులు! బడుగు, బలహీన వర్గాలు! చివరికి ఈ వర్గాలే 'రాజ్యం' అనే వ్యవస్థకు భంగకారులు (Threatners)గా ముద్రవేయబడ్డారు.

మరోసారి చరిత్ర పుటల్లోకి వెళితే, బ్రిటీషు పాలకులుగా ఎదుగుతున్న ఈస్టిండియా కంపెనీ, హిందువుల్లోనే హిందువులచే అణచబడుతున్న వర్గాల్ని దగ్గర తీయడం, ఉద్యోగాల పేరున సైన్యంలో చేర్చకోవటం జరిగింది. మన వేలును మన కంట్లోనే అనే నీతిలా, భారతీయుల్ని, భారతీయులతోనే యుద్ధం చేయించిన సామ్రాజ్యవాద నీతి బ్రిటీషువారిది. దేశభక్తి పేరున ఆధిపత్య వర్గాలు, వీరికి వ్యతిరేకంగా అణచివేతకు గురైన వర్గాలు రెండుగా చీలడం జరిగింది. ఈ నేపథ్యంలోనే 1818 జనవరి 1న కోరేగావ్ పక్కనగల భీమా నది ఒడ్డున మరాఠీ పీష్వాలతో బ్రిటీషువారు యుద్ధం ప్రకటించడం, వీరి పక్షాన మహర్‌లు (దళితులు) 12 గంటలపాటు యుద్ధం చేయడం, పీష్వాలు గెలవడం జరిగిపోయింది. దీన్నే బ్రిటీషువారు రాజకీయంగా వాడుకోవడం, ఈ యుద్ధంలో చనిపోయిన 22మంది మహర్లపేరుతో ఓ స్తూపాన్ని ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయడం జరిగింది. అప్పటినుంచి ఈ ప్రాంతం మహర్లకు ఓ యాత్రాస్థలంగా మారడం, 1927న ఈ స్థలాన్ని స్వయాన అంబేద్కర్ సందర్శించడంతో మరింత ప్రాధాన్యత సంతరించుకున్నది. ఈ విధంగా మొన్నటి జనవరి 1 నాటికి ద్విశతాబ్దం కావడంతో కోరేగావ్ భీమా యుద్ధానికి మరింత ప్రచారం లభించింది. ఈ యుద్ధాన్ని హిందూ రాజ్యంపై జరిగిన దాడిగా పీష్వాలు భావిస్తే, బ్రాహ్మణీయ భావజాలానికి, అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన యుద్ధంగా నేటికీ మహర్లు భావిస్తున్నారు. కాని ఇరుపక్షాలు వలసవాద దమననీతికి గురయ్యామని గుర్తించకపోవడం విషాదం!

ఈ కథనానికి ముందు, ఈ ప్రాంతంలోనే వధుబద్రక్ అనే గ్రామంలో శివాజీ కొడుకైన సంభాజీని మొగల్ రాజైన ఔరంగజేబ్ చంపడం, ఈయన అంత్యక్రియల్ని జరపడానికి ఔరంగజేబ్‌కు భయపడి ఏ ఒక్క మరాఠ ముందుకు రాకపోవడంతో, గోవింద్ గాయక్వాడ్ అనే ఓ మహర్ ధైర్యంగా ముందుకు వచ్చి నిర్వహించడం జరిగిందనేది మరో కథనం. అయితే దీన్ని మరాఠాలు ఒప్పుకోక సంభాజీ అంత్యక్రియల్ని మరాఠానే చేశాడని, గోవింద్ గాయక్వాడ్ పేరునగల బోర్డును, షెడ్‌ను మొన్నటి డిసెంబర్ 28 ధ్వంసం చేయడం జరిగింది. దీనికి కారకులు శివ ప్రతిష్ఠాన్ హిందూస్థాన్ స్థాపకుడు, న్యూక్లియర్ ఫిజిక్స్‌లో బంగారు పతక విజేత 84 సం. సంభాజీ బిడేతోపాటు హిందూ ఏక్తా పరిషత్ నాయకుడైన స్థానిక మిలింద్ ఎక్బోటేలు కారణమని దళిత సంఘాల ఆరోపణ! ఈ సమస్య సునామీగా మారే ప్రమాదం వుందని గ్రహించిన కొందరు మరాఠాలు తిరిగి గోవింద్ గాయక్వాడ్ బోర్డును, షెడ్‌ను పునరుద్ధరిస్తామని హామీ ఇవ్వడంతో దళిత సంఘాలు పెట్టిన కేసును వెనక్కి తీసుకోవడం జరిగింది.

ఈ సంఘటన జనవరి 1కి ముందు జరగడం, అదీ కోరేగావ్ యుద్ధానికి 200 సం.లు నిండిన రోజుకు ముందు కావడంతో దళితుల్లో తిరిగి ఆత్మగౌరవ నినాదం బలోపేతం కావడం, యావత్ మహారాష్ట్రనుంచే కాక, పక్క రాష్ట్రాలనుంచి దళితులు లక్షలాదిగా తరలిరావడంతో పరిస్థితి దాదాపుగా చేజారింది. ఇలా దాదాపు 10 లక్షల దాకా హాజరైన ఈ సమ్మేళనాన్ని ఉద్దేశించి ప్రకాశ్ అంబేద్కర్, భీమసేన్ (ఆర్మీ) అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్న వినయ్ రతన్‌సింగ్, వర్ధమాన దళిత నాయకుడుగా, స్వతంత్ర అభ్యర్థిగా గుజరాత్ ఎన్నికల్లో గెలిచిన జిగ్నేష్ మేవానిలతోపాటు, జెఎన్‌యు విద్యార్థి నాయకుడైన ఉమర్ ఖలీద్‌లు మాట్లాడడంతో మరింత వేడెక్కిన రాజకీయాలు హింసకు దారితీయడంతో, 12 దళిత సంఘాలు, ఇతర ప్రజా సంఘాలతో కలిసి జనవరి 3న మహారాష్ట్ర బంద్‌కు పిలుపునివ్వడం తెలిసిందే!

ఇదంతా నాణెనికి ఒకవైపు ముఖ చిత్రం కాగా, మరోవైపు 2016లో మరాఠాలు రిజర్వేషన్లు కావాలని చేపట్టినది మరో ముఖ్య కారణం! ఏడు దశాబ్దాలకు కూడా అంబేద్కర్ ప్రవచించిన రిజర్వేషన్లు సక్రమంగా అమలుకు నోచుకోకపోగా, రోజు రోజుకు ప్రభుత్వ స్థాయిలో ఉద్యోగాల సంఖ్య తగ్గుతూ, ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలే అవకాశం లేని దళితులకు మరాఠాలు రిజర్వేషన్ కోరడం, వారి ఆధిపత్యం కొనసాగించడానికే అనేది వారి వాదన! ఓ దళితుడు దేశాధ్యక్షుడైనా, ఓ వెనుకబడిన వ్యక్తి ప్రధానమంత్రి అయినా, దళితుల ఆత్మగౌరవం మరింతగా దిగజారిందే తప్ప పెరగలేదనేది వీరి ప్రత్యారోపణ! అందుకే పాలక వర్గాలు అదాని, అంబాని అంటే మనం ఉద్యోగాలని లవ్ జిహాదీ అంటే లవ్ జిందాబాద్ అని నినదించాలని, దళితులకు కావాల్సింది సమాన హక్కులు, గౌరవం గాని సౌందర్య సాధనాలు కావని నాటి సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ జిగ్నేష్ విమర్శించడం జరిగింది. ఈ విధంగా సామాజిక ప్రజాస్వామ్యం సిద్ధించని రాజకీయ ప్రజాస్వామ్యం నిష్ప్రయోజనం అని జిగ్నేష్ యువతను ఆకట్టుకునే విధంగా మాట్లాడడంతో సభాస్థలి మరింతగా వేడెక్కింది.

ఈ సంఘటనల్ని వేరువేరుగా చూస్తే పెద్ద సమస్యగా కనపడకపోవచ్చు! 2016 జనవరి 17న ఆత్మహత్య చేసుకున్న రోహిత్ వేముల నుంచి, బీఫ్ ఫెస్టివల్స్ ది డే ఆఫ్ మైసాసుర లాంటి సంఘటనల నేపథ్యంతో, గోరక్షకుల దాడులతో దేశవ్యాపితంగా దళితులపై, ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న దాడుల, అత్యాచారాల నేపథ్యంలో చూసినపుడు చార్వాకుడు, శంభూకుడు ఇతిహాసాల్లో కనుమరుగు కాలేదని, వారు కన్నయ కుమార్ రూపంలో జిగ్నేష్ ఆవేశంలో, అంబేద్కర్ ఆలోచనలో మళ్లీ మళ్లీ పుడుతున్నారని, పుడతారని గ్రహించకపోతే, సుదీర్ఘ కాలంలో కాదు, అతి దగ్గరలోనే భారతదేశ రాజకీయాలు మారవచ్చు! కాలానుగుణంగా ఎత్తుగడలుంటాయని పాలకులు భావిస్తే, అవి ఎల్లకాలం సాగవని గుర్తించే సమయం కూడా అతి దగ్గరలోనే వుంటుందనేది కాదనలేని సత్యం! మరి కళ్లు తెరుస్తారా? ఇంకా కొంగ జపం చేస్తారా.. అనేది పాలకులకే తెలియాలి! లేదంటే కాలమే దీనికి పరిష్కారం చూపుతుంది.

- డా. జి.లచ్చయ్య | సెల్: 94401 16162

'విరాట్'పర్వంలో వాటర్లూ..!

వీరాజీయం

టెస్టులు, ఒక రోజు అంతర్జాతీయ క్రికెట్ పోటీలలో అన్నింటా అత్యుత్తమ నాయకుడు అవార్డులు 2015లో గెల్చి - 'క్రికెట్ సమ్రాట్ విరాట్' అంటూ జేజేలు అందుకున్న - విరాట్ కోహ్లీకి 'గుండెలలో గునపాలే గ్రుచ్చారే నీ వాళ్లు' అన్నట్లు 2018 సంక్రాంతి కాంతి విహీనమైపోయింది. గ్రహణం పట్టిన సూర్యుడైపోయింది. 'అరివీర భయంకర అర్జున్'లాంటిది మా ఇండియన్ టీము అన్నాం - మొత్తం కవచ కుండలాలు దానం చేసిన కర్ణుడు మాదిరి అయిపోయింది. తమ మాజీ 'క్యాపటన్'తో సమానంగా రికార్డు అవార్డులు నిన్ననే అందుకున్న విరాట్ - నెపోలియన్ బోనాపార్టీ లెవెల్లో-2015 నుంచి మొన్నటిదాకా ఇరవై ఒక్క మ్యాచ్‌లు గెలిచినా - దక్షిణాఫ్రికాలో అతని కోసం 'వాటర్లూ' పొంచి ఉంటుందని ఊహించలేకపోయాం - అంటూ అభిమానులు కలత చెందుతున్నారు. వర్సగ్గా.. తొమ్మిది సిరీస్ గెల్చినా - మొన్నటి రెండు ఓటములు ఇండియన్ క్రికెట్ ప్రతిష్ఠ ముక్కు కోసేశాయ్.. అంటున్నారంతా.. ముందునుంచి అక్కడ ద.ఆ.లో స్థితి భయంకరంగా వుంటుందని తెలిసినా - నాయకుడు, కోచ్ కూడా టీంని సమాయత్తం చెయ్యలేకపోయారనే అంటారు కానీ ఒక్క మాట - వంటినిండా రికార్డుల పతకాలే ధరించి - బరిలోకి దిగిన టాప్ ఆర్డర్ 'బ్యాట్-వీరులు - పెద్ద పులిలా గాండ్రించడం మరచిపోయి పిల్లికూనలైపోయారెందుకని? - కొత్తకుర్రాడు ఇరవై రెండేళ్ల బచ్చా - 'లుంగీఎంజిడి' - బంతులు విసురుతూ వుంటే... - ఓ యువ అభిమాని చెప్పాడు - 'సార్, షారుక్ ఖాన్ తీసిన చెన్నై ఎక్స్‌ప్రెస్ సినిమాలోని లుంగీ డ్యాన్సు చూశారుగా-అలాగ 'లుంగీ' డ్యాన్సు చేసి పెవిలియన్‌కి పారిపోయారు సార్ మనోళ్లు అన్నాడు - రాబాడా లుంగీలు ఇండియన్ టీముని పచ్చడి చేసేశారు. నిజమే 34 ఏండ్ల తరువాత పరమచెత్త రికార్డు సంపాదించారు. ప్రపంచంలోనే నంబర్‌వన్ టెస్టు టీము మనది అలాంటిది నెంబర్ 2 చేతిలో - విలవిలలాడిపోవడం దారుణమే అన్నారంతా. పోరాడి ఓడితే అది ఒక పద్ధతి. అల్లాంటి 'శీను' ఏదీ అక్కడ - తొలిటెస్టులో విరాట్ సాధించిన 'సెంచరీన్నర' పరుగులు తప్ప - కానరాలేదు. అందరూ నెంబర్ 'నైన్' 'టెన్' ఆటగాళ్లలాగ - అవుట్‌సైడ్ ది ఆఫ్ స్టంప్ మీదుగా స్లిప్పులోకి పోతున్న బంతుల్ని వెంటాడారు. తొలి టెస్టులో 92 పరుగులకే ఏడు వికెట్లు పోగొట్టుకున్న ఇండియన్స్ - మలి టెస్టులో - ఏడు వికెట్ల నష్టానికి 82 పరుగులు మాత్రమే చేశారు. నానాటికీ తీసికట్టు నాగంభొట్లు అన్నట్లు రెండో టెస్టులో ఇంకా నాసిగా బ్యాటింగ్ చేసింది టీం... సునీల్ గవాస్కర్ మొదట టెస్టు అవంగానే - 'అశ్విన్ నీ బౌలింగు ఓకే, కానీ బ్యాటింగులో బంతుల్ని వెంటాడుతున్నావ్ 'టేక్కేర్' అని రాసినా - పాండ్యకి బాధ్యతాయుతమయిన బుర్ర అవసరం అని మాజీలంతా చెప్పినా - తోక బెటరు అనిపించేలాగా బ్యాటింగ్ చేశారు - గ్రేట్ పుజారాకి కొత్త రికార్డు వచ్చింది. అదేమిటి అనుకుంటున్నారా? రెండు రన్నౌట్లు సాధించాడు. ప్రపంచంలోనే జిడ్డు ఆటకి పేరుగాంచిన మన ఆట అవసరమొచ్చినప్పుడు - 'జిడ్డు' కాదు అనుకోవాలి. రెండో ఇన్నింగ్సు చివరిలో మహమ్మద్ శమీ దక్షిణాఫ్రికా బౌలింగుని తీసి పారేశాడు - కానీ వన్డే ఆటగా ఆడారు మనవాళ్లు - గెలుపు అసాధ్యం - డ్రా చేయడానికి తలవొంచి ప్రతీ బంతినీ అది 'లూజుబాల్' అయ్యేదాకా నొక్కుకుంటూ పోతే, మ్యాచ్ డ్రా అయ్యేది - థర్డ్ టెస్ట్‌కి జనాలు వచ్చేవారు. ఇండియా అంటేనే స్పిన్ మాంత్రికుల దేశం - అటొకడు ఇటొకడు - అశ్విన్ జడేజాలు తగుల్కుంటే - కేవలం ఫాస్ట్ బంతులకే అలవాటుపడ్డ ప్రత్యర్థులు సుడులు తిరిగి వికెట్లు పారేసుకునేవాళ్లు.. కానీ వాళ్లు నలుగురు 'స్పీడ్‌గాళ్ల'ని వేసుకుంటే మనకీ వున్నారు నలుగురు - అని స్పిన్నర్ని అయిష్టంగా వేసుకుంటే?.. క్యా బాత్ హై? కామెంటేటర్లు - 'బాబూ నీకో స్పిన్నరున్నాడ్రా!' అని గోలెట్టేదాకా - నీ బవులర్ల స్పీడుకి నువ్వే మురిసిపోతే? - మొట్టమొదటి పది ఓవర్లలోనే 'మూడ్' వికెట్లు పోగొట్టుకున్న ప్రత్యర్థులు పుంజుకోరా? అంట. వాళ్లు శ్రీలంక నుంచి జింబాబ్వే నుంచి రాలేదు - విరాట్ గెలుపుల వీరుడు అనుభవం 2015 నుంచి 21 సార్లు గెలుపు - హుర్రే అందుకున్నవాడు కోహ్లి. తన టీముకి చెప్పాలి అబ్బాయ్, అక్కడికి వెళ్లి క్రీజుకి అతుక్కుపోవాలి - డ్రా చెయ్యాలి మనం - ఇది టెస్టు మ్యాచ్ - రోజంతా వుంది - ఎంత హిడింబాసురులైనా ఫాస్ట్ బౌలర్లు అలసిపోతారు. అప్పుడు.. మనం బ్యాట్ ఝుళిపించాలి అని చెప్పాల్సిన బాధ్యత క్యాప్టన్,కోచ్‌లది - పైగా టీమంతా ద్రోణాచార్యులే.. కాని, రాబడా, 'మార్కెల్' కూడా చేతిలో బంతిని మొహం పగిలేలాగా సంధించారు. ఇండియాలో - బంగళూరు మోహాలీ కలకత్తాలు పెద్ద స్కోరులకి - బౌలర్ల పాలిట శాపాల్లాంటి గ్రౌండ్లు చాలా వున్నాయి. కాని దక్షిణాఫ్రికా - పిచ్ - విసుర్లకి, బౌన్సర్లకి, ఇన్‌స్వింగుకీ పెట్టింది పేరు.

విజయుడయిన నాయకుడు కోహ్లీకన్నా ఎక్కువ 'హైప్' ఇచ్చి - 'వీరపాండ్యా' అంటూ మునగ చెట్టెక్కించి - ఈ కుర్రాడే మన రక్షకుడు - అన్నట్టు హార్దిక్‌ని పంపడం - ఆచితూచి ఆడడం అలవాటులేని కుర్రవాణ్ని నమ్ముకోడం - ఫాస్ట్ బౌలర్స్ అలిసిపోయే దాకా స్పిన్నర్ని రంగంలోకి దించకపోడం - క్యాచ్‌లు డ్రాప్ చెయ్యడం ఇవన్నీ - సీనియర్లు గవాస్కర్ ద్రావిడ్, సెహ్వాగ్లు గమనించి హెచ్చరించారు. ధోనీతో సమానంగా రికార్డు సాధించి అందరి ముద్దుమురిపాలు అందుకున్న విరాట్‌కి - ఈ ఏడాది ఆరంభమే బాగాలేదు. పాపం జరిమానా డిమెరిట్ పత్రం కూడా అందుకున్నాడు - హిమాలయ శిఖరాగ్రంనుంచి కన్యాకుమారికి జారిపోయినట్లు.. అందుకే అంటారు.. పెద్దలమాట సద్దిమూట అని.. తన కోపమే తన శత్రువు కాకపోవచ్చును చాలాసార్లు - కాని "తన గర్వమే తన శత్రువు' అన్నది మన ఇండియన్ టీముకు వర్తిస్తుంది - "డెత్ ఓవర్ల"లో బాదుడు బాదే కుర్రాడా? రాహుల్స్ రోహనాలు చటేశ్వర్లు ధవన్లు రోహిత్‌లు వీళ్ల చతికిల బడటానికి వెళ్లారు? అసలు డే-యిల్‌స్టేయిన్‌కి దెబ్బ తగిలితే, మరో కుర్రాడు లుంగీ రంగంలోకి వచ్చాడు. మనవాళ్లు ఒకడు కాకపోతే మరొకడయినా - క్రీజులో పాతుకుపోయి ఓటమిని తప్పించే వాళ్లు ఇదివరకు ప్చ్.. ఆ 'ఎరా' పోయింది అంతేనా? ఈసారి అవగాహన, ఓర్పుకూడా పోయాయి. అయితే గెలిస్తే నాయకుడే జేజేలు అందుకున్నట్లే - ఓటమికి అతనినే బాధ్యుణ్ని చేస్తారు. అది సహజం. సునీల్ గవాస్కర్ అంతటివాడు - ధోనీ టీములో వుండే ఇప్పుడు బాగుండునేమో అనేశాడు. కెప్టెన్‌గా కాకపోయినా విక్కెట్కీపర్‌గా ఉన్ననూ చాలు - అనడం సునీల్‌కే చెల్లు. ఇంకా మొన్ననేగా లక్ష్మణ్ - నేరుగానే ధోనీని నిందించాడు. కుర్రాళ్లకే అవకాశం ఇచ్చి ధోనీ.. నువ్వు తప్పుకోవాలని అన్నాడు. అది సరే, బాట్స్మన్‌కి కూడా ఓ జరిమానా ఓ మెమోలాంటివి వుండాలి - ఏడాది చివర కోట్లకొలది రూపాయలు అందుకునే వీరులు - 'నామ్ బడా దర్శన్ తోడా' అంటే 'ఏనుగు డ్యాష్'' అన్నట్లు అయితే - మందలింపు వద్దా? క్యాష్ రూపంలో శిక్ష వుండాలి అని ఎందరో అంటున్నారు. మెడికల్ ఎక్స్పర్టుల్లాగా, ఫీల్డింగుకి ఓ కోచ్, బ్యాట్టింగుకి మరొకడు, స్పిన్నోడు, స్పీడ్‌కొకడు, కర్రపెత్తనానికి ఇంకోడు... మళ్లీ ఇంతమంది వున్నా స్లిప్స్‌లో క్యాచ్‌లు డ్రాప్ ... లోకంలో ఓ అపవాదు వుంది. ఇండియాలో జనాలు స్పిన్ బౌలింగుని ఎంతో ఇదిగా ఎంతసేపైనా అలా ఓపిగ్గా తిలకిస్తారని (జిడ్డుగాళ్లనా) కానీ అదే మరచిపోయాం..

సరే, అద్భుతమైన - ఎదురులేని విజయాల సిరీస్ - జేగీయమానంగా సాగి - విరాట్ వివాహం కూడా క్రికెట్ పండుగగా సాగింది. ఆ గొప్ప అధ్యాయం దురదృష్టవశాత్తు ముగిసింది. కాని మన వాళ్ల పర్యటన ఇంకా చాలా వుంది. అందుకే ఈ పోస్టుమార్టం అవసరమయింది. విరాట్ టీముకి ఇది ఒక స్పీడ్‌బ్రేకర్ మాత్రమే కావాలని ఆకాంక్ష..


ది గ్రేట్ సోలెస్ ఈస్ స్టిల్ వుయ్ ఆర్ 'నం వన్ టెస్ట్ టీం' ఇన్ ది వరల్డ్!

veeraji.columnist@gmail.com

గోవులను ఎందుకు చంపరాదు?

భారతీయులు సగర్వంగా చెప్పుకోదగిన ప్రాచీన భారతీయ నాగరికతలోని అద్భుత విజ్ఞానమే 'గోవిజ్ఞాన' సంపద. గోవు విలువ తెలియడం చేత దానికి దేవతాస్థానం ఇవ్వబడింది. గోరక్షణ ఈ దేశానికి అతి ప్రధానమైన అంశం. ఎందుకంటే మన ఈ ప్రత్యేకమైన, ఉత్తమ గోసంపద ప్రపంచంలో ఎక్కడా లేదన్నది ప్రపంచవ్యాప్తంగా తెలిసిన విషయం. మూపురంలోని సూర్యకేతునాడి ద్వారా సూర్యశక్తిలోని దివ్యమైన ప్రాణశక్తిని గ్రహించి, పాలు, మూత్రం, గోమయం, వాటి ఉత్పత్తులను మనకి అందిస్తున్నది. అందుకే భారతీయ సంస్కృతిలో అమ్మ తరువాతి స్థానం గోవుదే.

ఈ అద్భుత గోవిజ్ఞాన సంపదను గుర్తించక, మరచిపోయిన సుప్త దశలోని మన రైతు సోదరులు గోవులను భారంగా ఎంచి, సంతలలో 5వేల నుంచి 15 వేలలోపుకే - కసాయివారికి కోతకు అమ్ముకుంటున్నారు. నిద్రావస్థలో వున్న ప్రభుత్వ యంత్రాంగం చట్టాలను తుంగలో తొక్కి, దక్కే కొద్ది ఆర్థిక లాభాలను ఆశిస్తున్నందువల్ల, వీటి రక్షణపై ఎవరి దృష్టీ ఉండటం లేదు. రక్షించవలసిన ప్రభుత్వం విభాగాలు, వైద్యులు, పోలీసు యంత్రాంగాలు - రాజ్యాంగం ఆవులకిచ్చిన హక్కులను గాలికి వదులుతున్నారు. వధశాలల వారున్నూ వారి అత్యధిక లాభార్జనకు, పై బలహీనతలను సొమ్ము చేసుకొంటూ - యంత్రాంగాన్ని వారి గుప్పిట్లోకి తెచ్చుకుంటున్నారు. ఒక్కొక్క మండలంలో 500 నుండి 1000 వెయ్యి ఆవులుపైన ఉన్నవి వేళ్లపై లెక్కపెట్టవచ్చును. దీనివల్ల ఎప్పటికప్పుడు పర్యావరణం, ప్రకృతిలో సమతుల్యత లోపించి మానవుడు ఊహించని కష్టాలను ఎదుర్కొంటున్నాడు.



శాస్త్రజ్ఞుల విశ్లేషణలలోను అనేక విషయాలు వెల్లడవుతున్నాయి. వాటిలో కొన్ని ఇక్కడ ప్రస్తావిస్తాను. వాటిని కర్కశంగా వధించినపుడు బాధతో కూడిన ఆక్రందనల ప్రకంపనల వల్ల ప్రకృతి విపత్తులు ఏర్పడుతున్నాయన్నది ఒక అంశం. సగం గొంతు కోసి చంపడం (హలాల్) వల్ల అవి శారీరకంగా బాధను అనుభవిస్తాయి. మెదడులోను, శరీర భాగాల్లోను హానికారక రసాయనిక చర్యలు జరుగుతాయి. అలా మరణించిన గోవుల మాంసాన్ని తిన్నవారికి అనారోగ్యం కలుగుతుందన్నది మరో విషయం. ప్రకృతి సహజమైన ఎరువులను వదిలేసి రసాయన విష పదార్థాలను వాడటం వల్ల, మందులేమీ పనిచేయని, లేని కొత్తకొత్త రోగాలను కొనితెచ్చుకుంటున్నామన్నది మరో అంశం. గోమయం, గోమూత్రం వంటివి వాడకుండా రసాయనాలను వాడటం వల్ల భూములు పాడై, వానపాములు, భూగర్భ జలాలు పాతాళానికి చేరిపోతున్నాయి. వర్షపాతం తగ్గి జనజీవనం దుర్భరమవుతోంది.

రైతులు గతంలో గోసంపదతో కలసి ఉండటం వల్ల వారికి పాడిపంటలు పుష్కలంగా దక్కేవి. ఆరోగ్యకరమైన ఆహారం లభించేది. పాడిపశువులతో లక్ష్మీకళతో ఇళ్లన్నీ శుభకరంగా విలసిల్లేవి. ఇప్పటికైనా మించిపోయినది లేదు. గోవుల శక్తివల్ల అనేక సమస్యలను తొలగించుకోవచ్చునన్నది నా విశ్వాసం.. అనుభవం.

ఒక ఆవువేసే పేడ, మూత్రాల వల్ల రైతు 30 ఎకరాలను సులభంగా విష రసాయనాలు లేకుండా వ్యవసాయం చేయవచ్చు. ఒక్క రోజుకు ఒక ఆవు ఇచ్చే పది కిలోల పేడ, పది లీటర్ల మూత్రం ద్వారా ఒక ఎకరాకు సరిపోను ఎరువు పొందవచ్చు. ఇలా రోజుకు ఒక ఆవు రెండు వేల రూపాయల విలువైన ఎరువును ఇస్తుంది. గోమూత్రం, కొన్ని చెట్ల ఆకులతో కలసి పురుగు మందులను తయారు చేయవచ్చు. మనదేశంలో అనాదిగా.. ఇప్పటికీ ఈ పద్ధతులను కొందరు పాటిస్తూ లబ్ధి పొందుతున్నారు. అతితక్కువ ఖర్చుతో వ్యవసాయం చేయగలగడం, అధిగ దిగుబడి సాధించడం, నాణ్యమైన ఉత్పత్తులు పొందడం గోవుల వల్ల సాధ్యం.

బతికుండగా గోవులను అమ్ముతున్నవారు చాలామంది ఉన్నారు. అది పాపం. సహజంగా గోవు మరణించిన తరువాత దానిని సమాధి చేయడం వల్ల ఆ తరువాతి కాలంలో అది ఎరువుగా మారి చాలాకాలంపాటు ఆ పొలాలకు ఎరువుగా పనిచేస్తుంది. దాదాపు పదినెలల పాటు పది ఎకరాల భూమికి సరిపడే పది లక్షల విలువైన ఎరువులకు ఇది సమానమని చెప్పొచ్చు. నిజానికి ఆవు పేడ, మూత్రం వాతావరణ కాలుష్యాన్ని నివారిస్తాయి. వంద గ్రాముల పేడను వ్యవసాయానికి వాడితే అది 300 కోట్ల సూక్ష్మ జీవులను ఉత్పత్తి చేసి సాగుకు సహకరిస్తుంది. దేశీయ ఆవులకు మాత్రమే ఈ శక్తి ఉంది.

ఆస్ట్రేలియాలో 'ఓం హోమాఫార్మ్స్' అని హోమంతో వచ్చే బూడిదను ఎరువులు, పురుగు మందులుగా వాడుతున్నట్లు చెబుతారు. యజ్ఞం ద్వారా ప్రొపిలీన్ ఆక్సైడు' వంటివి ఉత్పత్తి అయ్యి వర్షం కురవడానికి దోహదమౌతుంది. హోమధూమానికి రోగకారక కాలుష్యాలను, బాక్టీరియాను పోగొట్టి శుద్ధి చేసే శక్తి ఉన్నదని సైన్స్ బుజువు చేసింది. జైపూర్ వైద్యశాలల్లో గోమూత్రాన్ని పరిశుభ్రత కోసం వాడుతున్నారు. యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ మైక్రోబియల్‌గా గోమూత్రం, గోమయం పనిచేస్తాయని నిరూపితమైంది. అందుకే పూర్వం ఇళ్లముందు కళ్లాపి జల్లి ఇల్లు అలికేవారు. గోమూత్రాన్ని పూర్వీకులు సేవించేవారుకూడా. ఆవుపేడ రేడియేషన్ ప్రభావాన్ని తగ్గిస్తుంది. అందుకే ఆవుపేడతో చేసిన స్టిక్కర్ల ద్వారా సెల్‌ఫోన్ల రేడియేషన్‌ను తగ్గించి ప్రమాదాలను నివారించే ప్రయత్నాలు మొదలవుతున్నాయి. ఇక గోమూత్రం, గోమయంతో బత్తీలు, అట్టలు, ధూప్‌బత్తీలు, ఫినాయిల్, సబ్బులు వంటివి తయారు చేసి ఉపాధి పొందవచ్చు. పూల కుండీలు, దుస్తులు, బొమ్మలుసహా వంద రకాల వస్తువులను వీటితో తయారు చేస్తున్నారు. గోమూత్రము, గోమయము, గోవు పాలు, పెరుగు, మజ్జిగ, నెయ్యి, వెన్న వంటి వాటిని అద్భుత ఔషధాలుగా వాడతారు. దీర్ఘకాల, మొండి జబ్బులను ఇవి నయం చేస్తాయి. గోచికిత్సా శాస్త్రంలో వీటి వల్ల కలిగే ప్రయోజానాలు ఏమిటో ఉన్నాయి. అది మన దేశపు విజ్ఞానం. గోవుయొక్క స్పర్శ, దృష్టి, వాసన, సాహచర్యము ఆరోగ్యాన్నిస్తాయి. దీనివల్ల నేరస్వభావం తగ్గుతుంది. ఇక గోబర్‌గ్యాస్‌వంటి ఇంధనశక్తిని సృష్టించడం వీటివల్ల సాధ్యమైంది. కోల్‌కతాలో బస్సులను కూడా బయోపెట్రోల్‌తో నడిపి చూశారు.

ఇక మానవుల అంత్యేష్ఠి కార్యక్రమంలో కలపను వాడుతారు. దానివల్ల ఎన్నో వృక్షాలను నరికివేయవలిసి వస్తోంది. దీనివల్ల వేరే సమస్యలు ఉత్పన్నమవుతాయి. పైగా కట్టెల మండటం వల్ల 1100 డిగ్రీల సెంటీగ్రేడు ఉష్ణోగ్రత ఉద్భవిస్తుంది. అదే ఆవుపేడతో చేసిన పిడకలను మండిచడం ద్వారా 2300 డిగ్రీల సెంటీగ్రేడు ఉష్ణోగ్రత వెలువడుతుంది. అందువల్ల కట్టెలకు బదులు పిడకలతో అంత్యేష్ఠి జరపడం అవశ్యం. పైగా కాలుష్యరహితం కూడానూ.

విదేశాలవారు మన గోవిజ్ఞాన సారాన్ని గ్రహించారు. అందువల్ల ఒంగోలు, గిరిజాతి వంటి ఉత్తమ జాతి ఆవులను తీసుకువెళ్లి వారి దేశాల అభివృద్ధికి వినియోగిస్తున్నారు. ఆవుపాల ద్వారా క్యాన్సర్‌ను నివారించే 'కర్క్యుమెన్' అనే రసాయనాన్ని తైవాన్ శాస్త్రవేత్తలు తయారు చేస్తున్నారు. సహజ, పశువుల సహకారంతో వ్యవసాయాన్ని ఆయా దేశాలు అనుసరిస్తున్నాయి. గోవుల సహాయంతో వ్యవసాయం ఇప్పటికీ అనుసరణీయం. పైగా భారతీయ సంస్కృతిలో గోవుకు ప్రాధాన్యం చాలా ఎక్కువ. అది కామధేనువు. అందుకే ప్రతి ఇంటిలో గోపోషణ జరగాలి. చక్కటి సంతానం, ఆరోగ్యం, ఆదాయం వీటివల్ల సాధ్యం. గోవధ దేశద్రోహం. గోరక్షణ మానవరక్షణ. గోవు సర్వసంపదలకు మూలం.

-తోట రామారావు

చైనాను దాటేస్తున్నాం

- అత్యంత వేగవంతమైన వృద్ధి దిశగా భారత్
- ఐదో ఈక్విటీ మార్కెట్‌గా అవతరించే అవకాశం
- తాజా అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 21: అంతర్జాతీయ స్థాయిలో హోరాహోరీగా ముందుకు సాగుతున్న భారత్-చైనాల మధ్య కొత్త సంవత్సరంలో ఈ పోటీ అన్నది కొత్త మలుపు తిరగబోతోంది. ఇప్పటివరకూ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఉన్న చైనాను భారత్ అధిగమించబోతోందంటూ తాజాగా ఓ అధ్యయన నివేదికలో వెల్లడైంది. అలాగే ప్రపంచంలోనే భారత ఈక్విటీ మార్కెట్ ఐదో స్థానానికి చేరుకోబోతోందని, ఆ విధంగా మరో మైలురాయిని కూడా భారత్ దాటబోతోందని ఈ నివేదిక తెలిపింది. ప్రపంచంలో అనేక దేశాలు వృద్ధిమాంద్యం, వ్యవస్థాగత మార్పులకు అవసరమైన చర్యలు చేపట్టకపోవడం వంటి సమస్యలతో సతమతమవుతుంటే భారత్ అందుకు భిన్నంగా అత్యంత వేగంగా ఆర్థిక సంస్కరణలను అమలుచేయబోతోందని, ఆ విధంగా బలమైన దీర్ఘస్థాయి వృద్ధి రేటును సముపార్జించుకుంటోందని సాంక్టమ్ వెల్త్ మేనేజ్‌మెంట్ అనే సంస్థ తెలిపింది.

రానున్న కొన్ని నెలల వ్యవధిలోనే ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద ఈక్విటీ మార్కెట్‌గా అవతరించడంతో పాటు అత్యంత వేగంగా వృద్ధి రేటును సంతరించుకుంటూ అభివృద్ధినీ సాధిస్తూ చైనాను భారత్ దాటేస్తుందని ఈ నివేదిక తెలిపింది. అభివృద్ధి చెందిన దేశాలు 2-3 శాతం వృద్ధిరేటు మధ్య కొట్టుమిట్టాడుతుంటే భారత్ 7.5 శాతం వృద్ధి రేటే లక్ష్యంగా పరుగులు తీస్తోందని తెలిపింది. అలాగే భారత ఆర్థిక వ్యవస్థలో మరో కీలకమైన మార్పు వినియోగదారుడే ధరలను నియంత్రించే పరిస్థితి ఉండడం. అంటే ఆ విధంగా మార్కెట్ ధరలను తమ డిమాండ్‌కు అనుగుణంగా మార్చుకునే సత్తాను భారత వినియోగదారుడు సంతరించుకున్నాడని తెలిపింది.



మరో ఐదు రోజుల్లో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో భాగంగా నిర్వహిస్తున్న రిహార్సల్స్‌లో ఆదివారం ఢిల్లీలోని రాజ్‌పథ్‌లో కనువిందు చేసిన చిన్నారుల పరేడ్. ఎయిర్ ఫోర్స్ విమానాల విన్యాసాలు.



శ్రీనగర్ దాల్ సరస్సులో నెహ్రూపార్క్‌లోని ఓ పుస్తకాల ముద్రణాలయం ఇది. ఇందులో దాదాపు 80వేల పుస్తకాలున్నాయి. ఇటీవలే ఈ ముద్రణాలయం లిమ్కా బుక్స్ రికార్డుల్లోకి ఎక్కింది. దేశంలో సరస్సులో నిర్వహిస్తున్న ఏకైక లైబ్రరీగా ఇది పేరుగాంచింది.

పారదర్శకంగా కేసుల కేటాయింపు

సీజే ఆలోచనలో కొత్త విధానం ▪ పరిష్కారం దిశగా సుప్రీం సంక్షోభం



న్యూఢిల్లీ, జనవరి 21: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తితో నలుగురు సీనియర్ జడ్జీలకు విభేదాలు తలెత్తిన నేపథ్యంలో విచారించాల్సిన కేసుల కేటాయింపులకు సంబంధించి ఓ స్పష్టమైన విధానం అమలులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. అత్యంత సునిశితమైన ప్రజాహిత పిటిషన్లను న్యాయమూర్తులకు కేటాయించే విషయంలో పారదర్శకతను పెంపొందించేలా ఈ విధానాన్ని అమలులోకి తీసుకురావచ్చునని తెలుస్తోంది. ముఖ్యంగా తాజా పరిణామాల నేపథ్యంలో ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా ఈ ప్రతిపాదనను చురుగ్గా పరిశీలిస్తున్నట్టు ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఈ నెల 12న నలుగురు సీనియర్ న్యాయమూర్తులు లేవనెత్తిన వివాదాస్పద అంశాలను దృష్టిలో పెట్టుకుని ప్రజాహిత పిటిషన్లను కేటాయించే విషయంలో ఈ తాజా ఆలోచనను తెరపైకి తెచ్చినట్లుగా చెబుతున్నారు. నలుగురు న్యాయమూర్తులు ప్రస్తావించిన అన్ని అంశాలను ప్రధాన న్యాయమూర్తి పరిగణనలోకి తీసుకున్నారని చెప్పడానికి తాజాగా దీపక్ మిశ్రా తీసుకున్న నిర్ణయమే నిదర్శనమని తెలుస్తోంది. సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి బీహెచ్ లోయా మరణంపై స్వతంత్ర దర్యాప్తుకు ఆదేశించాలన్న రెండు పిటిషన్లను సీజే సారథ్యంలోని బెంచ్‌కే కేటాయించడం ఇందుకు నిదర్శనంగా చెబుతున్నారు. ఈ హత్య కేసుకు సంబంధించిన పిటిషన్లు సోమవారం విచారణకు వస్తాయి. ఇప్పటికే ప్రధాన న్యాయమూర్తి మిశ్రా సహ న్యాయమూర్తులతో అనేక అంశాలపై విస్తృతంగా చర్చించారని, అలాగే సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ చేసిన సూచనలను కూడా పరిగణనలోకి తీసుకున్నారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఓ స్పష్టమైన, నిర్దిష్టమైన కేసుల కేటాయింపు వ్యవస్థను అమలులోకి తెచ్చే అవకాశాలు బలపడుతున్నాయని తెలుస్తోంది. కేసుల కేటాయింపులకు సంబంధించి ప్రధాన న్యాయమూర్తి తీసుకునే నిర్ణయాలను సుప్రీం కోర్టు రిజిస్ట్రీ తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తుంది. ఆ విధంగా ఎవరు ఏ కేసును విచారిస్తున్నారన్నది ప్రజలకు తెలిసే అవకాశం ఉంటుందని అభిజ్ఞ వర్గాల కథనం. కేసుల కేటాయింపులకు సంబంధించి ఢిల్లీ హైకోర్టులో ఉన్నట్లుగా రోస్టర్ వ్యవస్థను అనుసరించాలన్న డిమాండ్ దీర్ఘకాలంగా వినిపిస్తోందని సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్ సింగ్ స్పష్టం చేశారు. సుప్రీం కోర్టు పనితీరును మెరుగుపరిచేందుకు తమకిందిన సూచనలను, సలహాలను దీపక్ మిశ్రా అమలు చేసే అవకాశం ఉందని, ఆ విధంగా న్యాయమూర్తులతో తనకు తలెత్తిన విభేదాలను నివృత్తి చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని సింగ్ తెలిపారు. ఒకే రకమైన కేసులను కేటాయించేందుకు ఓ స్పష్టమైన వ్యవస్థ ఢిల్లీ హైకోర్టుతోపాటు బొంబే హైకోర్టులోనూ అమలవుతోందని ఆయన తెలిపారు. కాగా న్యాయవ్యవస్థలో తలెత్తిన సంక్షోభాన్ని సామరస్యపూర్వక ధోరణిలో ఏ విధంగా పరిష్కరించాలన్న దానిపై కాబోయే ప్రధాన న్యాయమూర్తులతోపాటు కొందరు న్యాయమూర్తులు దీపక్ మిశ్రాతో చర్చలు జరుపుతున్నారని సన్నిహిత వర్గాలు వివరించాయి. వీరిలో ఎస్‌ఏ బాబ్డే, ఎన్‌వీ రమణ, యుయు లలిత్, డీవై చంద్రచూడ్ కూడా ఉన్నారు.

నలుగురు ఉగ్రవాదులు హతం

అఫ్గాన్ హోటల్ దాడిలో ఆరుగురు టూరిస్టుల మృతి ▪ 12 గంటల దిగ్బంధానికి తెర

కాబూల్, జనవరి 21: దాదాపు 12 గంటలపాటు కాబూల్ హోటల్‌పై దాడి చేసి, దాన్ని దిగ్బంధం చేసిన సంఘటనకు ఆదివారం తెరపడింది. మిలిటెంట్లు జరిపిన దాడిలో ఓ విదేశీయుడు సహా ఆరుగురు మరణించారని అధికార వర్గాలు తెలిపాయి. దాడి చేసిన నలుగురు మిలిటెంట్లను అఫ్గాన్ భద్రతా దళాలు హతమార్చాయని దేశీయ మంత్రిత్వ శాఖ ప్రతినిధి నజీబ్ డానిష్ తెలిపారు. ఈ 12 గంటల దిగ్బంధ సమయంలో ఈ లగ్జరీ హోటల్‌లో ఉన్న టూరిస్టులు భయంతో పరుగులు పెట్టారని, బయటికి పారిపోవడానికి అన్ని మార్గాల్లోనూ ప్రయత్నించారని ఆయన వెల్లడించారు. మొత్తంమీద ఈ దాడికి తెరదించామని, మృతుల్లో ఐదుగురు అఫ్గాన్ జాతీయులు కాగా, ఒక విదేశీయుడు కూడా ఉన్నారని దేశీయ మంత్రిత్వ శాఖ ప్రతినిధి నజ్రత్ రహీమీ తెలిపారు. ఈ దిగ్బంధం తొలగించడంతోపాటు 40 మంది విదేశీయులు సహా మొత్తం 150 మంది రక్షించగలిగామని వెల్లడించారు. దాడి చేసినవారిలో చివరి ఆగంతకుడిని కూడా హతమార్చామని, హోటల్ ఆరవ అంతస్థులో ఈ విదేశీ మహిళ మృతదేహం కనిపించిందని ఆయన తెలిపారు. అయితే ఈ లగ్జరీ హోటల్‌పై జరిగిన దాడి ఇంకా సమసిపోలేదని ఇందులో నక్కిన మిలిటెంట్లు భద్రతా దళాలపై దాడులు చేస్తూనే ఉన్నారని అఫ్గాన్ గూఢచార సంస్థ ఏఎఫ్‌పీ వార్త సంస్థకు తెలిపింది. అంతర్జాతీయ ఇంటర్ కాంటినెంటల్ హోటళ్ల సముదాయంలో భాగమైన ఈ ఆరంతస్థుల లగ్జరీ హోటల్ నుంచి దట్టమైన పొగలు, మంటలు చెలరేగుతున్నట్లుగా టోలోన్యూస్ అనే చానల్ ప్రసారం చేసిన దృశ్యాలను బట్టి స్పష్టమవుతోంది. దుప్పట్లను ఉపయోగించి బాల్కనీ ద్వారా తప్పించుకునేందుకు అనేకమంది ప్రయత్నించిన దృశ్యాలను కూడా ఈ చానల్ ప్రసారం చేసింది. ఈ ప్రయత్నంలో పట్టు తప్పి ఓ వ్యక్తి కిందపడిన దృశ్యాన్ని కూడా ప్రసారం చేసింది. మొత్తం నలుగురు మిలిటెంట్లు శనివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత ఈ హోటల్‌లోకి చొరబడ్డారని, హోటల్ సిబ్బందిపైన, అతిథులపైన కాల్పులు జరుపుతూ అనేక మందిని బంధీలుగా చేసుకున్నారని అధికారులు తెలిపారు. అయితే ఈ దాడికి తమదే బాధ్యత అంటూ ఏ మిలిటెంట్ సంస్థా ఇప్పటివరకూ ప్రకటించలేదు. 2011లో కూడా ఇదే హోటల్‌పై తాలిబన్ మిలిటెంట్లు దాడి చేసిన విషయాన్ని అధికారులు ఈ సందర్భంగా గుర్తుచేశారు.



ఉగ్రవాదుల దాడి అనంతరం కాబూల్‌లోని ఇంటర్‌కాంటినెంటల్ హోటల్ నుంచి వెలువడుతున్న పొగ. ఉగ్రవాదులను మట్టుబెట్టేందుకు పొంచివున్న భద్రతా దళాలు



ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆదివారం తన ఇంట్లో సంక్రాంతి ఉత్సవాలను నిర్వహించారు. ఆ కార్యక్రమానికి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ తిరిగి వెళుతున్న దృశ్యం. వెంకయ్య మనుమరాలిని ముద్దాడుతున్న విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్

ఉల్కలవల్లే భూమ్మీదికి నీరు!

తాజా అధ్యయనంలో నిర్ధారణ



బోస్టన్, జనవరి 21: అసలు ఈ భూమ్మీదికి జలసంపద ఎలా వచ్చిందన్నది సమాధానం లేని ప్రశ్నగానే ఖగోళవేత్తలను నిరంతరం వేధిస్తూనే వచ్చింది. అయితే ఇందుకు సంబంధించి ఎడతెరిపి లేకుండా జరిపిన అధ్యయనాలు, పరిశోధనల ఫలితంగా తాజాగా ఓ కొత్త విషయాన్ని తెరపైకి తెచ్చారు. సౌర వ్యవస్థ ఆవిర్భవించిన మొదటి 20 లక్షల సంవత్సరాల కాలంలోనే ఉల్కల కారణంగా భూమ్మీదికి జలసంపద వచ్చిందని ఈ అధ్యయనంలో వెల్లడైంది. ఈ భూమ్మీద జీవజాతి ఆవిర్భావానికి నీరు, కర్బనం వంటి మూలకాలే అత్యంత కీలకం కాబట్టి అసలీ మూలకాలు పుడమిపైకి ఎలా వచ్చాయన్నదానిపైన కూడా శాస్త్రవేత్తలు దృష్టిపెట్టారు. తాజాగా వెలుగు చూసిన వాస్తవాల నేపథ్యంలో ఉల్కల తీరుతెన్నులపైనే తాము దృష్టిపెట్టామని, అనేక కోణాల్లో వీటిని లోతుగా గమనిస్తున్నామని వెల్లడించారు. సౌర వ్యవస్థ తొలిదశలో ఈ ఉల్కలు ఎలా ఉండేవి? ఎక్కడ ఉండేవి? వాటిలో ఎంత మేరకు జలసంపద ఉండేది అన్న దానిపైన అధ్యయన కోణాన్ని సారించినట్లు మసాచుసెట్స్ టెక్నాలజీ సంస్థ (ఎమ్‌ఐటి)కు చెందిన ఆడమ్ సరాఫియాన్ తెలిపారు. 4.56 బిలియన్ సంవత్సరాల క్రితమే మన సౌర వ్యవస్థ అంతర్భాగంలో ఆంగ్రైట్ అనే ఉల్కలు ఏర్పడ్డాయని, ఆ దశలో ఈ భూమి ప్రస్తుత దశకు 20 శాతం మాత్రమే ఉందని వెల్లడించారు. చాలా త్వరితగతిన అంగారక గ్రహం గ్రహ పరిమాణంలో ఏ మాత్రం మార్పు లేదని, ప్రస్తుతం అది ఏ పరిమాణంలో ఉందో అప్పుడు కూడా అలాగే ఉండేదని తెలిపారు. అలాగే మార్క్యురీ వీనస్ గ్రహాలు ఎంత త్వరితగతిన ఏర్పడ్డాయన్న దానిపై స్పష్టంగా ఏ విషయాన్నీ చెప్పలేమని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఆంగ్రైట్ ఉల్కల్లో ప్రస్తుతం భూమి మీద ఉన్న జలసంపదలో 20 శాతం ఉండేదని తెలిపారు. దీన్నిబట్టి చూస్తే సౌర వ్యవస్థ తొలిదశలో అంటే 4.56 బిలియన్ సంవత్సరాల క్రితమే జలసంపదన సమృద్ధిగా ఉండేదని స్పష్టమవుతోందని అన్నారు.

తీర రక్షణకు పటిష్ఠ ప్రణాళిక

- నౌకలు, ఫిషింగ్ బోట్లపై నిఘా
- ఫిబ్రవరి 15లోగా 'డాట్' తప్పనిసరి
- మత్స్యకారులకు బయోమెట్రిక్ కార్డులు



ఆంధ్రభూమి బ్యూరో

కాకినాడ, జనవరి 21: జిల్లాలోని కోస్తా తీర ప్రాంతంలో భద్రతా చర్యలను ముమ్మరం చేస్తున్నారు. సముద్రంలో ప్రయాణించే నౌకలు, ఫిషింగ్ బోట్లపై పటిష్ఠ నిఘా చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు కోస్తా తీర ప్రాంత భద్రతకై ప్రత్యేక కమిటీ ఏర్పాటయ్యింది. కమిటీ పర్యవేక్షణలో తీరప్రాంతంలో నిఘా, రక్షణ చర్యలకు పటిష్ఠ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇందుకు కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీస్, కస్టమ్స్, మత్స్యశాఖాధికారుల సమన్వయంతో భద్రతా చర్యలు చేపట్టారు. భద్రతాచర్యల్లో భాగంగా కోస్తా తీర ప్రాంతంలోని పోర్టులు, రెవెన్యూ శాఖలకు చెందిన స్థలాల్లో కేంద్ర ప్రభుత్వ నిధులతో ప్రత్యేక జెట్టీలు నిర్మించనున్నారు. ఈ జెట్టీల నుండి రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు సముద్రంలో సంచరించే నౌకలు, ఫిషింగ్ బోట్లపై పటిష్ఠ నిఘా ఉంచుతారు. వేటకు వెళ్ళే ప్రతి బోటుకు రిజిస్ట్రేషన్ చేయించాలని, ప్రభుత్వం నిర్ణయించిన రంగులను సదరు బోట్లకు వేయాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు. ఇటీవలి కాలంలో తూర్పు తీర ప్రాంతంలోని మత్స్యకారులకు బయోమెట్రిక్ కార్డులు జారీచేస్తున్నారు. ఇప్పటికే సుమారు 50వేల మంది మత్స్యకారులకు బయోమెట్రిక్ కార్డులు జారీ చేశారు. మిగిలిన మత్స్యకారులను మత్స్యశాఖాధికారులు యుద్ధప్రాతిపదికన గుర్తించి బయోమెట్రిక్ కార్డులు జారీచేసే పనిలో ఉన్నారు. అన్ని రకాల మర పడవలకు డాట్ (డిస్ట్రస్ ఎలర్ట్ ట్రాన్సిమిటర్లు) ఏర్పాటుచేయాలని తీర ప్రాంత భద్రతా కమిటీ నిర్ణయించింది. ఫిబ్రవరి 15వ తేదీలోగా డాట్ పరికరాలు ఏర్పాటుచేసుకోని మర పడవల లైసెన్స్‌లు రద్దుచేయాలని కమిటీ ప్రకటించింది. డాట్ పరికరాన్ని అమర్చిన మర పడవ ప్రమాదవశాత్తూ అదృశ్యమైన పక్షంలో సాంకేతిక సహాయంతో దాని ఆచూకీ లభిస్తుంది. గతంలో ప్రకృతి వైపరీత్యాల సమయంలో అనేక బోట్లు సముద్రంలో గల్లంతు కావడంతో పలువురు మత్స్యకారులు మృతిచెందిన సందర్భాలున్నాయి. తుపాన్ల సమయంలో ముందుజాగ్రత్తగా హెచ్చరించే అవకాశం డాట్‌తో సాధ్యమవుతుంది. గల్లంతైన బోటు ఆచూకీ తెలుసుకునే అవకాశం ఉంది. భద్రతా చర్యల్లో భాగంగా నోటిఫైడ్, నోటిఫై కాని ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక రక్షణ చర్యలు చేపడుతున్నారు. ఆయా ప్రభుత్వ బృందాలు నిరంతరం ఫిష్ ల్యాండింగ్ ప్రాంతాల్లో గస్తీ నిర్వహించేలా జాగ్రత్త వహిస్తున్నారు. కోస్తా తీరంలో మత్స్యకారులు వినియోగించే పడవలకు ఆలివ్ రిడ్లే తాబేళ్ళను రక్షించే పరికరాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. తాజాగా తీర ప్రాంత పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై మత్స్యకారులు, మర పడవల యజమానులకు ప్రత్యేక అవగాహన శిబిరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రథసప్తమికి తిరుమలలో జోరుగా ఏర్పాట్లు

తిరుపతి, జనవరి 21: ఈ నెల 24న సూర్య జయంతి సందర్భంగా తిరుమలలోని శ్రీ మలయప్ప స్వామివారు ఉదయం 5.30 నుంచి రాత్రి 9 గంటల వరకు సప్తవాహనాలపై దర్శనమిస్తారు. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు చక్రస్నానం నిర్వహిస్తారు. ఈ ఉత్సవం కారణంగా శ్రీవారి ఆర్జిత సేవలు, విఐపి బ్రేక్ దర్శనం, వయోవృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక దర్శనాలను రద్దు చేశారు. దివ్య దర్శనం టోకెన్లు, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు యథావిధిగా ఉంటాయి. భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. వాహన సేవలను భక్తులు తిలకించేందుకు వీలుగా 19 ఎల్ఈడీ స్క్రీన్‌లు, ప్రత్యేకంగా పుష్పాలంకరణలు, 3 వేల మంది శ్రీవారి సేవకులు, 800 స్కౌట్స్ అండ్ గైడ్స్ భక్తులకు సేవలందించనున్నారు. భక్తులకు అందుతున్న సౌకర్యాలను పర్యవేక్షించేందుకు మాడవీధుల్లో సీనియర్ అధికారులను నియమించనున్నారు. సూర్యప్రభ వాహన సేవల్లో ఎస్వీ బాలమందిరం విద్యార్థులు ఆదిత్య హృదయం పారాయణం చేస్తారు. భక్తులు వీక్షించేందుకు వీలుగా ఎస్వీబీసీలో వాహన సేవల ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు ప్రొటోకాల్ ప్రముఖులకు మాత్రమే టీటీడీ విఐపి బ్రేక్ దర్శనాలను పరిమితం చేసింది.

భారత హైకమిషనర్‌కు పాక్ సమన్లు

అధీన రేఖ వద్ద కాల్పులపై నిరసన

ఇస్లామాబాద్, జనవరి 21: అధీనరేఖ ప్రాంతంలో భారత్ సైనిక దళాలు ఎలాంటి కవ్వింపు లేకుండా కాల్పులకు పాల్పడ్డాయంటూ వరుసగా నాల్గవ రోజైన ఆదివారం కూడా భారత డిప్యూటీ హైకమిషనర్‌ను పాకిస్తాన్ పిలిపించింది. భారత దళాల కాల్పుల కారణంగా ఇద్దరు వ్యక్తులు మరణించారని తెలిపింది. సోమవారం నుంచి ఇప్పటివరకూ భారత డిప్యూటీ హైకమిషనర్ జేపీసింగ్‌ను అనేక సార్లు పిలిపించి ఈ కాల్పులకు సంబంధించి పాకిస్తాన్ సంజాయిషీ కోరింది. గత కొంతకాలంగా అధీనరేఖ ప్రాంతంలో భారత్-పాక్ దళాల మధ్య తీవ్రస్థాయి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. భారత సైనిక దళాల కాల్పులకు సంబంధించి పాకిస్తాన్ భారత హైకమిషనర్‌కు తీవ్ర నిరసన తెలిపిందని పాక్ విదేశాంగ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. అధీన రేఖ ప్రాంతంలోని నిఖియాల్ సెక్టార్‌లో మోర్టార్లతోనూ, భారీ ఆయుధాలతోనూ 18 భారత సైనిక శిబిరాలు ఎలాంటి కవ్వింపు లేకుండా గత రెండు రోజులుగా కాల్పులకు ఒడిగట్టాయని, ఆ కాల్పుల్లో ఇద్దరు మరణించారని పాక్ విదేశాంగ కార్యాలయం వెల్లడించింది. భారత్ దళాలు పౌర ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరపడం విచారకరమని పేర్కొంది. భారత్ చర్య అమానుషమే గాకుండా అంతర్జాతీయ మానవ హక్కులను ఉల్లంఘించడమేనని వెల్లడించింది.




ఎలాంటి కవ్వింపు లేకుండా భారత్ కాల్పులకు పాల్పడుతోందని పాక్ ఆరోపిస్తున్నా.. వాస్తవికతను అద్దం పట్టే చిత్రాలివి. పాక్ సైన్యం జరిపిన దాడులకు ఆర్.ఎస్.పురాలో ఇల్లు దెబ్బతినడంతో వంట సామాన్లను తీసుకుంటున్న ఓ మహిళ. పాక్ కాల్పులకు భయపడి సురక్షిత ప్రాంతాలకు తరలివెళుతున్న ఓ కుటుంబం.



ఆ నిబంధన తొలగించండి

★ ఎస్ఈజెడ్‌లు అన్నింటికీ పన్ను మినహాయించండి
★ ఆర్థిక మంత్రిత్వ శాఖను కోరిన వాణిజ్య శాఖ

న్యూఢిల్లీ, జనవరి 21: ఎగుమతులు పుంజుకోవడానికి, ఉద్యోగాల కల్పనను పెంచడానికి ప్రత్యేక ఆర్థిక మండళ్లు (ఎస్ఈజెడ్‌లు) ప్రస్తుతం అనుభవిస్తున్న ఆదాయపు పన్ను ప్రోత్సాహకాలను కొనసాగించాలని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ గట్టిగా భావిస్తోంది. ఎస్ఈజెడ్‌లపై ప్రస్తుతం విధిస్తున్న కనీస ప్రత్యామ్నాయ పన్నును కూడా ఎత్తివేయాలని వాణిజ్య మంత్రిత్వ శాఖ ఈ మేరకు ఆర్థిక మంత్రిత్వ శాఖకు ఒక లేఖ రాసింది. 2020 మార్చి 31కి ముందు కార్యకలాపాలు ప్రారంభించిన ఎస్ఈజెడ్‌లకు మాత్రమే ఆదాయపు పన్ను మినహాయింపు ప్రయోజనాలు వర్తిస్తాయని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2016-17 బడ్జెట్‌లో పేర్కొన్నారు. అయితే ఈ నిబంధన ఎస్ఈజెడ్‌ల వృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని, అందువల్ల ఈ నిబంధనను తొలగించాలని వాణి జ్య మంత్రిత్వ శాఖ తన లేఖలో ఆర్థి క మంత్రిత్వ శాఖను కోరిందని ఆ అధికారి వెల్లడించారు. నిర్దిష్టమైన తేదీకి ముందు కార్యకలాపాలు ప్రారంభించకుంటే పన్ను ప్రోత్సాహకాలు వర్తించబోవనే ఈ నిబంధన తిరోగామి చర్య అని, ఎస్ఈజెడ్‌లలో పెట్టుబడులపై, ఉద్యోగాల కల్పనపై ఈ నిబంధన ప్రతికూలంగా పనిచేస్తుందని పారిశ్రామిక నిపుణులు పేర్కొంటున్నారు. 'ఈ నిబంధన పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ప్రాజెక్టులు 2020 మార్చి నాటికి పూర్తి అయి ఉండకపోవచ్చంటే, నిజంగా ఆ లోపు పూర్తి చేయడం ఆచరణ సాధ్యం కాకపోయి ఉండొచ్చు. అందువల్ల ప్రభుత్వం ఈ నిబంధనను తొలగించే అంశాన్ని పరిశీలించాలి' అని ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఫర్ ఈఓయూస్ అండ్ ఎస్ఈజెడ్స్ (ఈపీసీఈఎస్) మాజీ చైర్మన్ రాహుల్ గుప్తా అన్నారు.



ఐటీలో తెలంగాణ విజృంభణ

★ ఈ ఏడాది ఎగుమతులు రూ. 97వేల కోట్లు
★ మూడేళ్లలో రూ.30 వేల కోట్ల పెరుగుదల
★ దేశంలో మూడో స్థానంలో నిలిచిన రాష్ట్రం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 21: తెలంగాణ ఐటీ రంగం ఉవ్వెత్తున ఎగిసిపడుతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో ఐటీ ఎగుమతులు రూ.97వేల కోట్లకు చేరనున్నాయి. తెలంగాణ రాష్ట్రం అవతరించిన తర్వాత మునుపెన్నడూ లేని విధంగా మూడేళ్లలో రూ.30 వేల కోట్ల మేర ఐటి ఎగుమతుల విలువ పెరిగింది. ప్రస్తుతం దేశంలో ఐటి రంగంలో బెంగళూరు ప్రథమ స్థానంలో, మహారాష్ట్ర ద్వితీయ స్థానంలో, తెలంగాణ (హైదరాబాద్) మూడో స్థానంలో ఉన్నాయి. 2014-15లో రూ.64 వేల కోట్లతో వృద్ధిరేటు 11.77 శాతాన్ని ఐటి రంగం నమోదు చేసింది. 2015-16లో రూ.75070 కోట్లతో 17.29 శాతం వృద్ధిరేటును నమోదు చేసింది. 2016-17లో రూ.85,470 కోట్లతో 13.85 శాతం వృద్ధిరేటును నమోదు చేసినట్లు ఐటి శాఖ వర్గాలు తెలిపాయి. కాగా ఈ ఏడాది 14 శాతం వృద్ధిరేటుతో దాదాపు రూ.97వేల కోట్లకు ఐటి ఎగుమతులు ఎగబాకనున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్ ఐటి రంగంలో 4.5 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ రంగం వల్ల 10 లక్షల మంది పరోక్ష ఉపాధి పొందుతున్నారు. గత ఏడాది జూలై నుంచి డిసెంబర్ వరకు ఐటి స్పేస్ రంగం రియాల్టీ రంగంలో దూసుకుపోయింది. దాదాపు 3.34 మిలియన్ల చదరపు అడుగుల మేర విస్తీర్ణంలో కొత్తగా ఐటి పరిశ్రమలు వచ్చాయి. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్‌లో కూడా ఐటి కంపెనీలు వస్తున్నాయి. ఐటి కంపెనీలు రాష్ట్రంలో రెండవ టైర్ పట్టణాలకు విస్తరించడం శుభసూచకమని సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్కు ఆఫ్ ఇండియా డైరెక్టర్ సివిడి రాంప్రసాద్ తెలిపారు. 2020 నాటికి రూ.1.20 లక్షల కోట్లకు ఐటి ఉత్పత్తుల ఎగుమతి పెరిగే అవకాశం ఉంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అదనంగా నాలుగు లక్షల మందికి ఉద్యోగాలు, పరోక్షంగా అదనంగా పదిలక్షల మందికి ఉపాధి కల్పించేందుకు వీలుగా కొత్త ఐటి విధానం ఉంది.



క్యూ3 ఫలితాలే కీలకం



★ బడ్జెట్‌పైనా మదుపరుల దృష్టి
★ అనిశ్చితి పెరిగే అవకాశమూ ఉంది
★ ఈ వారం మార్కెట్ సరళిపై అంచనా

న్యూఢిల్లీ, జనవరి 21: యాక్సిస్ బ్యాంక్, మారుతి సుజుకి వంటి బ్లూచిప్‌లు మూడో త్రైమాసికంలో (క్యూ3లో) ఆర్జించే లాభాలతో పాటు డెరివేటివ్‌ల కాలపరిమితి ముగింపు సోమవారం నుంచి మొదలయ్యే వారంలో దేశీయ స్టాక్ మార్కెట్ సరళిని ప్రభావితం చేయనున్నాయని నిపుణులు పేర్కొన్నారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవం వస్తున్నందున ఆ రోజున స్టాక్ మార్కెట్లు పని చేయవు. అందువల్ల ఈ వారంలో కేవలం నాలుగు రోజులే మార్కెట్లు పనిచేస్తాయి. 'ఈ సంవత్సర మూడో త్రైమాసిక ఫలితాలతో పాటు ఫిబ్రవరి ఒకటో తేదీన ప్రవేశపెట్టనున్న సాధారణ బడ్జెట్‌పైనా మార్కెట్ల దృష్టి కొనసాగుతుంది. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్అండ్ఓ) కాలపరిమితి జనవరి 25న ముగుస్తున్నందున స్టాక్ మార్కెట్లలో అనిశ్చితి కూడా చోటు చేసుకునే అవకాశం ఉంది' అని కొటక్ సెక్యూరిటీస్ రీసెర్చ్ విభాగం వైస్ ప్రెసిడెంట్ టీనా విర్మాని తెలిపారు. 'ముందున్న వారంలో మార్కెట్ మూడో త్రైమాసిక ఫలితాల పురోగతిని సునిశితంగా పరిశీలిస్తుంది. ఈ ఫలితాలే మొత్తంమీద ఈ వారం మార్కెట్ ధోరణిని నిర్దేశిస్తాయి. ఎఫ్అండ్ఓ కాలపరిమితి ముగియనుండటంతో ఈ వారంలో అనిశ్చితి పెరిగే అవకాశం కూడా ఉంది' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ విభాగం అధిపతి వినోద్ నాయర్ అంచనా వేశారు. యాక్సిస్ బ్యాంక్, మారుతి సుజుకి ఇండియా, కెనరా బ్యాంక్, ఐడియా సెల్యులార్, కోల్ ఇండియా, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ మొదలగు సంస్థలు ఈ వారంలో తమ మూడో త్రైమాసిక ఫలితాలను వెల్లడించనున్నాయి. 'మార్కెట్‌ను ప్రభావితం చేయనున్న మరో కీలకమైన అంశం బడ్జెట్. బడ్జెట్ ఈ వారం మార్కెట్‌లో అనిశ్చితిని పెంచుతుంది. మార్కెట్ కీలక సూచీల కదలికల విస్తృతి కూడా పెరిగే అవకాశం ఉంది' అని ఎపిక్ రీసెర్చ్ కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) ముస్తఫా నదీమ్ పేర్కొన్నారు. శుక్రవారంతో ముగిసిన వారంలో బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) సెన్సెక్స్ 919.19 పాయింట్లు (2.65 శాతం) పెరగగా, నిఫ్టీ 213.45 పాయింట్లు (1.99 శాతం) పుంజుకుంది.

యాక్సిస్ బ్యాంక్, మారుతి సుజుకి ఇండియా, కెనరా బ్యాంక్, ఐడియా సెల్యులార్, కోల్ ఇండియా, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ మొదలగు సంస్థలు ఈ వారంలో తమ మూడో త్రైమాసిక ఫలితాలను వెల్లడించనున్నాయి. 'మార్కెట్‌ను ప్రభావితం చేయనున్న మరో కీలకమైన అంశం బడ్జెట్. బడ్జెట్ ఈ వారం మార్కెట్‌లో అనిశ్చితిని పెంచుతుంది. మార్కెట్ కీలక సూచీల కదలికల విస్తృతి కూడా పెరిగే అవకాశం ఉంది' అని ఎపిక్ రీసెర్చ్ కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) ముస్తఫా నదీమ్ పేర్కొన్నారు.

కాశీలో వైభవంగా సంక్రాంతి వేడుకలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

★ వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 21: కాశీలోని శ్రీరామతారక ఆంధ్ర ఆశ్రమంలో ఆదివారం సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగినట్లు కాశీ తెలుగు సమితి తెలిపింది. కాశీలోని తెలుగు వారంతా తెలుగుదనం ఉట్టిపడేటట్లు బట్టలు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. పిల్లలకు ముగ్గుల పోటీలు, డ్రాయింగ్ పోటీలు, మహిళలకు మ్యూజికల్ చైర్స్, అంత్యాక్షరి వంటి ఆటలను ఆడించి అలరించారు. సంక్రాంతి వేడుకలను పెద్దలు, పిల్లలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఆటపాటల్లో విజేతలైన పలువురు మహిళలకు కాశీ తెలుగు సమితి బహుమతులను అందజేసింది. వేడుకల సందర్భంగా పాల్గొన్న తెలుగు వారందరికి విందు భోజనం ఏర్పాటు చేసినట్లు సమితి కార్యదర్శి వివి సుందరశాస్త్రి ఒక ప్రకటనలో తెలిపారు.

'పవన్'కు కొండగట్టులో స్థానం లేదు..!

★ ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను మళ్లించడానికి పవన్‌తో తెరాస దోస్తీ
★ తాట, తోలు తీస్తానన్న పవన్‌తో కేసీఆర్ జత కట్టడమా
★ 'మీరా'కు ఇవ్వని అనుమతి 'పవన్'కు ఎలా ఇస్తారు?
★ టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

ఆంధ్రభూమి బ్యూరో

కరీంనగర్, జనవరి 21: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పూర్తిగా వ్యతిరేకించిన జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌కు తెలంగాణ ప్రజల సెంటిమెంట్ అయిన కొండగట్టు ఆలయంలో స్థానం లేదని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ ప్రజల సెంటిమెంటుకు వ్యతిరేకంగా వ్యవహరించిన పవన్‌కు ఇలాంటి అవకాశం ఇవ్వవద్దని డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం కరీంనగర్‌లోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2009 ఎన్నికల్లో జరిగిన ప్రమాదానికి ప్రాయశ్చిత్తంగా కొండగట్టుకు వస్తానంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. భక్తులతో కిటకిటలాడుతున్న కొండగట్టు దేవస్థానానికి పవన్ వస్తే ఆ భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. తెలంగాణకు అన్నివిధాల సహకరించిన మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ వస్తే పలు పోలీసు ఆంక్షలతో అడ్డుకున్న కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణను పూర్తిగా వ్యతిరేకించిన పవన్ విషయంలో ఏ విధంగా స్పందిస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న ఓట్లను దారి మళ్లించేందుకే పవన్‌కల్యాణ్‌తో కేసీఆర్ జతకట్టారని ఆరోపించారు. తెలంగాణ విషయంలో కెసీఆర్‌ను తాట తీస్తా, తోలు తీస్తానన్న పవన్‌తో ఏ విధంగా జత కడతారని కేసీఆర్‌ను సూటిగా ప్రశ్నించారు. ఆయనను తెలంగాణలో, ప్రధానంగా కొండగట్టుకు ఎలా అనుమతిస్తారని ప్రశ్నించారు. ఆంధ్రాలో ఏపి విభజన విషయంలో జరుగుతున్న అన్యాయాలపైన, వైజాగ్‌లో దళిత మహిళపై జరిగిన అకృత్యంపైన స్పందించిన పవన్ తెలంగాణలో జరుగుతున్న అన్యాయాలు, ఘటనలపై ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు.

నేరెళ్లలో దళితులపై అరాచకత్వం ఘటన దేశాన్ని కదిలించినా నిన్ను కదిలించలేదా పవన్ అంటూ మండిపడ్డారు. ఈ విషయంలో పవన్ సమాధానం చెప్పాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఆకుల ప్రకాష్, కర్ర రాజశేఖర్, ఒంటెల రత్నాకర్, దిండిగాల మధు, అజిత్ రావు తదితరులు పాల్గొన్నారు.





45మిలియన్ టన్నులు

★ ఇనుప ఖనిజం ఉత్పత్తి లక్ష్యం
★ వచ్చే ఏడాది సాధించడానికి ఎన్ఎండీసీ ప్రణాళిక

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 21: వచ్చే ఆర్థిక సంవత్సరం (2018-19)లో నేషనల్ మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) 45 మిలియన్ టన్నుల ముడి ఇనుము (ఐరన్ ఓర్)ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 35 లక్షల మిలియన్ టన్నుల ముడి ఇనుము ఉత్పత్తి అవుతుందని అంచనావేశారు. ఎన్ఎండిసి తొలుత రూపొందించిన లక్ష్యం ప్రకారం 2017-18 లో 37 మిలియన్ టన్నుల ముడి ఇనుము ఉత్పత్తి చేయాల్సి ఉంది. సాంకేతికపరమైన కారణాల వల్ల తాము 2017-18 సంవత్సరానికి నిర్ణయించుకున్న లక్ష్యాన్ని చేరుకోలేపోతున్నామని ఎన్ఎండిసి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బజేంద్రకుమార్ తెలిపారు. పిటిఐ వార్తా సంస్థ ప్రతినిధితో మాట్లాడుతూ, 2022 నాటికి ముడి ఇనుము ఉత్పత్తి 67 మిలియన్ టన్నులకు పెంచాలని భావిస్తున్నామన్నారు. ఇందుకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా గనుల తవ్వకం నిలిపివేసిన ఒడిషాలో తిరిగి గనుల తవ్వకం ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నామని బజేంద్రకుమార్ తెలిపారు. ఇందుకోసం ఒడిషా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశామన్నారు. ఎన్ఎండిసి డైరెక్టర్లు ఎస్‌కె నందా, పికె సత్పతిలను ఒడిషా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎపి పధితో చర్చించేందుకు పంపించామన్నారు. ఒడిషాలో గనుల తవ్వకాన్ని నిలిపివేసినందువల్ల 2017-18 సంవత్సరం లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నామని వివరించారు. అందువల్ల భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని ఎన్ఎండిసి సిఎండి వెల్లడించారు.

ఆక్వాలో ఏపీ హవా!

★ విభిన్న రీతుల్లో ప్రభుత్వ సహకారం
★ పెరుగుతున్న సాగు విస్తీర్ణం
★ ఆర్థికంగా బలపడుతున్న రైతాంగం



రొయ్యలు

ఆంధ్రభూమి బ్యూరో

భీమవరం, జనవరి 21: విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధిలో ఆక్వారంగం కీలక పాత్ర పోషిస్తోంది. ప్రస్తుతానికి ఈ రంగమే జాతీయస్థాయిలో ఆంధ్రప్రదేశ్ గౌరవాన్ని పెంచుతోంది. దేశవ్యాప్తంగా ఏటా సుమారు రూ.37,871 కోట్లు విలువైన ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి అవుతుండగా ఒక్క ఏపీ నుంచే రూ.17 వేల కోట్ల విలువైన ఎగుమతులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆక్వా రంగం ప్రాధాన్యతను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ రంగం అభివృద్ధికి కొత్త కొత్త ఆలోచనలతో ముందుకొస్తోంది. ఆక్వా రంగంలోని కీలకమైన రొయ్యల విషయానికి వస్తే జాతీయ స్థాయిలో రాష్ట్రం వాటా 60.1 శాతంగా ఉంది. మన దేశం నుండి ఏటా 4.97 లక్షల టన్నుల రొయ్యలను వివిధ దేశాలకు ఎగుమతి చేస్తుండగా ఒక్క రాష్ట్రం నుంచి 3.02 లక్షల టన్నుల ఎగుమతులు జరుగుతున్నాయి. అందులో పశ్చిమ గోదావరి జిల్లా వాటా 1,20,926 టన్నులుగా ఉండటం విశేషం. ఇక చేపల ఉత్పత్తిలో రాష్ట్రం ఆది నుంచీ ప్రథమ స్థానంలోనే నిలుస్తోంది. రాష్ట్రంలో ఏటా 37.41 లక్షల టన్నుల చేపలు ఉత్పత్తి అవుతున్నాయి. అందులో పశ్చిమ గోదావరి జిల్లా నుంచి 7,06,300 టన్నుల చేపలు ఉత్పత్తి అవుతుండటం విశేషం.



చేపలు

విభజన నేపథ్యంలో కీలకమైన సాఫ్ట్‌వేర్ రంగమంతా హైదరాబాద్‌లోనే నెలకొనివుండటంతో ఏపీకి ఒక విధంగా దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందనే చెప్పవచ్చు. ఇప్పటికిప్పుడు సాఫ్ట్‌వేర్ ఎగుమతులు ఇబ్బడిముబ్బడిగా పెంచుకునే అవకాశం లేకపోవడంతో వేల కోట్ల రూపాయల ఎగుమతులకు అవకాశమున్న ఆక్వా రంగంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. ఈ రంగంలో ఇప్పటికే ఏపీ గణనీయమైన ప్రగతి సాధిస్తుండటంతో దీన్ని మరింత అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తోంది.

ఉమ్మడి రాష్ట్రంలో ఆక్వా రంగాన్ని పట్టించుకున్న నాథుడే లేడని చెప్పడం అతిశయోక్తికాదు. అయితే కొద్దిపాటి శ్రద్ధచూపిస్తే ఈ రంగం నుండి అనూహ్య ఫలితాలు సాధించవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుర్తించారు. దీంతో ఆక్వా రంగంపై దృష్టిసారించారు. గత రెండేళ్లుగా బడ్జెట్‌లో ఈ రంగానికి ప్రాధాన్యతనిస్తున్నారు.

రానున్న బడ్జెట్‌లో కూడా కేటాయింపులు మరింతగా పెంచనున్నట్టు సమాచారం. అలాగే రొయ్యల సాగును చట్ట పరిధిలోకి తీసుకురావడం, ఆక్వా రంగంతో కాలుష్యం పెరగకుండా చర్యలు తీసుకోవడం, ఈ రంగంలోని సన్న, చిన్నకారు రైతులకు ప్రోత్సాహకాలు అందివ్వడం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టిసారించింది.

రానున్న రోజుల్లో ఆక్వా రైతులకు నికర ఆదాయం సమకూర్చేలా ప్రభుత్వం కృషిచేస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో ఆక్వా రైతుల పరిస్థితి సైతం మూడు పువ్వులు ఆరుకాయలుగా మారుతోంది. గతంలో ఆర్థికంగా కునారిల్లిపోయిన ఆక్వా రైతాంగం మళ్లీ ఇప్పుడిప్పుడే ఆర్థికంగా బలపడుతోంది.

ఖైదీల్లో జీవన నాదం

● నేరస్థుల్లో మార్పుకు ఉన్న(త)తి మార్గం! ● కౌన్సిలింగ్‌తో చక్కని మార్పు ● ముగ్గురు జీవిత ఖైదీలే మార్గదర్శకులు
● కుటుంబ సభ్యులతోనూ ములాఖత్ ● ఐదు విడతలుగా 150 మందికి అవగాహన ● 122 మంది విడుదల, మళ్లీ జైలుకు రాని వైనం

తివిరి ఇసుకన తైలం తీయవచ్చు... ఇది నిజంగా నిజం. కరడుగట్టిన ఖైదీల్లో సైతం మార్పునూ తేవచ్చు. నైతికవర్తనానూ పాదుకొల్ప వచ్చు. జీవితం వ్యర్థం కారాదంటూ 'ఉన్నత' విలువలనూ పెంపొందించవచ్చు. ఒకసారి నేరం చేస్తే అది చర్విత చరణంగా జీవితాన్నే మార్చేస్తుందన్న నైరాశ్యం నుంచి బయటపడేవచ్చు. ఇలాంటి ఉన్నత భావాలను ఖైదీల్లో పాదుకొల్పి వారిలో పరివర్తనను తీసుకువచ్చే సమున్నత పథకమే 'ఉన్నతి'. జీవిత విలువలను శిక్షా కాలంలోనే ఖైదీల్లో పెంపొందించడం ఓ ఉదాత్త ఆలోచన. ఆ ఆలోచనే నేడు కార్యరూపం దాల్చి సత్ఫలితాలనిస్తోంది. ఖైదీలకు జీవితం విలువ తెలుస్తోంది. నమ్ముకున్నవారిని ఆదరించాలన్న భావనా పెరుగు తోంది. వరంగల్ జైలులో మొదలైన ఈ 'ఉన్నతి'.. జీవితం వ్యర్థమనుకునే జైలుపక్షుల పాలిట విలువల పెన్నిధి.

తమ్మలి మురళీధర్

సంగారెడ్డి, జనవరి 20: జీవితం, వ్యక్తిగత విలువలు, సమాజంపై సరియైన అవగాహన లేక నేరాలకు పాల్పడడం,పోలీసులకు చిక్కడం, జైలుకు వెళ్లడం.. విడుదలయ్యాక మళ్లీ అదే తంతూ. ఇలాంటి వారిని ఎంత కఠినంగా శిక్షించినా మార్పులేకపోగా మరిన్ని నేరాలకు పాల్పడుతూ తనకుతాను చెడ్డ గుర్తింపు కొని తెచ్చుకొవడమే కాకుండా కుటుంబాలు తలెత్తుకుని తిరగలేకుండా చేస్తున్న వారు ఎంతో మంది ఉన్నారు. ఇలాంటి వ్యక్తులకు మానవీయ విలువలు తెలియజెప్పి సమాజంలో ఎలా బతికితే కుటుంబం, వ్యక్తిగత విలువలు పెరుగుతాయనే విషయలను తెలియజెప్పి వినూత్న మార్పు తెస్తూ అద్భుత విజయాలను తెలంగాణ జైళ్ల శాఖ సొంతం చేసుకుంటుంది. 'ముల్లును ముల్లుతోనే తీయవచ్చు' అనే నానుడి ఇక్కడ సక్షాత్కరిస్తోంది. తలపండిన మేధావుల్లో, మానసిక వైద్యులతోనో కౌన్సిలింగ్ ఇప్పించకుండా వివిధ నేరాల్లో శిక్షలు అనుభవిస్తున్న జీవిత ఖైదీలతో మార్గదర్శనం చేస్తున్నారు. జైళ్ల శాఖ డీజీగా వీకే.సింగ్ బాధ్యతలు స్వీకరించిన తరువాత జైళ్లు, ఖైదీల ప్రవర్తనల్లో మార్పులు తీసుకురావడంతో పాటు స్వశక్తితో అదనపు ఆదాయ వనరులను సమకూర్చుకుంటున్నారని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన విశ్రాంత అధ్యాపకురాలు బీనా నేతృత్వంలోని 18 మంది బృందం 'సహాయం' అనే కౌన్సిలింగ్ కార్యక్రమం పేరిట నేరస్థుల్లో మార్పు తీసుకువచ్చేందుకు శ్రీకారం చుట్టారు. మొట్టమొదటగా చర్లపల్లి జైలులో 'ఉన్నతి' అనే పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించి ఖైదీల్లో మార్పు తీసుకువచ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా వరంగల్ జైలులో జీవిత ఖైదీ శిక్షలు అనుభవిస్తున్న వారికి కూడా ఉన్నతి కార్యక్రమం ద్వారా మార్పుకు శ్రీకారం చుట్టారు. గోదావరిఖనికి చెందిన దనాల శేఖర్ బీటెక్ చదువుతుండగానే నేరానికి పాల్పడి జీవిత ఖైదీ శిక్షను మూడేళ్లుగా అనుభవిస్తున్నాడు. వరంగల్ జిల్లా మొగిలిచెర్లకు చెందిన కొత్తపల్లి శ్రీనివాస్ క్షణికావేశంలో ఒకరిని హత్య చేసినందుకు నాలుగేళ్ల నుండి జీవిత ఖైదీ శిక్షను పొందుతున్నాడు. బీహార్ రాష్ట్రం చప్రా జిల్లా సోన్‌పూర్ గ్రామానికి చెందిన మున్నా కుమార్ ఉపాధ్యాయ నలుగురిని హత్య చేసిన కేసులో 15 ఏళ్లుగా జీవిత ఖైది శిక్షను అనుభవిస్తున్నాడు. ప్రవర్తనలో మార్పు చెందబోమని, మళ్లీ నేరాలు చేయాలనే ఆలోచనతోనే ఉండేవాడినని, కానీ ఉన్నతి కార్యక్రమం చేపట్టాక జీవిత విలువలు, తాను ఎవరి కోసం నేరం చేసి జైలు కొచ్చానో, తన కోసం ఎవరు శిక్ష అనుభవిస్తున్నారో అనే విషయాలు ఉన్నతి కార్యక్రమం ద్వారా అర్థం చేసుకున్నానని దనాల శేఖర్ పేర్కొంటున్నారు. నా భార్య, నా తల్లిదండ్రులు, నా తోబుట్టువుల మాదిరిగా ఇతర వాళ్లు కూడా బాధ పడకూడదనే ఉద్దేశంతో ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్ (టీఓటీ)గా బాధ్యతలు స్వీకరించిన శేఖర్, శ్రీనివాస్, మున్నాలు పేర్కొంటున్నారు. ఉన్నతి కార్యక్రమం ద్వారా అండర్ ట్రైల్ ఖైదీలు మళ్లీ మళ్లీ జైలుకు రాకుండా 30 నుండి 40 రోజుల వరకు తగిన కౌన్సిలింగ్ ఇస్తున్నామన్నారు. ఒక బృందంలో 30 మందిని ఎంపిక చేసి వారికి కౌన్సిలింగ్ ద్వారా జీవన మార్గాలను నిర్దేశిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ జైలులో 8 విడతలుగా అనేక మంది నేరస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి మళ్లీ నేరం చేయకుండా మార్పు తీసుకువచ్చామని సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.



నేరస్థులకు జైలులో కౌన్సిలింగ్ ఇస్తున్న టీఓటీలతో సైకాలజిస్ట్ రాజేశ్వర్ సాల్మన్

అదే తరహాలో గత యేడాది ఏప్రిల్ నెల నుండి సంగారెడ్డి జిల్లా కంది కారాగారంలో ఉన్నతి అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు జైలు సూపరింటెండెంట్ సంతోష్‌కుమార్ రాయ్ పేర్కొన్నారు. ఉన్నతి కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు 150 మందికి ఐదు విడతలుగా కౌన్సిలింగ్ చేసారు. కౌన్సిలింగ్ పొందిన అండర్ ట్రైల్ నేరస్థుల్లో ఇప్పటి వరకు 122 మంది బెయిల్ పై బయటకు వెళ్లగా, మరో 28 మంది జైలులోనే ఉన్నారు. విడుదలై వెళ్లిన వారిలో ఇప్పటి వరకు ఒక్కరూ నేరానికి పాల్పడి జైలు మొహం చూడలేదంటే ఉన్నతి కార్యక్రమం ద్వారా కౌన్సిలింగ్ ఏ మేరకు దోహదపడుతుందో అర్థం చేసుకోవచ్చు. నేరాలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చారని, సమాజంలో కుటుంబ గౌరవానికి భంగం వాటిల్లుతుందనే ఉద్దేశంతో ఇంట్లోకి రానివ్వకపోవడం వల్ల మరోమారు నేరానికి పాల్పడి జైలుకు వస్తున్న నేరస్థుల కుటుంబ సభ్యులను కూడా స్పెషల్ ములాఖత్ పేరిట కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. మొత్తం 15 అంశాల ద్వారా కౌన్సిలింగ్ ఇస్తున్నారు. సమస్య ఎక్కడ పరిష్కారం అవుతే, జైలుకు రావడానికి కారణం, జైలు జీవితం ఎలా ఉంది, జైలు నుండి వెళ్లాక ఎలా జీవిస్తే సమాజంలో ఇనుమడిస్తూ.. మీ వ్యక్తిత్వం పూర్తి స్థాయి అవగాహన కల్పిస్తున్నారు. చిన్న చిన్న కారణాలకు ఆవేశంతో నేరానికి పాల్పడ్డాం. తద్వారా ఎంతటి క్షోభను అనుభవిస్తున్నాం, జైలులో తినడానికి తిండి బాగుంది, సుఖంగా జీవించే అన్ని సౌకర్యాలు ఉన్నాయి, కానీ మనస్సే ఎన్నో ఆశలు పెట్టుకున్న వారు బయట ఎంతటి మానసిక క్షోభ అనుభవిస్తున్నారో అనే విషయాలను నేరస్థుల హృదయాలను తట్టి లేపుతున్నారు. సమాజానికి మేలు చేయకున్నా సరే కానీ కీడు తలపెట్టవద్దని ఉద్బోధిస్తున్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ బాషల్లో అర్థమయ్యే విధంగా హితవు పలుకుతున్నారు. టీఓటీలూ శిక్షణ పొంది జైలు నుండి విడుదలైనా వారు కూడా తిరిగి జైలుకు వచ్చి కౌన్సిలింగ్ కార్యక్రమాల్లో పాల్గొంటూ గతంలో తాము జైలు జీవితాన్ని ఎలా అనుభవించానో, ఇప్పుడు బయటకు వెళ్లాక ఏ విధంగా జీవిస్తున్నాను, తనకు లభిస్తున్న ఆదరణ ఏమిటనే విషయాలను అర్థమయ్యే విధంగా వివరిస్తున్నారు. మానవీయకోణంలో కొనసాగుతున్న ఉన్నతి కార్యక్రమాన్ని బీపీఆర్‌డీ కూడా పరిశీలించి దేశ వ్యాప్తంగా అమలు చేసే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. సహాయం కౌన్సిలింగ్ బృందంలో సభ్యుడైన రాజేశ్వర్ సాల్మన్ సన్మార్గ పద్ధతిలో ఇస్తున్న ఉపన్యాసాలు కూడా నేరస్తుల మార్పులో ప్రధాన పాత్ర పోషిస్తోంది. మొత్తం మీద ఉన్నతి కార్యక్రమం మంచి ఫలితాలను సాధిస్తూ నేరస్తుల్లో సత్ప్రవర్తనను తీసుకురావడం అభినందనీయం.

ప్రత్యేక హోదా, రైల్వే జోన్ కోసం వినూత్న నిరసన

◆ మాజీ మంత్రి కొణతాల నేతృత్వంలో 27న ఢిల్లీకి
◆ రైల్లోనే నిరాహార దీక్ష, ఎంపీలతో భేటీ

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 21: రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ సహా విభజన హామీల అమలుకు మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ నేతృత్వంలో వినూత్న నిరసనకు శ్రీకారం చుట్టనున్నారు. కేంద్రం నిర్లక్ష్యం, రాష్ట్ర ప్రభుత్వం నిర్లిప్తత కారణంగా జరుగుతున్న నష్టాన్ని వివరించే విధంగా రెండు రోజులుపాటు రైలు దీక్ష చేపడుతున్నట్టు కొణతాల రామకృష్ణ విశాఖలో ఆదివారం జరిగిన విలేఖరుల గోష్ఠిలో తెలిపారు. ఈ నెల 27వతేదీన విశాఖ నుంచి ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి 29వతేదీ ఢిల్లీలో దీక్ష విరమిస్తానని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రం విడిపోయి నాలుగేళ్లు పూర్తవుతున్నప్పటికీ విభజన హామీలు అమలుకు నోచుకోలేదంటూ మండిపడ్డారు. ప్రత్యేక హోదా రాష్ట్రానికి సంజీవని లాంటిదేనని, హోదాకు ప్యాకేజీలు ఏ విధంగానూ సాటికాదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలపై కేంద్రం ఉదాశీన వైఖరి అవలంభిస్తోందని ఆరోపించారు. వెనుకబడిన ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు వేల కోట్ల ప్యాకేజీలు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఏడు జిల్లాలకు రూ.50 కోట్ల వంతున మంజూరు చేయడం ద్వారా వివక్ష చూపుతోందని ఆరోపించారు. అన్ని రంగాల్లోనూ వెనుకబడిన ఉత్తరాంధ్రపై కేంద్రం సవతితల్లి ప్రేమను చూపుతోందని, ఈ అంశంపై ఉత్తరాంధ్రకు చెందిన ఎంపీలను స్వయంగా కలిసి కేంద్రాన్ని నిలదీసేందుకు సహకరించాలని కోరనున్నట్టు ఆయన తెలిపారు. పోలవరం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించినప్పటికీ కేంద్రం సహకారం అంతంతమాత్రంగానే ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి బాధ్యతను కేంద్రమే తీసుకోవాలన్నారు. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ డిమాండ్ ఇప్పటిది కాదని, విభజన చట్టం మేరకు కొత్త రాష్ట్రానికి ప్రత్యేక జోన్ ఇవ్వాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. దీనిపై నియమించిన కమిటీ నివేదిక అందజేసి ఆరు నెలలు దాటుతున్నా ఇప్పటికీ రైల్వే జోన్‌పై కేంద్రం నిర్ణయం తీసుకోకపోవడం దారుణమన్నారు.



విలేఖరులతో మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

పంచాయతీలకు పండగే!

◆ గ్రామ సీమల్లో కోలాహలం
◆ కొత్తగా 3800 మంది సర్పంచ్‌ల రాజకీయ ప్రవేశం
◆ 25న కొత్త జాబితా ఖరారు ◆ 2011 జనాభా ప్రాతిపదికన ఏర్పాటు

కె.విజయ శైలేంద్ర

హైదరాబాద్, జనవరి 21: తెలంగాణ గ్రామ సీమల్లో పండగ వాతావరణం నెలకొంది. కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటు నేపథ్యంలో కొత్త తరం రాజకీయాల్లోకి రానుంది. దీనికి తోడు ఫిబ్రవరి నెలలోనే పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే విషయాన్ని పరిశీలిస్తామని ముఖ్యమంత్రి కెసిఆర్ స్వయంగా ప్రకటించడంతో అన్ని రాజకీయ పార్టీల్లోకోలాహలం ప్రారంభమైంది. రాష్ట్రంలో ప్రస్తుతం 8684 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కొత్తగా 3800 పంచాయతీలను ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం సూత్రప్రాయంగా ఒక నిర్ణయానికి వచ్చేసింది. అన్నీ అనుకున్నట్లు ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగితే, రాష్ట్ర రాజకీయాల్లో కొత్తగా ఏర్పాటయ్యే 3800 గ్రామ పంచాయతీలతో సహా మొత్తం 14000 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లతో రాష్ట్ర రాజకీయాల ముఖ చిత్రం మారబోతోంది.

రాజకీయాల్లోకి కొత్త రక్తం

కాని సర్పంచ్ ఎన్నిక ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా నిర్వహించాలనే దానిపై తుది నిర్ణయం ముఖ్యమంత్రి కెసిఆర్‌కు వదిలేశారు. కాగా కొత్త పంచాయతీల ఏర్పాటు ప్రకియ చురుకుగా సాగుతోంది. ఈ నెల 25వ తేదీన తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసే పంచాయితీల పేర్లను, భౌగోళిక సరిహద్దులను ఖరారు చేయనుంది. ఈనెల 22వ తేదీ సోమవారంలోగా 30 జిల్లాల కలెక్టర్లు ప్రతిపాదిత కొత్త గ్రామ పంచాయతీల వివరాలను ప్రభుత్వానికి పంపించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయి. 2011 జనాభా ప్రాతిపదికన కొత్త పంచాయతీల ఏర్పాటులో అధికార యంత్రగం నిమగ్నమైంది. పంచాయతీల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రి వర్గ ఉపసంఘం ఇప్పటికే ముఖ్యమంత్రికి నివేదిక ఇచ్చింది. అనంతరం ముఖ్యమంత్రి కె చంద్రశేఖర రావు ఆదేశాలకు లోబడి పంచాయతీరాజ్ శాఖ, జిల్లా కలెక్టర్లు కొత్త పంచాయతీల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేశారు. కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటుకు సంబంధించి పంచాయితీరాజ్ శాఖ మార్గదర్శకాలను జారీ చేసింది. అధికారులు తండాలను సందర్శించి, అక్కడి పరిస్థితులను ఆకళింపు చేసుకుని కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటును నిర్ధారించాలని ప్రభుత్వం ఆదేశించింది. కనీసం 500 జనాభా అంత కంటే మించి ఉన్న ప్రతి తండాను గ్రామ పంచాయతీగా మార్చనున్నారు. రెండు గ్రామ పంచాయతీల మధ్య 1.5 కి.మీ దూరం ఉండాలి. వచ్చే నెల మొదటి వారంలో పంచాయతీరాజ్ చట్టంపై ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాలను ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ సమావేశాల్లో కొత్త చట్టం ఆమోదం పొందిన వెంటనే గవర్నర్‌కు పంపిస్తారు. గవర్నర్ నుంచి ఆమోదం పొంది వచ్చిన వెంటనే ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉంది. రాష్ట్రప్రభుత్వ ఆర్థిక కమిషన్‌ను కూడా ఏర్పాటు చేసి, ఈకమిషన్‌కు రూ.2వేల కోట్ల నిధులు కేటాయించాలని నిర్ణయించింది.

ఎన్నికల విధి విధానాలను కొత్త చట్టంలో పొందుపరచనున్నారు. గ్రామ పంచాయతీలు వంద శాతం పన్నులు వసూలు చేసేందుకు వీలుగా ప్రోత్సాహకాల పథకాన్ని కూడా ముసాయిదా బిల్లులో చేర్చారు. ఐదు వందల వరకు జనాభా ఉన్న పంచాయతీకి రూ. 5 లక్షలు, ఆ తర్వా త స్థాయి, జనాభా బట్టి ఐదు నుంచి 25 లక్షల రూపాయల వరకు నిధులను ప్రభుత్వం సమకూర్చుస్తుంది.

గణతంత్ర పరేడ్‌లో ఖైదీలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 21: దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా తెలంగాణ జైళ్ల శాఖ డిజి వికె సింగ్ ఖైదీలను గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. ఈ నెల 26న చంచల్‌గూడ జైల్లో జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో ఖైదీలు పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేశారు. చంచల్‌గూడ, చర్లపల్లి, వరంగల్ ఓపెన్ జైళ్లలో ఉన్న 63 మంది ఖైదీలను పరేడ్‌లో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. ఇప్పటికే చంచల్‌గూడ జైల్లో ఖైదీలకు ప్రత్యేక దుస్తుల్లో ఖైదీలకు రిహార్సల్ చేయిస్తుండగా, మిగిలిన రెండు జైళ్లలో కూడా అదే పద్ధతిలో వారికి రిహార్సల్ ఇప్పిస్తున్నారు. ఒక ప్లాటూన్‌లో 21 మంది ఖైదీలతో కలిసి మూడు జైళ్ల నుంచి మూడు ప్లాటూన్లలో మొత్తం 63 మంది ఖైదీలు పరేడ్‌లో పాల్గొనబోతున్నారు. రెండు రోజులు ముందుగానే వీరిని ఫైనల్ రిహార్సల్ కోసం చంచల్‌గూడ జైలుకు తీసుకు రానున్నారు. లేత ఆకుపచ్చని యూనిఫాంతో పాటు బూట్లు, టోపి ధరించి ఖైదీలంతా పరేడ్‌లో పాల్గొంటారని జైళ్ల శాఖ చెబుతోంది. జైళ్ల శాఖ డిజి, కింది స్థాయి ఐజి అధికారులు ఈ పరేడ్ రిహార్సల్‌ను పరిశీలించనున్నారు. గతంలోనూ రిపబ్లిక్‌డే, స్వాతంత్ర దినోత్సవంలో కొందరు ఖైదీలకు పరేడ్‌లో పాల్గొనే అవకాశం కల్పించారు. చంచల్‌గూడ జైల్లో మాత్రమే ఆ అవకాశం కలిగించగా, ఇప్పుడు మిగిలిన జైళ్లలో ఉన్న వారిని సైతం కలుపుకుని పరేడ్‌లో వారికి భాగస్వామ్యం కలిగిస్తున్నారు.

1వ పేజీ తరువాయి

అనర్హత వేటుకు...

లాభదాయక పదవిని చేపట్టినట్టు అయిందని, ఫలితంగా వీరు శాసనసభకు అర్హత కోల్పోయారని రాష్ట్రపతికి పంపిన నివేదికలో ఎన్నికల సంఘం పేర్కొంది. రాష్ట్రపతి తీసుకున్న ఈ నిర్ణయంతో ఈ 20 అసెంబ్లీ స్థానాలకు మళ్లీ ఎన్నికలు నిర్వహించాల్సి వుంటుంది. అనర్హత వేటుకు గురైనవారిలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మంత్రివర్గంలో ఉన్న కైలాస్ గేహలాట్, ఎమ్మెల్యేలు అల్కాలాంబా తదితరులున్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ 20 మంది ఎమ్మెల్యేలను పార్లమెంట్ కార్యదర్శులుగా నియామిస్తూ తీసుకున్న నిర్ణయం లాభదాయక పదవి కిందకు వస్తుందని ప్రశాంత్ పటేల్ అనే న్యాయవాది 2015లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి ఫిర్యాదు చేశారు. ఆ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి తగు సిఫార్సులు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ప్రణబ్ ఆదేశించారు. లాభదాయక పదవుల్లో ఉంటూ నిబంధనలను ఉల్లఘించినందున వీరిని అనర్హులుగా ప్రకటించాలని కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రపతికి సిఫార్సు చేసింది. ఆప్ ఎమ్మెల్యేగా ఉన్న జర్నైల్ సింగ్ గత సంవత్సరం తన పదవికి రాజీనామా చేసి పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. దీంతో ఆయనను విచారణ పరిధి నుంచి మినహాయించారు. ఢిల్లీ శాసనసభలో అత్యధిక మెజారిటితో గెలిచిన అనంతరం ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ 21 మంది ఎమ్మెల్యేలను పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమించారు. వారికి మంత్రులతో సమానంగా కార్యాలయం, కారు తదితర సౌకర్యాలు కల్పించారు. 2015 జూన్‌లో ఢిల్లీ శాసనసభ్యుల అనర్హత తొలిగింపు చట్టాన్ని కేజ్రీవాల్ సర్కారు సవరించి పార్లమెంట్ కార్యదర్శుల పదవులను ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ పరిధి నుంచి తప్పించారు. ఢిల్లీ ప్రభుత్వం చేసిన ఈ సవరణ బిల్లును రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ తిరస్కరించిన విషయం తెలిసిందే. ఆప్ ఎమ్మెల్యేలను అనర్హులుగా రాష్ట్రపతి ప్రకటించినంత మాత్రాన ఢిల్లీలోని అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వానికి ఎటువంటి ముప్పు లేదు. ప్రస్తుతం 70 శాసనసభ స్థానాలున్న ఢిల్లీ అసెంబ్లీలో ప్రస్తుతం 67 మంది ఎమ్మెల్యేలుండగా 20 మందిపై అనర్హత వేటు పడినా, ఆప్ బలం 45 ఎమ్మెల్యేలకు పడిపోయినా ప్రభుత్వానికి ఎటువంటి ఇబ్బందీ ఉండదు. ఎన్నికల సంఘం రాష్ట్రపతికి చేసిన సిఫార్సులను వ్యతిరేకిస్తూ ఆప్ ఎమ్మెల్యేలు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా, దీనిపై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. శనివారం ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో సమావేశం అయిన అ పార్టీ ఎమ్మెల్యేలు ఈ వ్యవహారంపై తమ వాదనను రాష్ట్రపతి రామ్‌నాథ్‌కు వినిపించాలని నిర్ణయించుకున్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో లాభదాయక పదవుల వివాదాలున్నాయని, కేవలం ఢిల్లీలోని ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకున్నారని ఆప్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఎన్నికల సంఘం వెనక బీజేపీ ఉండి నాటకాలు అడిస్తోందని వారు మండిపడ్డారు. సరైన నియమ నిబంధనలను అనుసరించకుండా ఎన్నికల సంఘం తమపై ఈ నిర్ణయం తీసుకుందని దుయ్యబట్టారు. ఈ వివాదంలో ఆప్ ఎమ్మెల్యేలు తమ వివరణ ఇవ్వకుండానే రామ్‌నాథ్ కోవింద్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

స్వార్థంతోనే హోదా తాకట్టు

తరువాత ప్రత్యేక హోదా కావాల్సి వుండగా ముఖ్యమంత్రి తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రత్యేక హోదాను కేంద్రం వద్ద బాబు తాకట్టు పెట్టారని జగన్ ఆరోపించారు. కేంద్రం ప్రత్యేక ప్యాకేజీని అమలు చేయకుంటే సుప్రీంకోర్టుకు వెళతామని ముఖ్యమంత్రి చెప్పడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వంలో టీడీపీకి చెందిన ఎంపీలు మంత్రి పదవుల్లో ఉన్నారని అటువంటప్పుడు ఎవరిపై కోర్టుకు వెళతారని ఆయన ప్రశ్నించారు. ప్రజలను మోసం చేయడానికే తప్ప రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రయత్నించడం లేదని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన సందర్భంగా ఆడియో, వీడియో ద్వారా సిఎం దొరికిపోయారని అందువల్లే కేంద్రానికి ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టారని తీవ్ర ఆరోపణలు చేశారు. గోదావరి పుష్కరాల సందర్భంగా 29 మంది దుర్మరణం చెందితే విచారణ కూడా జరపలేదని, సినిమా షూటింగ్‌ల కోసం ప్రజలను బలి చేశారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులాల వారిని మోసం చేసిందని ఎవరికీ న్యాయం చేయలేదని ఆయన విమర్శించారు. సహకార రంగాన్ని పూర్తిగా ధ్వంసం చేశారని సొంత డెయిరీ హెరిటేజ్ కోసం చిత్తూరు డెయిరీని మూసివేయించారని ఆరోపించారు. తన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కేంద్రంతో పోరాడి తీసుకువచ్చిన మన్నవరం ప్రాజెక్టును రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. రూ. 6వేల కోట్లు పెట్టుబడితో 6వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పించే ప్రాజెక్టు గురించి పట్టించుకోవడం లేదన్నారు. దీనివల్ల పరోక్షంగా మరో 5 వేల మందికి ఉపాధి లభిస్తుందని స్థానికంగా ఉన్న నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి వీలవుతుందన్నారు. సోమశిల-స్వర్ణముఖి కాలువను రాజశేఖర్ రెడ్డి హయాంలో 70 శాతం పూర్తిచేశారని మిగిలిన 30 శాతం పనులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అలాగే హంద్రీ-నీవా, సుజల-స్రవంతి పథకం పనులు కేవలం 20 శాతం మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పూర్తిచేస్తే పడమటి మండలాలకు తాగు, సాగునీరు వస్తుందన్నారు. అయితే కేవలం అబద్ధాలతో ప్రచారం చేసుకుంటున్నారే తప్ప ప్రజలకు పనికి వచ్చే పనులను మాత్రం చేయడం లేదన్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో కొత్త పథకాలను తెరమీదకు తెస్తున్నారని ఆరోపించారు. ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం గురించి పూర్తి నిజాలు తెలుసుకోవాలని రానున్న ఎన్నికల్లో తనను ఆశీర్వదిస్తే నవరత్న పథకాలను అమలు చేస్తానని జగన్ హామీ ఇచ్చారు.

బొక్కసానికి గండి!

దళారుల ప్రమేయం వద్దేవద్దంటున్నారు. అయితే అన్ని ప్రభుత్వ శాఖల్లో ఇందుకు విరుద్ధంగా జరుగుతోంది. ప్రధానంగా సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లు, దాదాపు అన్ని ప్రభుత్వ శాఖల్లో కనీసం 30వేల రూపాయల స్టేషనరీ, ఇతర ఫర్నిచర్ కొనుగోలుకు సంబంధించి డ్రాయింగ్ అధికారులు చట్ట విరుద్ధంగా 'పెయిడ్ మీ' పేరిట ట్రెజరీలకు బిల్లులు అందచేసి, సంబంధించి నగదు మొత్తాలను నేరుగా తమ బ్యాంక్ ఖాతాలకు జమ చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం ఏ ఒక్క ఉద్యోగి, అధికారి కూడా తన జేబుల నుంచి నయా పైసా కూడా చెల్లించకూడదు. అలా చెల్లిస్తే అది నేరం కూడా అని సీనియర్ అధికారులు చెబుతున్నారు. గతంలో డ్రాయింగ్ అధికారులు సమీప ట్రెజరీ కార్యాలయాల్లో నగదు తీసుకుని తమ పరిధిలోని ఉద్యోగులు, సిబ్బందికి పంపిణీ చేసేవారు. కొందరు కొంతకాలం ఆ నగదును వడ్డీలకు తిప్పుకోటం, లేదా తమ తమ స్వప్రయోజనాల కోసం వినియోగించుకోవటం జరిగేది. అయితే ఉద్యోగులు, సిబ్బంది నుంచి పాత తేదీలతోనే రశీదులు తీసుకునేవారు. ప్రస్తుతం ఈ పద్ధతి అమలులో లేదు. ఏకంగా ట్రెజరీల నుంచే ప్రభుత్వ, లేదా ప్రైవేటుగా సేవలందించిన సంస్థలు, వ్యక్తుల పేరిట నేరుగా సంబంధిత సొమ్ము జమకావాల్సి ఉంది. అయినప్పటికీ నేటికీ ఆయా శాఖల డ్రాయింగ్ అధికారుల ఖాతాల్లోకి నిధులు ఎందుకు జమ అవుతున్నాయో అంతుబట్టని స్థితి నెలకొని వుంది.

కొండగట్టు.. రాజకీయ మెట్టు

ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పవన్ దంపతులు, వీరి కుమారుడు మార్క్, రాయబారి ఆడమ్‌లకు చర్చి ఫాదర్ బాలశౌరి దీవెనలు అందజేశారు. దాదాపు గంటన్నరసేపు వీరంతా చర్చిలోనే గడిపారు. తొలుత జనసేన పార్టీ కార్యాలయానికి వచ్చిన రాయబారి ఆడమ్, ఆయనతో పాటు వచ్చిన విద్యార్థి బృందం పవన్ కళ్యాణ్‌ను కలిశారు. ఆడమ్, పవన్ తమ జాతీయ పతాకాలను ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకున్నారు. పవన్ కళ్యాణ్, ఆడమ్ లు పోలండ్ విద్యార్థులు, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. భారత దేశం సంస్కృతి, విద్యావిధానాన్ని అధ్యయనం చేసేందుకు వచ్చిన విదేశీ విద్యార్థి బృందాన్ని పవన్ అభినందించారు. తన భార్య అన్నా రష్యా దేశస్తురాలన్న సంగతిని పవన్ గుర్తు చేశారు. ఆడమ్ కోరిక మేరకు పోలెండ్‌లో తెలుగు చిత్రాల చిత్రీకరణ చేసేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. పోలెండ్‌లో ఎన్నో అందమైన ప్రదేశాలు ఉన్నాయని, అవి భారతీయ సినిమా షూటింగ్‌లకు అనుకూలంగా ఉంటాయని ఆడమ్ ఈ సందర్భంగా చెప్పారు. పవన్ కళ్యాణ్ దంపతులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ రావడం తనకెంతో ఆనందం కలిగించిందని పేర్కొన్నారు.

పనిచేస్తే మనకే పట్టం

న్యాయమైన కోర్కెలు అమలు జరగాల్సి ఉందని ప్రధాని మోదీకి వివరించానన్నారు. గడిచిన మూడున్నరేళ్లలో ప్రభుత్వపరంగా పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం విజయవంతం అయిందన్నారు. రాష్ట్రంలోని కోటీ 38లక్షల 67వేల 769 ఇళ్లకు గాను కోటీ 35లక్షల 37వేల 125 అంటే 95.45 శాతం ఇళ్లవాసులను కలవటం శుభపరిణామమన్నారు. జవాబుదారీతనంతో బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ప్రజలతో మమేకం కావాలని ఉద్బోధించారు. తన హయాంలో ఇప్పటివరకు 23 జన్మభూమి కార్యక్రమాలు నిర్వహించగా సమైక్యాంధ్రాలో 18, నవ్యాంధ్రాలో ఐదుసార్లు జన్మభూమి సభలు జరుపుకున్నామని చెప్పారు. ఒకప్పుడు అధికారులను మందలిస్తే ప్రజలు చప్పట్లు కొట్టారుగాని ఓట్లు వేయలేదని, ఆ పరిస్థితి నుంచి ఇప్పుడు మార్పుచెంది ప్రణాళికాబద్ధంగా ప్రజలను మెప్పించే స్థితికి చేరుకున్నామన్నారు. అత్యంత ప్రధానమైన పోలవరం విషయానికొస్తే 2019 నాటికి పూర్తిచేయాలనేది తన దృఢ సంకల్పంగా చెప్పారు. దీన్ని అడ్డుకునేందుకు అన్నివిధాలా ప్రయత్నాలు చేస్తున్నవారి కుట్రలు ఏమాత్రం పనిచేయవని, నదుల అనుసంధానం ద్వారా నీటి ఎద్దడి లేకుండా ఉండాలనేదే తన ప్రగాఢ విశ్వాసమని ఉద్ఘాటించారు. రానున్న మూడేళ్లలో 22వేల కోట్లతో ప్రతి ఇంటికీ నాణ్యమైన తాగునీరు ఇవ్వడమే లక్ష్యమన్నారు. ఇప్పటికే విద్యుత్ భద్రత కలిగించామని, ఇక చార్జీలు పెంచేదీ లేదని వందశాతం హామీ ఇస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో దళితులను పార్టీ వైపు తిప్పుకునేందుకు ఎమ్మెల్యేలు కృషి చేయాలని, కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రతిపక్ష పార్టీ ప్రయత్నాలను సాగనివ్వరాదని సూచించారు. అగ్రకులాల్లోని పేదలను కూడా ఆదుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలనే ఆలోచన ఉందన్నారు. ఇదిలావుండగా కోడి పందేలు, జూదంపై అసహనం వ్యక్తం చేసిన చంద్రబాబు రాష్ట్రానికి వ్యసనాలు పట్టరాదని, సంస్కృతి, సంప్రదాయాల ముసుగులో జూదాలను ప్రోత్సహించరాదని తేల్చిచెప్పారు. హైదరాబాద్ వంటి నగరాలకు డబ్బు వచ్చాక పబ్బులు వచ్చాయని, ఆపై డ్రగ్స్ సంస్కృతి ప్రవేశించిందని, అది ఏమాత్రం మంచిది కాదని ఉదహరించారు. రాష్ట్రంలో మహిళలపై పెరుగుతున్న నేరాలను నియంత్రించాలని, టెక్నాలజీ, సీసీ కెమెరాలు సత్ఫలితాలిస్తున్నాయని, ఈ దిశగా పోలీసు శాఖను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు ఉదహరించారు. వచ్చే ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌లో ఇప్పుడున్న 63శాతం నుంచి మరో 5శాతం ప్రజల్లో సానుకూలత పెంచేందుకు, రాజకీయ లబ్ధి చేకూరేందుకు కృషి చేయాలని గడువు విధిస్తూ ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ శ్రేణులకు అధినేత దిశానిర్దేశం చేశారు. అనంతరం జిల్లాల వారీగా ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో సాయంత్రం వరకు పార్టీ స్థితిగతులపై చంద్రబాబు సమీక్ష నిర్వహించారు.

స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలి

◆ బెదిరింపులు కాదు.. చర్చలు జరపాలి
◆ 23న రాష్ట్రవ్యాప్త సమ్మె
◆ ఏఐటీయూసీ నేత చలసాని వెల్లడి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 21: దేశవ్యాప్తంగా అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, ఆశా, తదితర పథకాల అమలులో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, ఇందుకు నిరసనగా ఈ నెల 23న రాష్ట్రవ్యాప్త స్కీం వర్కర్ల సమ్మె చేపట్టామని ఏఐటీయుసీ రాష్ట్ర అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు తెలిపారు. ఏఐటీయుసీ రాష్ట్ర కార్యాలయం జోశ్యభట్ల సత్యనారాయణ భవన్‌లో అన్ని ట్రేడ్ యూనియన్ల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా జనవరి 17న లక్షలాది మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారని, సంక్రాంతి సెలవుల కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో 23న సమ్మె జరపాలని ట్రేడ్ యూనియన్ల సమన్వయ కమిటీ నిర్ణయించిందని, ఈమేరకు సమ్మెను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫార్సులను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించడం లేదని, దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్మికులను తొలగించిన ప్రైవేట్ ఏజెన్సీలకు స్కీంలను అప్పగిస్తున్నారని ఆయన విమర్శించారు. తెలంగాణలో టీడీపీ పార్టీ స్కీం కార్మికుల సమ్మెను బలపర్చి పాల్గొన్నారని, ఏపీలో సమ్మె విచ్ఛిన్నానికి ప్రయత్నిస్తూ సమ్మెలో పాల్గొనవద్దని, పాల్గొన్న కార్మికులను తొలగిస్తామని స్పెషల్ కమిషనర్ ఆదేశాలివ్వడం ముఖ్యమంత్రి ద్వంద్వ నీతికి నిదర్శనమని ఆయన విమర్శించారు. 23న సమ్మె ద్వారా ప్రభుత్వానికి కనువిప్పు కలిగే పద్ధతిలో కార్మికులు పాల్గొనాలని చలసాని కోరారు. సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి అజయ్‌కుమార్ మాట్లాడుతూ కార్మికుల సమ్మెను అణచివేసే ప్రయత్నాలను సహించేది లేదని, కార్మిక సంఘాల ఐక్య పోరాటం ద్వారా దాన్ని ఎదుర్కొంటామన్నారు. అంగన్‌వాడీ, స్కీం వర్కర్ల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు జి బేబిరాణి, కె స్వరూపరాణి, కె శైలజ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు పెట్టినా 23న సమ్మె జరుగుతుందని స్పష్టం చేశారు.

కర్నూలులో దొంగల హల్‌చల్

కర్నూలు, జనవని 21 : కర్నూలు నగరంలో ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో దొంగలు హల్‌చల్ చేశారు. నగరంలోని న్యూకృష్ణానగర్, ఆదిత్యనగర్, విఠల్‌నగర్‌లలో మూడు ఇళ్లలో చోరీకి పాల్పడడంతో పాటు ఇంటికి నిప్పు పెట్టారు. ఆదిత్యనగర్‌లో నివాసం ఉంటున్న సలీం ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దొంగలు ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. అలాగే విఠల్‌నగర్‌కు చెందిన మక్బూల్ అహ్మద్ ఇంట్లో చోరీకి పాల్పడడంతో పాటు నిప్పు పెట్టడంతో ఇంట్లోని వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో కర్నూలు 4వ పట్టణ పోలీసులు చోరీ జరిగిన ఇళ్లకు వెళ్లి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. బనియన్, చెడ్డీ వేసుకున్న ఇద్దరు యువకులు ఈ చర్యలకు పాల్పడినట్లు స్థానికులు పోలీసులకు తెలిపారు.

క్రీడ

ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్ శ్లామ్ టెన్నిస్

క్వార్టర్స్‌కు నాదల్


రాఫెల్ నాదల్

మెల్బోర్న్, జనవరి 21: ఎండ వేడికి ఏమాత్రం తట్టుకోలేక ఇబ్బంది పడే ప్రపంచ నంబర్ వన్ ఆటగాడు రాఫెల్ నాదల్ ఇక్కడ జరుగుతున్న ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్ శ్లామ్ టెన్నిస్ పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్ ఫైనల్స్ చేరాడు. కడ వరకూ పోరాడి, చెమటలు చిందించిన అతను నాలుగో రౌండ్‌లో జరిగిన మారథాన్ మ్యాచ్‌లో డిగో స్వార్ట్‌మన్‌ను 6-3, 6-7, 6-3, 6-3 తేడాతో ఓడించాడు. మొదటి రెండు సెట్లలో కొంత ఇబ్బంది పడిన నాదల్ ఆతర్వాత రెండు సెట్లలో తనదైన దూకుడును ప్రదర్శించి, టైటిల్ సాధించే సత్తా తనకు ఉందని నిరూపించాడు. ఇదే మాదిరి చివరి వరకూ ఉత్కంఠ రేపిన మరో మ్యాచ్‌లో నిక్ కిర్గియోస్‌పై మూడో ర్యాంక్ ఆటగాడు గ్రిగర్ దిమిత్రోవ్ 7-6, 7-6, 4-6, 7-6 తేడాతో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్ చేరాడు. ఆరోసీడ్ మారిన్ సిలిక్ కూడా నాలుగో రౌండ్‌ను అధిగమించడానికి చివరి వరకూ పదోరాడాల్సి వచ్చింది. అతను పదో ర్యాంకర్ పాబ్లో కరెనో బస్టాను 6-7, 6-3, 7-6, 7-6 తేడాతో ఓడించాడు.

పేస్, రాజా జోడీ ఓటమి

మెల్బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్ టెన్నిస్ టోర్నీ ప్రీ క్వార్టర్స్ ఫైనల్‌లో భారత్‌కు చెందిన లియాండర్ పేస్, పూరవ్ రాజా జోడీ ఓటమిపాలైంది. కొలంబోకు అన్‌సీడెడ్ జంట జువాన్ సెబాస్టియన్ కబాల్, రోబర్ట్ ఫరా చేతిలో వీరిద్దరూ 1-6, 2-6 తేడాతో ఓటమి చెందారు. గంటా తొమ్మిది నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో పేస్ జోడీ ఐదు పాయింట్లతో ఒక్కదానిని కూడా సద్వినియోగం చేసుకోలేకపోయారు. రెండు సెట్లలోనూ ప్రత్యర్థి జంటదే పైచేయిగా నిలవడంతో భారత్ జోడీ పరాజయం పాలైంది. మొత్తం మీద భారత ఆటగాళ్లు ఏ దశలోనూ గట్టిపోటీని ఇవ్వలేకపోయారు.

వొజ్నియాకి ముందంజ


కరోలిన్ వొజ్నియాకి

మెల్బోర్న్, జనవరి 21: ఆస్ట్రేలియా ఓపెన్ మహిళల సింగిల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంక్ క్రీడాకారిణి కరోలిన్ వొజ్నియాకి ముందంజ వేసింది. నాలుగో రౌండ్‌లో ఆమె 19వ సీడ్ మగ్దలీన రిబరికొవాపై 6-3, 6-0 ఆధిక్యంతో విజయభేరి మోగించింది. మొదటి సెట్‌లో కొంత వరకూ ప్రతిఘటించిన రిబరికొవా రెండో సెట్లో పూర్తిగా విఫలమైంది. వొజ్నియాకి ఎలాంటి ఇబ్బంది లేకుండా క్వార్టర్ ఫైనల్స్ చేరింది. అన్‌సీడెడ్ క్రీడాకారిణి కారియా సౌరెజ్ నవరో 4-6, 6-4, 8-6 ఆధిక్యంతో 32వ సీడ్ అనెట్ కొంటావెల్ట్‌ను ఓడించింది. కాగా, క్వాలిఫయర్ డెనిసా ఎలెర్టొవాపై 6-3, 6-3 తేడాతో గెలిచిన నాలుగో సీడ్ ఎలినా స్విటోలినా క్వార్టర్స్‌లోకి అడుగుపెట్టింది. మరో మ్యాచ్‌లో ఎలిసా మార్టెన్స్ 7-6, 7-5 స్కోరుతో పెట్రా మార్టిక్‌పై విజయాన్ని నమోదు చేసింది.

కోహ్లీ మొండివైఖరితో


టీమిండియాకు ముప్పు!


విరాట్ కోహ్లీ

జొహాన్నెస్‌బర్గ్, జనవరి 21: భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ మొండి వైఖరి గురించి ఎంత తక్కువగా చెప్తే అంత మంచిది. అలాంటి ప్రవర్తన క్రికెట్‌కు ఉపయోగపడుతుందేమోగానీ, జట్టును మాత్రం ఇబ్బందుల పాలుచేస్తుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జట్టులోని ప్రతి ఆటగాడూ తాను కోట్లాది మంది భారత ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు, అంచనాలకు తగినట్టు ఆడేందుకు కృషి చేయాలి. సర్వశక్తులు ఒడ్డాలి. ఇక కెప్టెన్‌కు ఉండే బాధ్యతల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వ్యక్తిగత రికార్డులకు, ప్రయోజనాలకు, మైలురాళ్లకు ప్రధాన్యం ఇవ్వకుండా, జట్టుకు ఏది ఉపయోగకరమో అలాంటి నిర్ణయాలే తీసుకోవాలి. వ్యక్తిగత అభిప్రాయాలకు, ఇష్టాయిష్టాలకు ఏమాత్రం ఆస్కారం ఉండకూడదు. కానీ, కోహ్లీ తీరు ఇందుకు భిన్నంగా ఉంటుంది. తన సొంత అజెండాను అతను అమలు చేస్తున్నాడు. జట్టు ప్రయోజనాలు గాలికి కొట్టుకుపోయినా సరే తన పంతమే నెగ్గాలన్న అతని వైఖరి కారణంగానే కోచ్ పదవి నుంచి అనీల్ కుంబ్లే ఉద్వాసనకు గురయ్యాడు. బ్యాటింగ్‌లో రాణించడం, రికార్డుల మీద రికార్డులు సృష్టించడం, నలువైపుల నుంచి ప్రశంసల జల్లు కురవడం వంటి అంశాలు కోహ్లీలో మొండి తనాన్ని, తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లనే తత్వాన్ని మరింతగా పెంచాయి. దీని ప్రభావం జట్టు కూర్పుపై ప్రత్యక్షంగా, మ్యాచ్ ఫలితంపై పరోక్షంగా కనిపిస్తున్నది. 2014లో భారత జట్టు ఆస్ట్రేలియాలో పర్యటించినప్పుడు, టెస్టు సిరీస్ పూర్తికాక ముందే మహేంద్ర సింగ్ ధోనీ టెస్టు క్రికెట్ నుంచి అర్ధాంతరంగా వైదొలిగాడు. దీనితో ఆ బాధ్యతలు స్వీకరించిన కోహ్లీ అక్కడ చివరి టెస్టులో జట్టుకు నాయకత్వం వహించాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ, సుమారు మూడేళ్ల కాలంలో అతను 34 వేర్వేరు ప్లేయింగ్ ఎలెవెన్ కాంబినేషన్స్‌తో బరిలోకి దిగాడు. ఎంత సీనియర్ ఆటగాడైనాసరే, తుది జట్టులో చోటు ఉంటుందా? ఊడుతుందా? అని తీవ్రమైన ఒత్తిడికి లోనయ్యే పరిస్థితిని కల్పించాడు. జట్టులో నిలకడ లేకపోవడానికి అతను తరచు ఆటగాళ్లను మార్చడమే ప్రధాన కారణమన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అయితే, జట్టు విజయాలను సాధిస్తున్న నేపథ్యంలో, జట్టులో తరచు చేస్తున్న మార్పులపై ప్రశ్నించలేదు. దక్షిణాఫ్రికాలో వరుసగా రెండు టెస్టుల్లోనూ పరాజయాలను ఎదుర్కొని, మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 0-2 తేడాతో చేజార్చుకున్న తర్వాత అతనికి తొలిసారి సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. వివిధ కాంబినేషన్స్‌తో ఎందుకు ఆడతారని ఒక విలేఖరి నిలదీసినప్పుడు కోహ్లీ నేరుగా సమాధానం చెప్పలేక పోయాడు. సరైన జవాబు లేకపోవడంతో, కోపంతో ఊగిపోయాడు. ఆ విలేఖరిని ఎదురు ప్రశ్నలు వేసి, పొంతనలేని సమాధానాలు చెప్పి, తప్పించుకునే ప్రయత్నం చేశాడు. విలేఖరుల సమావేశం నుంచి అతను పెద్దగా సమస్యలు ఎదుర్కోకుండా బయటపడినప్పటికీ, జట్టులో చేస్తున్న మార్పులు, అతని మొండి వైఖరి ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఓపెనింగ్ కాంబినేషన్ స్థిరపడకపోవడానికి కోహ్లీ తీసుకున్న నిర్ణయాలే ప్రధాన కారణం. మురళీ విజయ్, లోకేష్ రాహుల్, శిఖర్ ధావన్‌లలో ఎవరినీ అతను ఎక్కువ కాలం ఓపెనర్‌గా కొనసాగించలేదు. మ్యూజికల్ చైర్స్ మాదిరి పదేపదే మారుస్తూ, వారి ఆత్మ విశ్వాసాన్ని దారుణంగా దెబ్బతీశాడన్న విమర్శలున్నాయి. కోహ్లీ కెప్టెన్సీలో మురళీ విజయ్ 25, లోకేష్ రాహుల్ 20, శిఖర్ ధావన్ 17 టెస్టులు ఆడారు. ఓపెనింగ్ కూర్పుపై అతను ఏకంగా ఏడుగురితో ప్రయోగాలు చేశాడు. మురళీ విజయ్, చటేశ్వర్ పుజారా, లోకేష్ రాహుల్, శిఖర్ ధావన్, పార్థీవ్ పటేల్, గౌతం గంభీర్, అభినవ్ ముకుంద్ కనీసం ఒక టెస్టులో ఓపెనర్‌గా మైదానంలోకి వచ్చారు. కోహ్లీ కెప్టెన్‌గా ఉన్న ఈ మూడేళ్ల కాలంలో ఆరుగురు ఆటగాళ్లు, కర్న్ శర్మ, నమన్ ఓఝా, జయంత్ యాదవ్, కరుణ్ నాయర్, హార్దిక్ పాండ్య, జస్‌ప్రీత్ బుమ్రా టెస్టు క్రికెట్‌లోకి అడుగుపెట్టారు. వీరిలో పాండ్య, బుమ్రా తప్ప మిగతా వారి కెరీర్ ఎటు వెళుతున్నదో కూడా ఎవరికీ అర్థం కావడం లేదు. వనే్డ ఇంటర్నేషనల్స్‌కు పనికిరాడంటూ సీనియర్ స్పిన్నర్ అశ్విన్‌పై ముద్ర వేయడానికి కోహ్లీ ప్రయత్నిస్తున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకే, అతనిని టెస్టుల్లో మాత్రమే ఆడిస్తున్నారన్నది విమర్శకుల వాదన. గణాంకాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. అశ్విన్ కెరీర్‌లో ఇప్పటి వరకూ 57 టెస్టులు ఆడాడు. వాటిలో 33 కోహ్లీ నాయకత్వంలో ఆడినవే. మూడేళ్ల కాలంలో కోహ్లీ 34 టెస్టులకు కెప్టెన్‌గా వ్యవహరిస్తే, వాటిలో 33 టెస్టుల్లో అశ్విన్ ఉన్నాడు. ఒక్క టెస్టులో అశ్విన్ స్థానంలోనే అతను కర్న్ శర్మను తీసుకున్నాడు.

ఇక అజింక్య రహానే పట్ల కోహ్లీ నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాడన్న విమర్శల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సింది లేదు. సెలక్టర్లు రహానేను టెస్టు జట్టుకు ఎంపిక చేయడమేగాక, వైస్ కెప్టెన్సీ బాధ్యతలను కూడా అప్పచెప్పారు. కానీ, కేప్ టౌన్‌లో జరిగిన మొదటి టెస్టులో రహానే లేకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ వ్యవహారంపై ఎంతో మంది కోహ్లీని విమర్శించారు. మొదటి టెస్టులో జట్టు ఓటమిపాలైన తర్వాత, రెండో టెస్టులో రహానేను ప్లేయింగ్ ఎలెవెన్‌లోకి తీసుకుంటారని అంతా అనుకున్నారు. కానీ, విమర్శలను పట్టించుకుంటే, అభిమానుల డిమాండ్‌కు తలవంచినట్టు అవుతుందని అనుకున్నాడో ఏమోగానీ రెండో టెస్టులోనూ రహానేను తీసుకోలేదు. ఆ టెస్టుతోపాటు, సిరీస్‌ను కూడా భారత్ కోల్పోయింది. అంతకు ముందు, రహానేను టెస్టు క్రికెట్‌కే పరిమితం చేస్తూ, అతను వనే్డలకు పనికిరాడన్న అభిప్రాయాన్ని కల్పించిన కోహ్లీ ఇప్పుడు టెస్టుల నుంచి కూడా అతనిని దూరంగా ఉంచడం వివాదాస్పదమవుతున్నది. కోహ్లీ కెప్టెన్సీలో 30 టెస్టులు (37 ఇన్నింగ్స్) ఆడిన రహానే 1,312 పరుగులు చేశాడు. ఇలావుంటే, ఫాస్ట్ బౌలర్ భువనేశ్వర్ కుమార్‌కు కూడా అన్యాయమే జరుగుతున్నది. కోహ్లీ తన నాయకత్వంలో జరిగిన 34 టెస్టుల్లో కేవలం ఎనిమిది మ్యాచ్‌ల్లో మాత్రమే భువీకి చాన్స్ ఇచ్చాడు. 2016లో వెస్టిండీస్ పర్యటనకు వెళ్లినప్పుడు తప్ప భువీ వరుసగా రెండు టెస్టుల్లో ఆడిన సందర్భాలు లేవంటే, కోహ్లీ అతనిని ఎంతగా నిర్లక్ష్యం చేస్తున్నాడో ఊహించుకోవచ్చు. చటేశ్వర్ పుజారా, వృద్ధిమాన్ సాహా చెరి 29 టెస్టులు కోహ్లీ నాయకత్వంలో ఆడారు. సాధారణంగా మూడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగే పుజారా 54.67 సగటుతో 2,187 పరుగులు చేశాడు. ఏడో నంబర్ బ్యాట్స్‌మన్‌గా గుర్తింపు పొందిన సాహా 23 ఇన్నింగ్స్ ఆడాడు. రోహిత్ శర్మకు 17 టెస్టుల్లో అవకాశం లభించింది. ఓపెనింగ్ కాంబినేషన్‌తోపాటు, మిగతా స్థానాల్లోనూ బ్యాట్స్‌మెన్‌ను కుదుటపడనీయకుండా కోహ్లీ పదే పదే మార్పులు చేయడం విమర్శలకు తావిస్తున్నది. అతని కెప్టెన్సీలో, కేవలం ఆరో స్థానంలోనే తొమ్మిది మంది బ్యాటింగ్‌కు దిగారు. ఒక ఆటగాడిని కొంత కాలం అదే స్థానంలో ఆడనివ్వకుండా కోహ్లీ ఇబ్బంది పెడతాడని వచ్చిన విమర్శలకు ఈ గణాంకాలు బలాన్నిస్తున్నాయి. ఇప్పటికైనా అతను మొండి తనాన్ని వీడి, తాను భారత జాతీయ జట్టుకు నాయకత్వం వహిస్తున్నాననే వాస్తవాన్ని గుర్తించి ప్రవర్తించడం మంచిది.

రహానేకు చోటు!


అజింక్య రహానే

జొహాన్నెస్‌బర్గ్: మొదటి రెండు టెస్టుల్లోనూ ప్లేయింగ్ ఎలెవెన్‌లో చోటు దక్కించుకోలేకపోయిన బ్యాట్స్‌మన్ అజింక్య రహానే బుధవారం నుంచి ప్రారంభమయ్యే చివరి, మూడో టెస్టులో ఆడే అవకాశాలున్నాయి. జట్టుకు వైస్ కెప్టెన్‌గా రహానేను సెలక్టర్లు ఎంపిక చేసినప్పటికీ, కెప్టెన్ విరాట్ కోహ్లీ, కోచ్ రవి శాస్త్రి అతని పట్ల మొగ్గు చూపలేదు. రహానే వనే్డలకు మాత్రమే పనికొస్తాడని, టెస్టు మ్యాచ్‌ల్లో అలాంటి ఆటగాడిని ఎవరూ కోరుకోరని ఒక ఇంటర్వ్యూలో కోహ్లీ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. కేప్ టౌన్‌లో జరిగిన మొదటి టెస్టులో టీమిండియా పరాజయాన్ని ఎదుర్కొన్న మరుక్షణం నుంచే కోహ్లీ తీరుపై సర్వత్రా నిరసన వ్యక్తమైంది. వైస్ కెప్టెన్‌కు తుది జట్టులో ఎందుకు చోటు కల్పించలేదంటూ రహానే అభిమానులు సోషల్ మీడియాలో ప్రశ్నల వర్షం కురిపించారు. విశ్లేషకులు, క్రీడా పండితులు సైతం రహానేను తీసుకోవాలని సూచించారు. కానీ, మొండితనానికి మారుపేరైన కోహ్లీ సెంచూరియన్‌లో జరిగిన రెండో టెస్టులో కూడా రహానేను ఆడించలేదు. ఆ మ్యాచ్‌లోనూ ఓడిన టీమిండియా, మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 0-2 తేడాతో కోల్పోయింది. ఈ ఫలితం వెలువడిన తర్వాత మరోసారి కోహ్లీ తీరును క్రికెట్ అభిమానులు ఎండగట్టారు. కోహ్లీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నాడని విమర్శించారు. అన్ని వైపుల నుంచి రహానేకు మద్దతు పెరగడంతో, గత్యంతరం లేని పరిస్థితుల్లో అతనిని మూడో టెస్టులో ఆడించాలని టీమిండియా మేనేజ్‌మెంట్ నిర్ణయించినట్టు సమాచారం. అయితే, అధికారికంగా తుది జట్టును ఇంకా ప్రకటించలేదు.

బట్లర్ అజేయ శతకం


జొస్ బట్లర్

మూడో మ్యాచ్‌లోనూ ఇంగ్లాండ్ గెలుపు
వనే్డ సిరీస్‌ను కోల్పోయిన ఆస్ట్రేలియా

సిడ్నీ, జనవరి 21: ఆస్ట్రేలియాపై ఇంగ్లాండ్ ప్రతీకారం తీర్చుకుంది. ఆదివారం ఇక్కడ జరిగిన మూడో వనే్డను 16 పరుగుల తేడాతో గెల్చుకొని, ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0 తేడాతో సొంతం చేసుకుంది. దీనితో మగతా రెండు వనే్డలకు ప్రాధాన్యం లేకుండాపోయింది. వికెట్‌కీపర్-బ్యాట్స్‌మన్ జొస్ బట్లర్ సెంచరీతో కదంతొక్కడంతో, ఆస్ట్రేలియా ముందు ఇంగ్లాండ్ 303 పరుగుల లక్ష్యాన్ని ఉంచగలిగింది. అనంతరం లక్ష్య సాధనలో విఫలమైన ఆస్ట్రేలియా 50 ఓవర్లలో ఆరు వికెట్లకు 286 పరుగులు చేయగలిగింది. దీనికి ముందు జరిగిన ఐదు మ్యాచ్‌ల ప్రతిష్ఠాత్మక యాషెస్ టెస్టు సిరీస్‌ను 4-0 తేడాతో సాధించిన ఆస్ట్రేలియా, అదే ఊపును ఐదు మ్యాచ్‌ల వనే్డ సిరీస్‌లోనూ కొనసాగిస్తుందని అభిమానులు ఆశించారు. అయితే, ఆస్ట్రేలియా దీనికి పూర్తి భిన్నంగా ఆడి, మొదటి రెండు వనే్డలను చేజార్చుకుంది. గెలిస్తే తప్ప, సిరీస్‌పై ఆశలను నిలబెట్టుకునే అవకాశం లేని పరిస్థితుల్లో మూడో వనే్డకు సిద్ధమైంది. అయితే, యాషెస్ సిరీస్‌ను కోల్పోయిన ఇంగ్లాండ్ కొనసాగించిన ఎదురుదాడికి నిలవలేక మరోసారి దాసోహమై, 16 పరుగుల తేడాతో పరాజయాన్ని చవిచూసింది. సిరీస్‌ను 0-3 తేడాతో ఇంగ్లాండ్‌కు అప్పగించింది.

తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్ 50 ఓవర్లలో ఆరు వికెట్లకు 302 పరుగులు సాధించింది. జొస్ బట్లర్ 83 బంతుల్లో, సరిగ్గా 100 పరుగులు చేసి నాటౌట్‌గా నిలవడం విశేషం. ఓపెనర్ జానీ బెయిర్‌స్టో 39, జో రూట్ 27, ఇయాన్ మోర్గాన్ 41, క్రిస్ వోక్స్ 53 (నాటౌట్) చొప్పున పరుగులు చేసి, ఇంగ్లాండ్‌కు గౌరవ ప్రదమైన స్కోరును అందించారు. జొష్ హాజెల్‌వుడ్ రెండు వికెట్లు పడగొట్టగా, పాట్ కమిన్స్, మార్కస్ స్టోయినిస్, ఆడం జంపా, మిచెల్ మార్ష్ తలా ఒక్కో వికెట్ కూల్చారు. కాగా, సిరీస్‌పైశలు నిలబెట్టుకోవడానికి 303 పరుగులను ఛేదించాల్సిన ఆస్ట్రేలియా సమర్థంగా లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది. పరుగుల వేటలో విఫలమై, 50 ఓవర్లలో ఆరు వికెట్లకు 286 పరుగులు చేయగలిగింది. ఇంగ్లాండ్ బౌలర్లలో మార్క్ ఉడ్, క్రిస్ వోక్స్, అదిల్ రషీద్ తలా రెండేసి వికెట్లు సాధించారు.

సంక్షిప్త స్కోర్లు

ఇంగ్లాండ్ ఇన్నింగ్స్: 50 ఓవర్లలో 6 వికెట్లకు 302 (జానీ బెయిర్‌స్టో 39, జో రూట్ 27, ఇయాన్ మోర్గాన్ 41, జొస్ బట్లర్ 100 నాటౌట్, క్రిస్ వోక్స్ 53 నాటౌట్, జొష్ హాజెల్‌వుడ్ 2/58).

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: 50 ఓవర్లలో 6 వికెట్లకు 286 (ఆరోన్ ఫించ్ 62, స్టీవెన్ స్మిత్ 45, మిచెల్ మార్ష్ 55, మార్కస్ స్టోయినిస్ 56, టిమ్ పైన్ 31 నాటౌట్, మార్క్ ఉడ్ 2/46, క్రిస్ వోక్స్ 2/57, అదిల్ రషీద్ 2/51).


కౌలాలంపూర్‌లో ఆదివారం ముగిసిన మలేసియా మాస్టర్స్ బాడ్మింటన్ టోర్నమెంట్ మహిళల సింగిల్స్ టైటిల్ సాధించిన రచనొక్ ఇంతనాన్ (థాయిలాండ్). ఫైనల్‌లో ఆమె ప్రపంచ నంబర్ వన్ తాయ్ జూ ఇంగ్ (తైవాన్)ను 21-16, 14-21, 24-22 తేడాతో ఓడించి సంచలనం సృష్టించింది. కాగా, పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో విక్టర్ అక్సెల్సెన్ 21-13, 21-23, 21-18 తేడాతో కాన్టే నిషిమొటోపై విజయం సాధించి టైటిల్ అందుకున్నాడు.

అంధుల క్రికెట్ జట్టుకు ప్రధాని అభినందనలు

న్యూఢిల్లీ, జనవరి 21: అంధుల ప్రపంచ కప్ పోటీ ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌ను మట్టి కరిపించి టైటిల్ సాధించి ట్రోఫీని అందుకున్న భారత జట్టును ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. శనివారం షార్జాలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పాకిస్తాన్‌ను ఓడించి చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఇంతటి ఘనవిజయాన్ని సాధించినందుకు భారత్ జట్టును ప్రధాని ట్విట్టర్ వేదికగా అభినందనలు తెలిపారు. కాగా,ప్రముఖ క్రికెటర్ సచిన్ తెండూల్కర్ కూడా జట్టును అభినందించాడు.

జింబాబ్వేపై లంక విజయం

ఢాకా, జనవరి 21: మూడు దేశాలు పదోటీపడుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌ని శ్రీలంక ఐదు వికెట్ల తేడాతో గెల్చుకుంది. టాస్ గెలిచి, బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే 198 పరుగులకే ఆలౌట్‌కాగా, ఆ లక్ష్యాన్ని శ్రీలంక 44.5 ఓవర్లలోనే, కేవలం ఐదు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ప్రత్యర్థికి భారీ లక్ష్యాన్ని నిర్దేశించాలన్న లక్ష్యంతో బ్యాటింగ్‌ను ఎంచుకున్న జింబాబ్వే కెప్టెన్ గ్రేమ్ క్రెమర్ అంచనాలు తారుమారయ్యాయి. లంక బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కోలేకపోయిన బ్యాట్స్‌మెన్ పెవిలియన్‌కు క్యూ కట్టడంతో జింబాబ్వేకు భారీ స్కోరు సాధ్యం కాలేదు. మిడిల్ ఆర్డర్‌లో వికెట్‌కీపర్-బ్యాట్స్‌మన్ బ్రెండన్ కేలర్ (80 బంతుల్లో 58 పరుగులు) అర్ధ శతకాన్ని సాధించి, జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. కెప్టెన్ క్రెమర్ 34, మాల్కం వాలర్ 24 చొప్పున పరుగులు చేశారు. మిగతా బ్యాట్స్‌మెన్ ఆ మాత్రం స్కోర్లు చేయలేకపోవడంతో, జింబాబ్వే ఇంకా ఆరు ఓవర్లు మిగిలి ఉండగానే, 198 పరుగులకు ఆలౌటైంది. లంక బౌలర్లలో తిసర పెరెరా 33 పరుగులకే నాలుగు వికెట్లు పడగొట్టాడు. నువాన్ ప్రదీప్ 25 పరుగులిచ్చి మూడు వికెట్లు సాధించాడు. లక్షన్ సండాకన్ 57 పరుగులకు రెండు వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. జింబాబ్వే నిర్దేశించిన అత్యంత సామాన్యమైన 199 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక 33 పరుగులు వద్ద ఓపెనర్ ఉపుల్ తరంగ (17) వికెట్‌ను కోల్పోయింది. అయితే, మరో ఓపెనర్ కుశాల్ పెరెరా క్రీజ్‌లో నిలదొక్కుకొని, లంక స్కోరును వంద పరుగుల మైలురాయిని దాటించాడు. అతను 49 పరుగుల వ్యక్తిగత స్కోరువద్ద సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్ ర్యాన్ ముర్రే క్యాచ్ పట్టగా, బ్లెస్సింగ్ ముజారబానీ బౌలింగ్‌లో ఔటయ్యాడు. నిరోషన్ డిక్‌విల్లా (7), ఆసెల గుణరత్నే (9) తక్కువ స్కోర్లకే పెవిలియన్ చేరగా, కుశాల్ మేండిస్ 36 పరుగులు సాధించాడు. చివరిలో కెప్టెన్ దినేష్ చండీమల్ (38 నాటౌట్), తిసర పెరెరా (39 నాటౌట్) మరో వికెట్ కూలకుండా జాగ్రత్త పడుతూ లంకకు ఇంకా 31 బంతులు మిగిలి ఉండగానే, ఐదు వికెట్ల తేడాతో విజయాన్ని అందించారు.


ప్రతిష్ఠాత్మక ముంబయి మారథాన్ పురుషుల విభాగంలో పతకాలు సాధించిన అథ్లెట్లు (ఎడమ నుంచి కుడికి) షుమెట్ అకల్నా (రజతం), సొలొమన్ డెక్సిసా (స్వర్ణం), జాషువా కిప్కోరిర్ (కాంస్యం). మహిళల విభాగంలో అమానే గొబెనా (స్వర్ణం), బర్నెస్ కిటుర్ (రజతం), షుకో జెనెమో (కాంస్యం) విజేతలుగా నిలిచారు.

Printed and Published from Vijayawada by **K.Sudhakar** on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor **T.V.Ravi Reddy**, Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90

ఆంధ్రభూమి
సాహితి
సోమవారం, 22 జనవరి 2018
email: sahiti@andhrabhoomi.net

ఆర్థిక సంకెళ్ళకు అతీతం సాహిత్యం

సాహిత్యం మెడమీద రాజకీయం కత్తి వేలాడుతున్నప్పుడు, సామ్రాజ్య వాద భావనాచ్ఛాయలు అలుముకుంటున్నప్పుడు, పాలకుల చెప్పు చేతల్లో సాహిత్య రంగం మెలుగుతున్నప్పుడు, స్వేచ్ఛాయుత సాహిత్య కంఠం నిశ్శబ్దంలో కూరుకుపోయి మౌనంగా నేల చూపులు చూస్తుంటూంది. పంటి బిగువుతో ఉబికొస్తున్న కన్నీటిని అణచుకుంటూ, కృత్రిమ హావభావాలు వ్యక్తీకరిస్తుంటూంది. ఇది చరిత్ర చెబుతున్న సత్యం. ఏది ఏమైనా ఈనాడు రాజకీయాలు కవిత్వానికి బరువైపోతున్నాయి. భాష యెడల నిష్పాక్షిత చూపాల్సిన అధికారం పాక్షిక దృష్టిని ప్రేరేపిస్తుంది. స్నేహం ప్రదర్శించాల్సిన పెద్దరికం వైరం ప్రదర్శిస్తుంది. ప్రాపంచిక దృక్పథం పట్టని, ప్రజాస్వామ్య విలువలు పట్టని, స్వార్థపూరిత ఉక్కపోతలోకి సాహిత్యాన్ని ఈడ్చి, ఆర్థిక అగరొత్తులతో పరిమళభరితం చేయాలనే సంకల్పం జరుగుతుంది. భావ దారిద్ర్యంలో మగ్గే పాలక వర్గాలకు నవ కల్పనలు నూతన ఆలోచనలు పట్టవుగాక పట్టవు. వాగాడంబరంతోకూడిన ఉపన్యాసాలు యిస్తూపోతుంటారేగానీ, నీతి నియమాలతో కూడిన చేతలకు మాత్రం దూరంగానే వుంటారీ కపట రాజకీయ నాయకులు. నోట్లు ఎరవేసి ఓట్లు గుంజి కుర్చీ ఎక్కినట్లు ఈనాడు సాహిత్య సాంస్కృతిక రంగాల్ని ఫండ్స్ ఎరవేసి లోబరచుకోవడానికి యత్నాలు జరుగుతున్నాయి. సాహిత్య రంగంలో అభ్యుదయవాదులు ఆర్థిక ఎర ముందు తోకాడిస్తూ పాలక పక్షం కాళ్ళదగ్గర సాగిలపడిపోతున్నాయి. జనం వైపు కళ్లెత్తి చూడకుండా ధనం వైపు పాలకులు కట్టబెట్టే పదవులవైపు పరుగులు తీస్తున్న అభ్యుదయవాదాలు.

అప్పుడప్పుడు ఏలికలు సాహిత్యరంగంమీద ఎంతో ఉదారత్వం చూపిస్తుంటారు. ప్రభుత్వ నిధులిచ్చి ప్రోత్సహిస్తుంటారు. అది పాలకుల్లో మార్పు వచ్చి కలిగిన ప్రేమ అనుకోవడమంటే పప్పులో కాలేసినట్లే! వారి రాజకీయ స్వప్రయోజనం ఎంతో రహస్యంగా అమలు చేయబోతున్నారనేది సత్యం. పాలక వర్గం, తమ అధికారాన్ని ఆర్జనే ప్రధానంగా, అయినవారిని పదవుల్లో నిలబెట్టడమే ధ్యేయంగా చేసుకుంటూ, సాహితీవేత్తల నోళ్లునొక్కడానికి వారి దృష్టిని మళ్లించానికి నోరెత్తే సాహితీవేత్తలకు కంటితుడపు పదవులు కట్టబెడుతూంటారు. ప్రభుత్వం ఫండ్స్ ఇచ్చి సాహిత్య పండుగలు చేసుకోమంటూంటారు. సాహిత్యవేత్తలు ఈ ప్రభుత్వం ఫండ్స్‌తో నిర్వహించే సాహిత్య సంబరాల్లో ప్రభుత్వం దిగజారుడుతనాన్నిగాని, వారుచేసే స్కామ్స్‌ని ఎత్తిచూపడంగాని, వారు నిర్వహించే దురాక్రమణలు, దౌర్జన్యాలను, అన్యాయాలను, అక్రమాలను వ్రేలెత్తి చూపడంగాని చేయకూడదనే ఒకే ఒక్క షరతు లోపాయికారిగా జరుగుతుంటుంది. దీన్ని అంగీకరించిన అధికారాన్ని మోస్తున్న సాహితీవేత్తలు సాహిత్య సంబరాల్ని అంబరం అంటే విధంగా చేస్తామంటూ శ్రీరంగనీతులు వల్లె వేస్తుంటారు. సాహిత్యంలో సమైక్యవాదాన్ని ముందుకు తెస్తుంటారు. సామాజిక చైతన్యాన్ని కలిగించే సైద్ధాంతికపరమైన, శాస్త్రీయపరమైన, హేతుబద్ధమైన వాదాల్ని త్రోసిపుచ్చుతూ, మానవీయతా వాదాన్ని స్మరిస్తూ దాని ముసుగులో బతికిపోతున్న సాహితీవేత్తలు కోకొల్లలుగా పుట్టుకొస్తున్నారు. అధికారానికి ఊడిగం చేస్తున్నారు. ఆర్థికపరమైన అవకాశాల కోసం అర్రులు చాస్తున్నారు.

ఈ రోజు సమాజానికి స్లోపాయిజన్ ఇచ్చి చంపుతుంది మేధావి వర్గాలే! వారి భావదారిద్ర్యం కంతిరి ఆలోచనలతో జనాన్ని తప్పుదోవ పట్టించే రాతలు రాస్తుంటారు. సిద్ధాంతాల ముసుగులో బతుకుతున్న సాహితీవేత్తలు వాటిని ఉన్నవాని పాదాల దగ్గర వదిలేసి కాకమ్మ కబుర్లతో అక్రమ సంపాదనలకు హారతులెత్తుతున్నారు. మాటలకు, చేతలకు పొంతన లేనప్పుడు కవులు కనే కలలు మనుషుల్లో ఫలిస్తాయనుకోవడం వెర్రిబాగులతనమే అవుతుంది.

మనిషి జీవన పరిధి విస్తరిస్తుంది. బతకడానికి పలు విధాలైన వృత్తులను చేపట్టవలసి వస్తుంది. ఈ వృత్తులన్నీ కార్పొరేట్ వ్యాపారస్తుల చేతుల్లో ఇరుక్కుపోయాయి. వారి యంత్రాల ద్వారానే యంత్రాంగం నడస్తుంది. సామాన్యునికి అందని స్థితిలోకి వృత్తులు తమ రూపు మార్చుకుని ఎదిగిపోతున్నాయి. ప్రభుత్వ అండదండల్ని కొనేస్తూ, శ్రామిక వర్గాల్ని దోపిడీ చేస్తూ సంపన్నులు మహా సంపన్నులైపోతున్నారు. పేదవాడు మరీ పేదవాడైపోతున్నాడు. ఏ కాలపు సాహిత్యమైనా ఆ కాలపు స్థితిగతుల్ని దోపిడితత్త్వాన్ని, దుర్మార్గాల్ని ఎత్తిచూపాల్సి వుంది. మరి ఈనాడు మన సాహితీవేత్తలు రొమ్ము విరిచి, జబ్బచరసి పౌరుషాగ్నిని రగిలిస్తూ పాలకుల దుర్మార్గాల్ని దుయ్యబడుతూ రాతలు రాస్తున్నారా? ప్రభుత్వపు కొంగు పట్టుకు తిరిగే సాహితీవేత్తలకు ఇదెట్టా సాధ్యమౌతుంది? అందుకే నిజాయితీగల పభుత్వం పిలుపునకే సాహితీవేత్తలు స్పందించాల్సి వుంది. వారు ఎరవేసే పదవులకుగాని, వారి భావజాలాన్ని ప్రోది చేసుకొని సాగించే సభలకుగాని చంకలు తట్టుకుంటూ ఎగబడడం సాహితీవేత్తల దిగజారుడుతనాన్ని పట్టిస్తుంది.

ఎవరూ తమను తాము మోసం చేసుకోకూడదు. తమకు తాము అసత్యాలు చెప్పుకోకూడదు. తప్పును సమర్థించుకోవడానికి ప్రయత్నిచకూడదు. ఈ విషయాలు ఎప్పుడూ మనిషిని పతన దిశగా పయనింపజేస్తాయి అనే సత్యాన్ని గుర్తెరగాలి. జీవిత లక్ష్యలకు మార్గదర్శకులుగా నిలవాల్సిన సాహితీవేత్తలు క్షుద్రతలకు తలలూపుతూ, జీవిత స్వాభావిక నియమాలను పరికించి వాటి మార్పుకు ఘర్షణపడే తీరుతెన్నులు ఎరుగకుండా పాలక పక్షాల తీపి కబుర్లకు కరిగిపోవడం చారిత్రక తప్పిదమే అవుతుంది. పాలకుల ఉదారత్వం సాహిత్యానికి ఉరితాడు కాకూడదు. వారు చూపే సానుభూతి సంకెళ్లు కాకూడదు.

> **సాహిత్య సభల్లో సామాజిక విధ్వంసక శక్తులమీద యుద్ధం చేసే చర్చలు జరగాలి. పాలకుల పాలనా విధానాల మీద అవగాహన కల్పించే వేదికలు కావాలి. జనాన్ని చైతన్యపరచే ఉపన్యాసాలు కావాలి. నిజాయితీ నిబద్ధతగల కవులు సృష్టించే సాహిత్యంమీద చర్చలు జరగాలి. ఆచరణబద్ధమైన ఆలోచనలు కలిగించే వైజ్ఞానిక సాహిత్య నిపుణులను వెలికితీసే కార్యాచరణకు సాహితీ సభలు నాందీవాక్యం పలకాలి.**

సాహిత్య సభల్లో భరతనాట్యాలు, బొమ్మలాటలు, చెక్క భజనలు క్షుద్రదేవతల కొలుపులు ఉండడమంటే ప్రజా సమస్యల్ని దారి మళ్లించడమే అవుతుంది. సాహిత్య సభల్లో పాలక వర్గాల్ని పడి పడి మొక్కుతూ సన్మానించుకోవడమంటే సాహిత్యపు నైతిక విలువలను దిగజార్చుకోవడమే! సాహిత్య సభల్లో సామాజిక విధ్వంసక శక్తులమీద యుద్ధం చేసే చర్చలు జరగాలి. పాలకుల పాలనా విధానాల మీద అవగాహన కల్పించే వేదికలు కావాలి. జనాన్ని చైతన్యపరచే ఉపన్యాసాలు కావాలి. నిజాయితీ నిబద్ధతగల కవులు సృష్టించే సాహిత్యంమీద చర్చలు జరగాలి. ఆచరణబద్ధమన ఆలోచనలు కలిగించే వైజ్ఞానిక సాహిత్య నిపుణులను వెలికితీసే కార్యాచరణకు నాందీవాక్యం సభలు పలకాల్సి వుంది.

సాహిత్యం జనంలో వెళ్ళే విధానాల్ని ఎన్నింటినో ప్రభుత్వం చేపట్టే విధంగా సూచనలు చేయాల్సి వుంది. ప్రజల సొమ్ము దారుణంగా దుబారాగా ఖర్చు చేయడం పాలనా దక్షత అనిపించుకోదు. వ్యవస్థీకృతమైన మౌలిక అంశాల్ని చర్చించాల్సి వుంది. ప్రజల వాస్తవ జీవన సమస్యలకు పరిష్కారం చూపెట్టే ఆలోచనలు రేకెత్తించగలగాలి. దళారీ రాజకీయ ఎత్తుగడలు సామాజిక రంగాల్లో గందరగోళ పరిస్థితిని సృష్టిస్తాయనే సత్యాన్ని మరచిపోకూడదు. సాహిత్యం పేరుతో జరిగే సభలు నిష్కళంకమైన సాహిత్య విలువల్ని వెలికితేవాల్సి వుంది.

- కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, 9948774242

ఉమాదేవీయం

"తనువు చందనశాఖి
మనసు నందనవాటి
కలముపనిషద్గంగ
గళము హిమనగశృంగ"

కొందరు గొప్పవారుగా జన్మిస్తే మరికొందరు ఏదో ఒక నిర్దిష్ట ప్రయోజనం కోసం జన్మనెత్తిన వారుంటారు. కొందరు సామాన్యంగా జన్మించి మాన్యులవుతారు. మరికొందరు కారణ జన్ములుంటారు. అలాంటివారిలో ఎం. ఉమాదేవి ఒకరు. క్రమోన్మీలన దశలో తేజస్వినిగా మారింది. శివసహస్రనామం, లలితాసహస్రనామ భాష్యాలు వెలువరించింది. ఉపనిషత్తులకు వ్యాఖ్యానాలు చెప్పింది. పంచమ వేద అనుశీలనం చేస్తూ పార్వతీ చరణ కింకిణిగా మారింది. పారాణిగా తనను తానే శ్రీమాతగా అలంకరించుకున్నది. హారతి కర్పూరంగా వెలిగిపోయింది. రసార్ద్రహృదయంతో కరిగిపోయింది.

క్రీ.శ. 1946 జూలై 5న శ్రీకాకుళం జిల్లా సంగమేశ్వర క్షేత్రంలో ఉమాదేవి జన్మించారు. వీరిది సంప్రదాయ అరామ ద్రావిడ వంశం. తండ్రి భాగవతుల సన్యాసిరావు, తల్లి భళ్లముడి అనసూయమ్మ, వారిది కుద్దిగాం అగ్రహారం. ఇది కొత్తూరు మండలంలో ఉంది. వీరి పూర్వీకులు నిష్ఠాగరిష్ఠులైన శివభక్తులు. నీలకంఠేశ్వర దేవాలయ నిర్మాతలు. ఇది వంశధార నదీ తీరంలో ఉంది. అనసూయమ్మ గారి తండ్రి జగన్నాథ భుక్తగారు మహాతపస్వి. అనసూయమ్మ గారికి ఐదుగురు సంతానం. ఉమాదేవి మూడవ కాన్పు. తండ్రి యునైటెడ్ కమర్షియల్ బ్యాంకులో మేనేజర్‌గా పని చేయడం వల్ల వివిధ ప్రాంతాలకు పర్యటనలకు వెళ్తుండేవారు. అందులో క్వెట్టా (నేటి పాకిస్థాన్) వంటి సుదూర ప్రాంతాలు కూడా ఉండేవి. బివిఎస్‌రావుగారు ఉద్యోగ రీత్యా కలకత్తాలో ఉండగా ఉమాదేవి అక్కడ ప్రాథమిక విద్యను అభ్యసించారు. ఆ విధంగా తెలుగు, హిందీ, బెంగాలీ, భాషలు సహజంగానే వచ్చాయి. అనంతరం హైదరాబాదులో బిఎస్‌సి అభ్యసించింది. అనంతరం 1966లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. సంస్కృతం నేర్చుకున్నది.



ఆర్యేంద్రశర్మ, బి. ఆర్. శాస్త్రి, పుల్లెల శ్రీరామచంద్రుడు వంటి దిగ్గజాలు అప్పుడు సంస్కృత శాఖలో ఉండేవారు. 1967లో ఉమాదేవికి చారిత్రక నవలా చక్రవర్తి ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్‌తో వివాహం జరిగింది. అప్పటి నుంచి ఆమె జీవితంలో నూతనాధ్యాయం ప్రారంభించింది. ఇందుశేఖర్, పద్మసుషమ, శ్రీలేఖ వారి సంతానం. ఇటు ఇంటిపని, అటు వంటపని చూసుకుంటూ ఆమె" పాల్కురికి సోమనాథుని సంస్కృత సాహిత్యం" అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పరిశోధన చేసి పిహెచ్.డి పట్టా పొందారు. తర్వాత సంస్కృత భాషోపన్యాసకురాలిగా దాదాపు ఇరవై సంవత్సరాలు పనిచేశారు. ఈ కాలంలోనే పత్రికలకు వివిధ వ్యాసాలు వ్రాయటం మొదలు పెట్టారు. నిరంతర దేవీపూజ తత్పరతతో ఆధ్యాత్మిక జీవితం గడుపుతూ అసంఖ్యాక శిష్యగణాన్ని సమకూర్చుకున్నారు.

లలితా సహస్రనామ భాష్య ప్రవచనములు ప్రారంభించారు. అగస్త్య, హయగ్రీవ సంవాదాత్మకమైన లలితా నామములకు భాష్య గ్రంథం రచించారు. న్యూఢిల్లీ మానవ వనరుల శాఖ వారి సీనియర్ ఫెలోషిప్ లభించటంతో 'శివసహస్రనామ భాష్యం' రచించారు. ఆ తరువాత మౌనీజీ జీవితం అనే బయోగ్రఫీ వెలువరించారు. ఆ తరువాత మధుమేహ వ్యాధితో బాధపడుతూనే 14 ఉపనిషత్తులకు వ్యాఖ్యాన గ్రంథాన్ని తెలుగులో రచించారు. క్యాన్సర్ వ్యాధిని అధిగమించి సంకల్పబలంతో పంచమవేదంలోని ఉపకథాసంకలనం ప్రారంభించారు. ఐతే అనుశాసనిక పర్వం పూర్తిచేసి 18 డిసెంబర్ 2017 హేవలంబ పుష్యశుద్ధ పాడ్యమి సోమవారం పౌష్యలక్ష్మియై హైదరాబాదులో తన 71 ఏట ఆమె శివైక్యం చెందారు.

ఒక విజేత వెనుక ఒక స్త్రీ ఉంటుందని ఒక నానుడి. ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్ నూటొక్క గ్రంథాలు వ్రాయడానికి ప్రేరణ ఉమాదేవిగారే. 'నీవు వేలుపుటారి, వేల్గురేకవు - కేవలంబును మృదాకృతిని నేను' అనే పద్యాన్ని నవలాచక్రవర్తి గుర్తు చేసుకొన్నారు. ఆమె స్త్రీ రూపమందిన గేహధర్మ, ఆమె ప్రకృతి అయితే తాను వికృతిని అని భావించారు. నిజానికి ఇదొక శివశక్తుల లీల. శక్తిపోయి శివుడు మిగిలాడు. 'అయ్యో! రెండు పక్షులలో ఒక పక్షిరాలిపోయింది' అన్నారు భక్తురాలు చివుకుల జయప్రద. 'కాదు ఒకే పక్షి రెండు రెక్కలలో ఒక్క రెక్క వాలిపోయింది' అన్నాడు శివుడు.

రఘువంశంలోని అజవిలాసం నుండి ఎలిజీ సంప్రదాయం మనకు సాహిత్యంలో కన్పడుతున్నది. ఉమాదేవి దీపం క్రింద క్రీనీడలా కాకుండా తానే దీపమై స్వతఃసిద్ధంగా వెలిగింది. సద్గురు శివానంద మూర్తి, కుర్తాళం పీఠాధిపతులను ఆరాధించారు. ఆపన్నులకు శక్తిపాతాన్ని చేసింది. లక్షలకు లక్షల బాలామంత్రాన్ని జపించి ఆర్తులకు ధారపోసింది. పార్థివ శరీరం శిథిలమైనా అక్షరరూపంలో ఆధ్యాత్మికాకాశంలో ధ్రువతారగా నిలిచింది. 'మానవసేవయే మాధవసేవ' అనే సందేశం ఆచరించి అనుష్ఠాన వేదాంతానికి సాకారంగా నిలిచింది.

శ్రీమతి ఉమాదేవి చిన్నతనంలోనే కూచిపూడి నృత్యం, వీణ, వయోలిన్ నేర్చుకున్నారు. ఆ అభిరుచితో కుమార్తె శ్రీలేఖను నర్తకిని చేశారు. శ్రీలేఖ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుండి డాన్సులో ఎం.ఎ. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలై పిహెచ్‌డి కూడా నృత్యశాఖలోనే చేసింది. కుమారుడు ఇందుశేఖర్, కుమార్తె పద్మసుషమ హిందూ ధార్మిక సామాజిక కార్యకర్తలుగా సంవత్సరాల తరబడి పనిచేయటంలో వారిని తీర్చిదిద్దిన బాధ్యత ఈ తల్లికే చెల్లింది. ఒక శివాజీ సమాజానికి అందాలంటే ఒక జిజియాబాయి చాలా అవసరం ఉంటుంది. అందుకనే కుటుంబమే సంస్కార కార్యక్షేత్రం అని ఉమాదేవి సందేశమిచ్చారు.

శ్రీమతి ఉమాదేవి అమెరికాలో కొంతకాలం ఉన్నప్పుడు అక్కడి సామాజిక పరిస్థితులను అధ్యయనం చేశారు. తెల్లవారి విశృంఖల జీవనం కన్నా నల్లవారి కౌటుంబిక సంబంధాల చేత ఆమె ఆకర్షింపబడ్డారు. 'ఇల్లు అంటే రాతి గోడలు కావు, హృదయాల మధ్య అనుబంధం' అని ఉమాదేవి విశ్వసించారు. పునర్జన్మలో హిమాలయ గౌరీశంకర శిఖర సమీపంలోని ఓషధీ ప్రస్థపురంలో జన్మించాలని ఆశించారు. హైదరాబాదులోని ఆచార్య శివ్రముని పీఠం పక్షాన గురుపూర్ణిమ నాడు ఒక విదుషీమణికి ఉమాదేవి పేరు మీద వార్షిక పురస్కారాన్ని నగదు బహుమతితో ఇవ్వాలని నిశ్చయించారు.

- డా. రాయసం లక్ష్మి

స్వేచ్ఛగా..!

ఇదుగో వస్తున్నా..!
యీ మొక్క చుట్టూ వరదగూడులా
పాదుకట్టీ.. కాసిన్ని నీళ్ల పోసీ..!

ఆకు కళ్లు తెరచి
రేపిది రెమ్మ తొడిగితే..
మనం చిగురించినట్టు!


కాసేపాగు వస్తున్నా..!
కొండవాలులోంచి దూకే యీ వాగు నాగును
ఎండిన పొలాలమీదకు మళ్లించీ..!

తడిదేరీ నేల నవ్వితే..
రేపటితరం పెదాలమీద నెలవంకలా
మనం పచ్చని నవ్వైనట్టు!

ఒక్క క్షణమాగు వస్తున్నా..!
రెక్క విరిగిన యీ పావురానికి
కాసేపు ఊపిరూదీ.. వెన్ను నిమిరీ..!

తేరుకోనీ.. విడిచిన బాణమై
రేపిది నింగినీ చీల్చుకుపోతే..
మనం స్వేచ్ఛగా రెక్క విచ్చినట్టు!!

- సిరికి స్వామినాయుడు




శుభారంభం

ఆంగ్ల వత్సరమైనా.. తెలుగు వత్సరమైనా
అందరికీ కావాలి శుభారంభం
అమ్మనాన్నల పిలుపు దూరమైనా
మమ్మీ డాడీల గెలుపు చేరువైనా
మారిన కాలానికి మనమే నిలువెత్తు సాక్షులం
పోటీ ప్రపంచంలో గె(ని)లవాలన్నా
తప్పదు అలుపెరుగని పోరాటం
డాలర్లవేటలో అందరూ ప్రయాణికులమే
బంధాలు - అనుబంధాలు
అందరికీ కడు దూరమే
పిల్లలంతా విదేశాలకు తరలుతున్నారు
వృద్ధులంతా ఆశ్రమాలకు తరలుతున్నారు
బంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అన్న ఓ మహాత్ముని మాట
అది అక్షరాల నడుస్తున్న
కలియుగమెరిగిన బాట
ఆస్తి అంతస్తు హోదాలు మనిషికివే భూషణాలు
అవినీతి మనిషికి అందరితో దూషణాలు
ఎవరూ అవునన్నా.. ఎవరు కాదన్నా..
ఇదే కలియుగపు మనుషుల నీతి
మనిషిగా మాయమవుతున్న మన అధోగతి
కాలమెంత మారినా.. మనిషి నైజం మారదు
అందుకే అందరికీ కావాలి శుభారంభం
మానవత్వం పరిమళించాలి నిరంతరం..

- కురువ శ్రీనివాసులు

విశ్వనరుడు

చీకటిని చిదిమి
తెలి వేకువ వేగుచుక్కగా
అతని నుదుటిపై ఎర్రని తిలకం
నెత్తుటి సూరీడ్ని పుష్పిస్తుంది
కాలం కాలనాగై కాటేసిన సందర్భాలను
రాలిన కన్నీటి చుక్కల్లో లుప్తపరుస్తూ
అతడు... మరో ప్రస్థానానికై
నిప్పుల గుండంపై పేగు పాశానికి
భస్మాభిషేకం చేస్తాడు!
అజ్ఞాత దుఃఖార్తులకు
వేదన రోదన మిన్నంటిన శోక హృదయాలకు
పగిలిన గుండె చప్పుడును వినిపిస్తాడు
శివం శవమైన చోట...
దింపుడు కళ్లెం లేని మనసు గోసను
కన్నీటి సంద్రంగా మార్చిన
ఒకానొక బాధామయ సందర్భానికి
అతడు... ఆజన్మాంత సాక్షి!
నిత్యం చావు డప్పులను
మౌన ఘోషలుగా వింటూ
దేహీ అంటున్న శూన్య హస్తాలతో
దుఃఖ తిమిరాలను చీలుస్తూ



ఏడేడు లోకాల వైతరిణిని దాటించే
స్థితప్రజ్ఞుడతను!
దేహ మాళిగలను పుడమి గర్భంలో
పూడ్చిపెడుతూ...
చితి మంటల్లోని అగ్ని నక్షత్రాలను
అనితరసాధ్యంగా అంబరానికి చేరదీసే
విశ్వనరుడిగా...
పునరపి చక్ర భ్రమణంలో
నిర్వాణాన్ని నివేదించే అతడు
ఇంటింటి వీధి మనిషి!!

- బి. కళాగోపాల్, 9441631029

ఉద్యోగినులు - కుటుంబ బాధ్యతలు

'ఉద్యోగస్థులయిన శ్రీమతులమీద నేను పరిశోధన చేస్తున్నాను. ముఖ్యంగా మన దేశంలో గృహిణులు ఉద్యోగాలు చెయ్యటం అంతగా వ్యాపించలేదు. స్త్రీలు గృహిణులుగానూ, ఉద్యోగినులుగానూ ద్వంద్వ బాధ్యతలను ఎలా నిర్వహిస్తున్నారు, ఏయే సమస్యలను ఎదుర్కొంటున్నారు, ఎలా పరిష్కరించుకుంటున్నారన్నదే నా పరిశోధనాంశం' అంటూ ఒక పరిశోధకురాలు శ్రీమతిగానూ, ఉద్యోగినిగానూ ఉన్న రచయిత్రిని పరిచయం చేసుకుంటుంది.

శ్రీమతి అబ్బూరి ఛాయదేవిగారు 1975లో వ్రాసి ప్రచురించిన కథానిక 'శ్రీమతి ఉద్యోగిని'లో భాగం ఇది. నలభయి సంవత్సరాలు దాటిపోయిన తరువాత కూడా స్త్రీ జనాభ్యుదయాన్ని గురించి ప్రస్తావించినప్పుడు, తగినంత జరగలేదని అనేవాళ్లు అవసరం కంటే ఎక్కువగా జరిగిందని వాదించేవాళ్లూ అనేకులు వున్నారు. 'లోకోభిన్నరుచి' కదా! ఉద్యోగాలలోనే కాదు, పార్లమెంట్, అసెంబ్లీ సభ్యులలో కూడా స్త్రీలకు ప్రత్యేక శాతం కేటాయించాలని ప్రభుత్వం కొన్ని సంవత్సరాలుగా ప్రయత్నం చేస్తోంది. అది అనేక రాజకీయ కారణాలవల్ల యింకా సానుకూలం కాలేదు. 'పీపుల్స్ రిప్రజెంటేషన్ ఆక్ట్'లో స్త్రీలకంటూ ప్రత్యేక శాతం లేదు. అన్ని సీట్లకు వాళ్లు పోటీ చేసి పాలన విభాగంలో ప్రవేశించినా ఎలాంటి అభ్యంతరం లేదు. (అటువంటప్పుడు ఈ ఆక్ట్ అవసరమా అనేది మరోప్రక్క- అది వేరే విషయం).

స్త్రీలకు చదువులు అవసరం లేదనే రోజులు కూడా గత శతాబ్దంలో వున్నాయి. స్త్రీలకు చదువులు వస్తే జీవితాలు అనర్థకంగా తయారవుతాయని వాదించేవాళ్లు ఇప్పటికీ వున్నారు. స్త్రీలు చక్కగా చదువుకోవడం, ఉద్యోగాలలో ఉన్నత శ్రేణులకు రావడం మానవాభ్యుదయ పథకం- పరిణామంలో అతి ముఖ్యమైన విషయం అనేది మనం గమనించక తప్పదు.

మళ్లీ కథానికలోనికివస్తే, సుజాత సోషియాలజీ శాఖలో పరిశోధన చేస్తున్న అమ్మాయి. ఉద్యోగస్తురాలయిన శ్రీమతిని కలుసుకుని సంసారానికి, సంపాదనకు, దైనందిన జీవన వ్యవహారానికి సంబంధించిన అనేక ప్రశ్నలు వేసి తనకు కావలసిన సమాచారాన్ని సేకరించగలుగుతుంది. ఈ ఇంటర్వ్యూలో మధ్య మధ్య ఉద్యోగస్తురాలి భర్తగారు బద్ధకంగా పడుకునివుండి, కొంత చిరాకును ప్రదర్శించడం కూడా జరుగుతుంది. 'మొదట్లో ఎందుకు ఉద్యోగంలో చేరారు, ఇప్పుడెందుకు చేస్తున్నారు' అన్న ప్రశ్నకు ఆమె సమాధానం: 'మొదట్లో ఇంట్లో తోచక చేరాను. ఇప్పుడు అలవాటయిపోయి చేస్తున్నాను' అంటారు. ఇంట్లో ఇబ్బందుల నుంచీ, అత్తగారి ఆగడాలనుంచీ తప్పించుకోవటానికి కూడా ఆమె ఉద్యోగంలో చేరలేదు.

'ఏదో కాలక్షేపం కోసం ఉద్యోగంలో చేరాను కాని, ఊళ్ళేలాలని ఉబలాటంతో కాదు. కానీ, కష్టపడి పనిచేయడంవల్ల కాలక్రమేణా పైకి రావడం తటస్థించింది. ఉద్యోగంలో హోదాతోపాటు పరపతి కూడా పెరిగింది అని కూడా చెబుతుంది. తన ఉద్యోగానికి సంబంధించినవే కాక సంసారానికి చెందిన ప్రశ్నలకు జవాబు చెబుతూ ఆమె 'ఇద్దరు ఆడబిడ్డలు పెళ్లయినాక ఉద్యోగాలు మొదలుపెట్టారు. ఒక ఆడపడుచు పెళ్లికి ముందు మూడు సంవత్సరాలు ఉద్యోగం చేసి తరువాత కుదరక మానేసింది. మా పెద్ద మరిది భార్య కూడా ఉద్యోగం చేస్తోంది. రెండవ మరిదికి ఇంకా పెళ్లి కాలేదు అని చెబుతూ వున్నప్పుడే ఆమెకు సుజాత చొరవ, పరిశోధనాకాంక్ష చూసి ఆ అమ్మాయిని తన తోటికోడలు చేసుకోవాలనే ఆలోచన మనసులో మెదిలింది. ఈ ఆలోచన మనసులోనే పెంచుకుని, భర్తతో కూడా సూచనగా అని, కథాంతంలో ఈ మాటలు పలికిస్తుంది. 'ఎన్నో విషయాలు మనసులో అట్టడుగున దాగినవి, ఎన్నడూ అనుకోనివీ బయటకు వచ్చాయి. అసలు నువ్వాడిన ప్రతివాళ్ళూ ఎవళ్ళకి వాళ్లు వేసుకోవాలి. అటువంటి ఆత్మ పరిశీలన అవసరం. నీకు నేనే కృతజ్ఞత తెలపాలి. అదీకాక, నీతో మాట్లాడుతున్నంతసేపు మరొక ఆలోచన నా మనసులో మెదిలింది. ఆ ఆలోచన ఏమిటో చెప్పమని సుజాత అడిగితే 'తరువాత నీకే తెలుస్తుందిలే' అని నవ్వుతూ చెప్పి కథను ముగిస్తారు. కథనంలో ఎంతవరకు చెప్పాలి, ఎంతవరకు పాఠకుల ఆలోచనకే వదిలేయాలి అన్న అంశానికి ఇదో చక్కని ఉదాహరణ. వివాహ ప్రసక్తి కొనసాగించటానికి ఇంకా ఎన్నో ప్రశ్నలు వేసుకోవాలి. అబ్బాయికీ అమ్మాయికీ పరిచయం కల్పించాలి. వాళ్ళు ఇష్టపడేట్లు చేయాలి. ముందుకు ముందుగానే మన నిర్ణయాలు, అవే సరయినవి అనుకుని, బయలుపరచడం మంచిదికాదు అనే విజ్ఞత వున్న ఉద్యోగి ఆమె. దంపతులమధ్య వచ్చే చిల్లర, చిన్న చిన్న విభేదాలను గురించి కూడా ప్రస్తావన వస్తుంది. అయితే ఇవన్నీ అంత ముఖ్యమయినవి కావనీ, అభిప్రాయ భేదాలు సర్దుకుపోవడంలోనే సంసార సుఖం వున్నదనీ చెబుతుంది.

'ఎవరో పరాయివాళ్లను పిలిచినట్లు పేరు పెట్టి పిలవడమేమిటి? ముద్దుగా పిలవడం ముఖ్యంగాని పేరులో ఏముంది' అని సమాధానంగా చెబుతుంది. పరిశోధకురాలు ఇచ్చిన జాబితాలో భర్తను వర్ణించే లక్షణాల వివరాలు వుంటాయి. వాటికి చమత్కారంగా సమాధానాలు రాస్తూ 'ఆయనకన్నా నేను రెండు అంగుళాల పొట్టి. తమతో సమానంగా ఎట్లా చూస్తారు?' అంటుంది. భర్తకు తన పైన ప్రేమ, అధికారం వున్నాయని నిర్మొగమాటంగా చెబుతుంది. మళ్లీ జీవితం మొదలుపెడితే ఆయన్నే చేసుకుంటాననీ, వాళ్ళ వారు మాత్రం పెళ్ళే చేసుకోననే అభిప్రాయంలో వున్నారనీ తెలియజేస్తుంది. 'ఆయనకేం? మగరాయుడు' అనడంలో కొంత వేళాకోళం, హేళన, చమత్కారం వున్నాయి.

అబ్బూరి ఛాయదేవి బాగా చదువుకుని ఉద్యోగం చేసిన వ్యక్తి. జీవిత పరిశీలన సంసారికంగానూ, ఆధ్యాత్మికంగానూ పరిపరి విధాల చేసిన మనీషి. సాహిత్య ఎకాడమీ పురస్కారం పొందిన కథానిక రచయిత్రి. సమరస జీవనానికి అనువయిన సూత్రాలు ఎన్నో ఆమె రచనలలో విస్తారంగా దొరుకుతాయి. కథానిక ప్రయోజనం సాంఘిక సమరసత తీసుకురావడం అనేదేనని ఆమె చెప్పక చెప్పుతారు.

శ్రీవిరించీయం

- శ్రీవిరించి, 09444963584



వ్యూహం

26 **అలపర్తి రామకృష్ణ**

మా డాక్టరు చెప్పేక నీకు ఉద్యోగం ఇవ్వక పోతే ఏమన్నా వుందా?'' ఈ రోజే జాయిన్ అవ్వు.. జీతం, వర్కింగ్ కండిషన్స్ గూర్చి రేపు మాట్లాడు కుందాం!'' అన్నాడు కాశి.

కాశీకి నమస్కారం పెట్టి రూము బయటకు వెళ్లి నిలబడ్డాడు లెనిన్.

''కుటుంబం అంటూ అయినవాళ్ళు లేకపో వడం, ఒంటరిగా వుండటంతో ఒత్తిడి ఎక్కువగా వుంటుంది మేడమ్.. ఏం చెయ్యమంటారు?'' అడి గాడు కాశి.

''వెంటనే పెళ్లిచేసుకోండి''' అందామె.

''మనస్సుకు నచ్చిన అమ్మాయికేమో వయస్సు తక్కువ.. నాకంటే పాతికేళ్ళు చిన్నది.. పెళ్లి చేసుకో వడం కుదరని పని.. మనస్సులో దాచుకోలేక చెప్పాననుకోండి. నన్నో పిచ్చివాడిలా జమ కట్టి నవ్వుతుంది.. అందుకే ఆ అమ్మాయికి చెప్పదల్చు కోలేదు.. గుండెల్లోనే గుడికట్టి ఆ దేవతను పూజిం చుకుంటాను'' అన్నాడతను.

''దట్స్.. బెటర్.. ఆ అమ్మాయి మనస్సు నొప్పిం చగూడదనే మీ మంచితనాన్ని మెచ్చుకోకుండా వుండలేకపోతున్నాను.. మళ్లీ కలుసుకుందాం కాశీ గారూ!'' అనేసి వెళ్లిపోయింది డాక్టర్ లోహిత.

⁘⁘⁘

డాక్టర్ అరవింద్ ఎదురుగా కూర్చున్నాడు కాశి

''కాశీ! నీకో కథ చెప్పమంటావా?''

అరవింద్ మాటలకు ఆశ్చర్యపడలేదు కాశి.

అప్పుడప్పుడు అరవింద్ అలాగే మాట్లాడుతూ వుంటాడు. వైరాగ్యం ఆవహిస్తుందతన్ని. అప్పుడు నిజాయితీగా మాట్లాడుతాడు. ఆ వైరాగ్యం కొన్ని నిముషాలే!

''కుక్కపిల్లకు మాంసం ముక్క దొరికింది. ఆ ముక్కని నోట కరచుకుని చెట్టు నీడలో కూర్చుని వెంటనే తింటే అయిపోతుందని నాకుతూ కూర్చుంది. ఆ మాంసం ముక్కను చూసి ఆనంద పడిపోతూ వుంది. కళ్ళముందు కనిపిస్తే ఆనందం.. తినేస్తే ఆ ముక్క కడుపులో చేరిపో తుంది.. కనిపించదు.. ఆనందేమి వుంటుంది?

అప్పుడే ఐదారు పెద్ద కుక్కలు అటుకేసి వచ్చాయి. కుక్కపిల్ల నోట్లో వ్రేలాడుతున్న మాంసం ముక్కను చూసి వెంట పడ్డాయి. కుక్క పిల్ల పరుగెత్తింది. దాన్ని తరుముతూ మీదపడి రక్కుతూ అరుస్తున్నాయి ఆ కుక్కలు. తన ప్రాణాలు తీసేస్తాయేమోనని భయపడింది కుక్క పిల్ల. మాంసం ముక్క అక్కడ పడేసి పరుగెత్తింది. కుక్కపిల్లను వదిలేసి ఆ మాంసం ముక్క కోసం పోట్లాడుకోవడం మొదలెట్టాయి పెద్దకుక్కలు.

సంపద కూడా అంతే! ఎవర్నీ ఎప్పుడూ సుఖప డనివ్వదు. ధనం సంపాదించాలంటే శ్రమపడాలి! ఆర్జించిన ధనాన్ని భద్రపర్చుకోవడం కూడా కష్టమే! ఆ సంపద ఎవరన్నా కాజేస్తారేమోనన్న భయం వెంటాడుతుంది.. నిద్రపోనివ్వదు..''

కాశికి విసుగొచ్చింది.



''ఆ విషయాలు నాకెందుకు చెబుతున్నారు.. నా దగ్గర ఆస్తి ఏం లేదు.. నేను సంపాదించిందంతా ఖర్చు పెట్టేస్తాను.. దానధర్మాలు చేస్తాను.. మీరు చెప్పిన భయాలు నాకేం లేవు'' అన్నాడు కాశి.

''నాక్కూడా సంపద మీద విరక్తి కలుగుతోంది కాశి.. కోట్లు, కోట్లు సంపాదించాను.. గుడ్ సమారి టన్ హాస్పిటల్‌లో నాకు పార్ట్‌నర్‌షిప్ వుంది.. వచ్చిన లాభాలన్నీ స్విస్ బ్యాంకులో జమ అవుతు న్నాయి. ఇప్పటిదాకా నా బ్యాంక్ అకౌంట్లు అన్నీ నేనే మెయిన్‌టెయిన్ చేసుకున్నాను. జీవితం ఏ క్షణంలో ముగుస్తుందో ఎవరికి తెలియదు.. నా ఎకౌంట్ నెంబర్లు, కోడ్ నెంబర్లు, డబ్బు ఎలా డ్రా చెయ్యాలో నువ్వూ తెలుసుకోవాలి!''

''మీ బ్యాంక్ ఎకౌంట్ల వివరాలు నాకెందుకు?''' సూటిగా ప్రశ్నించాడు.

''నువ్వు నా బాల్య స్నేహితుడివి.. నాకు బంధు వులు ఎవరూ లేరు.. నా పేరు మీద వున్న బిల్డింగ్స్ ఎక్కడెక్కడ వున్నాయో ఎవరికీ తెలియదు.. అక స్మాత్తుగా నేను చనిపోతే నా ఆస్తి ఏమవుతుంది? నా ఆత్మీయులే నా సంపద అనుభవించాలి! చెల్లా చెదరుకాకుండా ఆ ఆస్తికి వారసుడిని ఎంపిక చేసు కోవాలి నేను. అలా ఆలోచిస్తున్నపుడు నా మెద డులో నువ్వు మెదిలావ్.. నీకంటే నాకు ఆత్మీ యులు ఎవరున్నారు.. యు ఆర్ ఫెయిత్‌ఫుల్ టు మి ఎవర్ సిన్స్ అవర్ చైల్డ్‌హుడ్.. అడ్వకేట్‌ను పిలిచి విల్లు రాస్తాను.. నా తదనంతరం ఆస్తిపా స్తులు నీకే చెందుతాయి..''

''నాకొద్దు.. నాకొద్దు.. అనాథాశ్రమాలకు రాసే య్యండి...'' అన్నాడు కాశి.

''నిన్ను వేస్ట్‌ఫెలో అనేది అందుకే! చిన్నప్పటి నుంచి నిన్ను నా స్థాయికి తీసుకురావాలని ప్రయ త్నిస్తుంటే నువ్వెప్పుడు సహకరించవు.. అదే నీతో వచ్చిన చిక్కు! నువ్వు ఆపదల్లో వున్నపుడు ఎన్నో సార్లు ఆదుకున్నాను.. కానీ నన్ను పూర్తిగా నమ్మవు.. నా మూలంగా నీకేదో ద్రోహం జరిగి నట్లు భావిస్తావ్.. నాకు నువ్వు తప్పితే ఎవ్వరూ లేరు కాశీ!''

అరవింద్ మాటలు నమ్మాలో లేదో అర్థంకా లేదు. మళ్లీ తనను మరో సుడిగుండంలోకి నెట్టే య్యడు గదా!

జాగ్రత్తగా వుండాలి.. పెద్ద మేధావిననుకుం టాడు.. తనను ఎందుకు పనికిరాని వెధవని అతని అభిప్రాయం...

మైండ్ బ్లాంక్ అయ్యేటట్లు దెబ్బకొట్టాలి.. తనకూ ఓ అవకాశం తప్పకుండా వస్తుంది.. 'కాశిని అండర్ ఎస్టిమేట్ వేశాను.. నన్నే బోల్తాకొట్టిం చాడు' అని అరవింద్ అనుకునే రోజు వస్తుంది.

''జాగ్రత్తగా విను. నాకు ఫారిన్ బ్యాంకులో కూడా ఎకౌంట్స్ వున్నాయి.. వాటి వివరాలు, అవి ఎలా ఆపరేట్ చేయాలో నీకు వివరంగా చెబు తాను.. కొన్ని బ్యాంకుల్లో మనిద్దరి పేరిట జాయింట్ అకౌంట్ ఓపెన్ చేశాను.. ఇప్పటినుండే బ్యాంకులకు వెళ్లి నా పేరు మీద డిపాజిట్ అయ్యే మొత్తాలు చెక్ చేస్తూ వుండు'' అంటూ ఓ పేపరు కాశీకి ఇచ్చాడు.

''ఈ పేపర్‌మీద స్విస్ బ్యాంక్ ఎకౌంట్ ఎలా డీల్ చెయ్యాలో, మెయిల్ ట్రాన్స్‌పర్ ఎలా చెయ్యాలో వివరాలన్నీ రాశాను.. నీ దగ్గర సేఫ్‌గా వుంచు.. నిన్ను పూర్తిగా నమ్మి వివరాలన్నీ నీకు పూర్తిగా చెబుతున్నాను.. ఎవరికి నా బ్యాంక్ అకౌంట్ సీక్రెట్ కోడ్ నెంబర్లు వెల్లడించకు.. ఈసారి హైదరాబాద్ వెళ్లినపుడు నా ఎకౌంట్‌లో డబ్బు డిపాజిట్ చెయ్యి! రెండు మూడు ట్రాన్సా క్షన్స్ చేస్తే నీకు నా కోడ్ నెంబర్లు నోటికి వచ్చే స్తాయి'' అన్నాడు డాక్టర్ అరవింద్.

అతను చెప్పేది నిజమేనా?

- ఇంకా ఉంది

వాహిని

నేర్చుకుందాం

శ్రీ నరసింహ శతకములోని పద్యము



సీ. ఇభరాజవరదు నిన్నెంత పిల్చిన ఁగాని
మాఱుపల్కవదేమి మౌనితనము
మునిజనార్చిత నిన్ను మ్రొక్కి వేడిన ఁగాని
కనులఁ బడవదేమి గడుసుఁదనము?
చాలదైన్యము నొంది చాటు చొచ్చిన ఁగాని
భాగ్యమియ్య వదేమి ప్రౌఢితనము
స్థిరము గా నీపాద సేవఁ జేసెదనన్న
దొరక ఁజాలవదేమి ధూర్తు తనము

తే. మోక్షదాయక ఇటువంటి మూర్ఖజనుని
కష్టపెట్టిన నీకేమి కడుపు నిండు
భూషణవికాస ! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ! దురిత దూర!

భావం: గజేంద్రుని సంరక్షించిన ఓ స్వామి నోరార నిన్ను పిల్చినా మారు పల్క కున్నావు. ఏమా మూగతనము? మునిజనులచే కొనియాడబడు ఓ దేవా! నీకెన్ని దండాలు పెట్టినా కండ్లకగుపించవు. ఏమా గడుసుదనము ఎంతో దైన్యంతో నీ మరుగుజొచ్చినా భోగభాగ్యాలొసంగవు ఏమా గొప్పదనము తెగబడి నీ పాద సేవ చేస్తానన్నా దొరకవు. ఏమా దుర్మార్గం మోక్ష దాతవైన ఓ నరసింహ ప్రభూ! నా వంటి అమాయకని కష్టపడి తే నీకు కడుపు నిండుతుందా?

మాటాట : 1544

నిర్వహణ: సుధామ

1	■	■	2	3		4
5		6	■		■	
	■	7		■	8	
■	■		■	9	■	■
10		■	11		■	12
	■	13	■	14		
15				■	■	

ఆధారాలు

అడ్డం:
2. ఆగ్రాలలోని రాధాస్వామీ మత ఆధ్యాత్మిక కేంద్రం
6. సంతోషం, వేడు క
7. దేవళము
8. పాచిక
10. పండుగ
11. ఫలము
14. గుర్రము అనాలో , అశ్వము అనాలో తెలీక చివరికిలా అన్నాడట
15. శారద

నిలువు:
1. వసంత పంచమియే
3. ప్రయాణము
4. ఒజ్జ
6. కలర్స్
9. వ్యవహారిక భాషోద్యమారంభకుడు
10. నస గల పండు
12. అంబుధి
13. దీర్ఘ బుద్ధి కాకుంటే ఈ బుద్ధి

మాటాట - 1543 సమాధానం

1 మే	ఘ	2 ల	య	■	■	3 హా
ది	■	డ్డూ	■	4 వ	రు	స
5 ని	జం	■	6 బూం	ది	■	ము
■	■	7 మ	■	న	■	■
8 శ్రీ	■	9 సు	య్యి	■	10 నా	11 కై
12 త్రి	ను	వు	■	13 బూ	■	వా
లం	■	■	14 ఆ	ది	వా	రం

మంచిమాట

శ్రీపంచమి

'శివానుజ' అనడం చేత విద్యనభ్యసించినవారు తమ విద్యను లోకక ళ్యాణార్థం ఉపయోగించాలని భావం.

'సర్వశుక్లా సరస్వతీ' కనుక సరస్వతీదేవి స్వచ్ఛమైన శ్వేతవర్ణం. ఆమె వస్త్రం, ఆభరణాలు, వాహనం, అక్షమాల అన్నీ శ్వేతవర్ణమే. శ్వేత పద్మవా సినియైన తల్లి కనుక శారదగా భాసిస్తోంది. శరదృతువులో ఆవరించింది కావున 'శారద' అయింది. మంత్ర శాస్త్రంలో శారద రూపాలు అనేకం వున్నాయి. ప్రతిభ, ధారణ, ప్రజ్ఞ, వాక్సంపద, మేధ శక్తుల స్వరూపమే శార దాదేవి. తెలంగాణ రాష్ట్రం ఆదిలాబాద్ జిల్లాలో గోదావరి తీరాన భాసర క్షేత్రంలో వెలసిన జ్ఞాన సరస్వతీదేవిని వేదవ్యాసుడు ఆరాధించి, తపం ఆచరించి అమ్మవారి సాక్షాత్కారం పొందినాడని, కనుక శ్రీపంచమి రోజున ఈ క్షేత్రంలో బాల బాలికలకు అక్షరాభ్యాసం, శ్రీకారం చేయిస్తే వాక్సుద్ధి కలిగి విజ్ఞాన రాశులవుతారని, వాగ్దేవి కరుణతో సద్బుద్ధిని పొందుతారనే విశ్వాసంతో శ్రీపంచమి తిథిని మహావైభవంగా జరుపు తారు. మెదక్ జిల్లా వర్గల్‌లో విద్యాసరస్వతిగా, కర్ణాటకలోని శృంగేరీలో శారదాదేవిగా విశేష పూజలందుకొంటున్న శ్రీపంచమిని ఉత్తర భారత, దక్షిణ భారత దేశంలోనూ వైభవంగా జరుపుకునే ఆచారం వుంది. ఇది వసంతంలో వస్తుంది కనుక వసంత పంచమి అని కూడా అంటారు. ఋతువులలో వసంత ఋతువును నేను అని శ్రీకృష్ణభగవానుడు భగవద్గీ తలో చెప్పాడు. అక్షర పరబ్రహ్మయోగం కూడా వున్నది. అందుకే ఈ వసంత పంచమినాడు శ్రీమహావిష్ణువును ఆరాధించే ఆనవాయితీ కూడా వస్తోంది.

సకల విద్యాస్వరూపిణియైన సరస్వతీదేవి ఆవిర్భవించిన మహిమాన్వి తమైన తిథి పంచమి. జ్ఞానం, వాక్కు, విద్య, బుద్ధి శక్తుల్ని ఇచ్చే శ్రీపం చమి మాఘమాసంలో జరుపుకుంటారు. జ్ఞాన ప్రదాయినిగా, వాక్సంపద, ధారణ, ప్రతిభ, సరస్వతీదేవి ఆరాధనవల్ల సిద్ధిస్తాయి. మంత్ర స్వరూపిణి యైన సరస్వతీదేవిని ఉపాసిస్తే జ్ఞానం కలుగుతుంది. 'సరస్వతీ నమ స్తుభ్యం వరదే కామరూపిణి విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతుమే సదా' అని విద్యలకు రాణియైన పుస్తక పాణియైన అక్షరవాణియైన సరస్వ తీదేవిని ప్రార్థించడం ఆచారం.మాఘమాస శుక్లపక్ష శ్రీపంచమి సరస్వతీ దేవి జన్మదినం. శ్రీపంచమినాడు బాల బాలికలకు విద్యాభ్యాసం చేయిస్తే అపారమైన జ్ఞానం లభిస్తుందని, విద్యాభివృద్ధి చెంది ఉత్తమ శ్రేణులై విజయం సాధిస్తారనే విశ్వాసంతో శ్రీపంచమి రోజు దేశ వ్యాప్తంగా అక్ష రాభ్యాసం చేయిస్తారు. సరస్వతీదేవి కరుణ ఉంటే విద్యాప్రాప్తి, జ్ఞాన ప్రాప్తి కలుగుతుందని శ్రీపంచమినాడు వాగ్దేవిని ఆరాధించి అక్షరా భ్యాసం చేయాలని బ్రహ్మవైవర్త పురాణంలో పేర్కొనబడింది.

విద్యచేత వినయం, వినయం చేత జ్ఞానం, జ్ఞానము చేత ధనం, ధనం చేత అధికారం సంప్రాప్తిస్తాయి. ఎవ్వరిచే దొంగిలించబడనిది, పదిమం దికి పంచగల శక్తి విద్యకు మాత్రమే ఉన్నది. ఈ సమాజంలో విద్య కలిగి నవాడు ధనవంతునికన్నా, సంఘంలో గొప్ప మన్ననలు పొందుతు న్నాడు. అన్ని దానాలకన్నా అన్నదానం గొప్పదే కానీ, అంతకన్నా విద్యా దానం మనిషిని మహోన్నతుడిగా తీర్చుదిద్దుతుంది.

'దేవీం వాచమజనయంతే దేవాః' అని వేదం ఘోషిస్తోంది. అంటే సృష్టిలో మొట్టమొదట వ్యక్తమయింది వాక్కే. కనుక వాగ్దేవతే ఆదిదేవి. వాగ్దేవి పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ అనే నాల్గు రకాలుగా, సకల జీవు లకు వాక్కులుంటాయి. అయితే 'పరా, పశ్యంతీ, మధ్యమా' అనే మూడు విధాల యోగులు, జ్ఞానులు మాత్రమే గుర్తించగలుగుతారు. అలా నాలుగు విధాలైన వాక్కులకు అధిదేవత కనుక సరస్వతీ వాగ్దేవి. శుద్ధ సత్త్వమైన పరమాత్మ రూపానికి సంకేతం. సత్వగుణముతో సరస్వతిగా, రజోగుణముతో లక్ష్మిగా, తమోగుణంతో గౌరిదేవిగా రూపొందింది. సర స్వతీదేవి పరబ్రహ్మమైన పరమాత్మ నుంచి ఉద్భవించిన వాణికి, విద్య, జ్ఞాన బుద్ధులకు ప్రతీక.సరస్వతీదేవిని మాతృగణాలలో, దేవతలలో శ్రేష్ఠ మైనదిగా మన భారతీయ సంస్కృతి గౌరవిస్తుంది. జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని ప్రసాదించే సరస్వతీదేవి ఆరాధన ఉత్కృష్టమైన సాహితీ సంపదను అందించేది. అంతేకాదు మానసిక ప్రకృతిని సంస్కరించేది. కనుక తమ మేధాశక్తిని వృద్ధి చేసుకొనేందుకు విద్యార్థులు సరస్వతీమాతను ఆరా ధించి ఆమె కటాక్షం పొందండి. 'ఓం సరస్వత్యై విద్మహే! బ్రహ్మపత్న్యైశ్చ ధీమహి! తన్నో బుద్ధిదేవి ప్రచోదయాత్''

- రసస్రవంతి కావ్యసుధ

యాజ్ఞసేని



- త్రోవగుంట వేంకట సుబ్రహ్మణ్యము 18

తన బంధువులు, కొంతమంది ప్రజా ప్రతినిధులు, బ్రాహ్మణులు, తన పాంచాల రాజ్య పురోహితుడు కూడా వారి వారి ఆసనాలపై కూర్చుని ఉన్నారు.

ద్రుపదుడు దీర్ఘాలోచనలో ఉన్నాడు. అతిలోక సుందరియైన తన కూతురు ద్రౌపదిని తాను కోరుకొన్నట్టు గొప్ప ధనుర్విద్యా శ్రేష్ఠుడైన అర్జునునికి ఇవ్వా లని ఇన్నాళ్ళు పరితపిస్తున్నాడు. పాండవు లందరూ లాక్షాగృహంలో మరణించారనీ అంటున్నారు. అది నిజమా! కాదా? వారు నిజంగానే మరణించారా లేక సజీవంగా ఉన్నారా అని నిర్ధారించుకొనటానికై వేగు లను పంపాడు. వారందరూ తిరిగి వచ్చారు. పాండవుల జాడ తెలియలేదని సవినయంగా విన్నవించారు. ఆ మాట లను విన్న ద్రుపదుడు వ్యాకులచిత్తుడ య్యాడు. ఏమి చెయ్యాలా అని తనవా రిని, మంత్రులను మొదలైనవారిని తనవ ద్దకు రప్పించాడు.



దృష్టద్యుమ్నుడు అన్నాడు, తండ్రీ! అందరూ వచ్చారు. ఇక మనం ముందు చెయ్యవలసిన కార్యక్రమాన్ని నిర్ణయిం చుకోవాలి! అని.

ద్రుపదుడు ఆలోచనలనుండి తేరుకొ న్నాడు. వచ్చిన వారినందరినీ చూచాడు. వారితో ''ప్రియబాంధవులారా! దుష్టు డైన ధృతరాష్ట్రుడి పుత్రుడైన దుర్యోధ నుడు వంచించి పాండవులను లాక్షాగృ హంలో ఉండగా అగ్నికి ఆహుతులయ్యే టట్లు చేశాడు. పాండవులు మరణించిన ట్లుగా తెలియనైనది. ఇంత ఘోర కృత్యాన్ని ఇంతవరకు మరెవరూ చేయగా చూడలేదు. చేసినట్లు వినలేదు. నా స్వంత బిడ్డలు పోయినట్లుగా వున్నది. ఎంతో దుఃఖితుడనైనాను. అందు నా అర్జునుడి రూపము అద్భుతమైనది. అతడి ధైర్యం ఆశ్చర్యకరమైనది. ఆ పరా క్రమం, ఆ అస్త్ర ప్రయోగం అనన్య సామాన్యము. పగలు రాత్రి కూడా అతడి గురించే నా ఆలోచన. తల్లితో సహా అగ్నికి ఆహుతయ్యారు. లోకంలో ఇంత కన్నా ఆశ్చర్యమేముంది? కాలాన్నెవరూ అతిక్రమించలేరు గదా! నా శ్రమంతా వృథా అయింది గదా! నా ప్రతిజ్ఞ కూడా వ్యర్థమైనది. నేను లోకులకేమని చెప్పగ లను. నాలో నేనే కుమిలిపోతున్నాను. మహర్షులైన యాజోపయాజులను అర్థించి ద్రోణుని వధించగల కొడు కునూ, అర్జునుడికి భార్య కాగల కూతు రను కోరాను. ఈవిషయం ప్రజలందరి కినీ విదితమే. స్వయంగా యాజముని శ్రేష్ఠుడు కూడా దానిని ప్రకటించాడు కదా! పుత్రకామేష్టి చేసి ధృష్టద్యుమ్నుడిని, కృష్ణనూ పొందగల్గాను. వారి పుట్టుక నాకు ఆనందదాయకమే. కానీ ఇప్పుడేమి చేయగలను. ఆ అర్జునుడు మరణిం చాడు'' అని అన్నాడు. దుఃఖించాడు, రోదించాడు.

ఆ ద్రుపదుని ఆవేదనను చూచిన పాంచాల రాజ పురోహితుడు అన్నాడు- ''ద్రుపద మహారాజా! పాండవులు పెద్దల మాటలను మన్నించేవారు. ధర్మస్వరూ పులు. అటువంటివారు నశించుటయ న్నది జరుగదు. వారు పరాజితులు కారు. మహారాజా నేను గ్రహించిన సత్యాన్ని ఆలకించండి. బ్రాహ్మణులు ఈ సత్యాన్ని ప్రతిపాదించారు. వేద మంత్రాలలో కూడా దానిని విన్నాను. గతంలో ఇంద్రాణి (శచీదేవి) బృహస్పతి ద్వారా ఉపశ్రుతి మహిమ విన్నది. ఆ ఉపశ్రుతి అదృశ్యుడై పోయిన ఇంద్రుని తామర తూటి ముడిలో దర్శింపజేసింది. ఈ విధంగా పాండవుల విషయంలో కూడా నేను ఉపశ్రుతిని విన్నాను. వారు ఎక్కడో ఒకచోట జీవించియే ఉంటారు. అను మానం లేదు పాండవులు తిరిగి వచ్చే సూచనలు నాకు మిక్కుటంగా కనిపిస్తు న్నాయి. కారణం క్షత్రియులకు స్వయంవ రమే కన్యాదానానికి శ్రేష్ఠమైన మార్గమని చెప్పబడుచున్నది. అందుచేత ద్రుపద మహారాజా! నగరంలో స్వయంవరాన్ని చాటింపుము. దూరంగా ఉన్ననూ, దగ్గ రగా యున్ననూ, ఎక్కడ యున్నా సరే పాండవులు కుంతీదేవి సహితంగా స్వయంవరానికి తప్పక వస్తారు. ఆలస్యం చేయక స్వయంవరాన్ని ప్రక టింపుము'' అని అన్నాడు.

ఆ పురోహితుని మాటలను విన్న ద్రుపద మహారాజు మహదానంద పడ్డాడు. మనసు కాస్త కుదుటబడింది.

నేటికి డెబ్బది అయిదవ రోజున పురో హితులు నిర్ణయించిన ప్రకారం పుష్య మాసంలో, శుక్లపక్షంలో ఏకాదశినాడు రోహిణీ నక్షత్రంలో స్వయంవరం జరు గునట్లుగా నగరంలో ప్రకటింపజేశాడు.

12

అది రాజభవనము

దాసీ జనం చిత్రపటాలను చేత ధరించి వాటి ఒక వరుసలో అతి జాగ రూకతతో రాజభవనంలోని విశాలమైన ప్రాంగణంలో పేరుస్తున్నారు. రాజకు మారి ద్రౌపది చెలికత్తెలైన ధాత్రేయిక, యశస్విని, చిత్రలేఖ, కాంపిలిని, కాహళి, మనసివన, వనమంజరి మొదలైనవారు వచ్చి ఆ చిత్తరువులు ఏయే దేశ రాజకు మారులవో వివరంగా తెలిసికొని వెళ్లారు.

అర్జునునికి భార్యకాగల ఒక కూతురు కావాలని ద్రౌపదిని పొందాడు ద్రుపద మహారాజు.

- ఇంకా ఉంది

రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక,
36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

రాశిఫలం



- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

- **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
గౌరవ మర్యాదలకు లోపముండదు. అనవసర వ్యయ ప్రయాసలుంటాయి. మానసికాందోళనతోనే కాలం గడుపవలసి వస్తుంది. బంధు, మిత్రులతో వైరమేర్పడకుండా జాగ్రత్త వహించాలి.
- **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
మీ మంచి ప్రవర్తనను ఇతరులు ఆదర్శంగా తీసుకుంటారు. ప్రయత్న కార్యా లన్నింటిలో విజయాన్ని సాధిస్తారు. దైవదర్శనం చేసుకుంటారు.
- **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశముంది. స్థిరాస్తుల విషయంలో మిక్కిలి జాగ్రత్తఅవసరం. పక్కదోవ పట్టించేవారి మాటలు వినరాదు.
- **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
స్థానచలనం కలిగే అవకాశాలున్నాయి. గృహంలో మార్పును కోరుకుంటారు. ఇతరుల విమర్శలకు లోనవుతారు. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేరు.
- **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
దూర బంధువులతో కలుస్తారు. తద్వారా లాభాలుంటాయి. విదేశయాన ప్రయ త్నాలు సంపూర్ణంగా నెరవేర్చుకుంటారు. ధనలాభ యోగముంటుంది.
- **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
కుటుంబంలో సుఖ సంతోషాలుంటాయి. ధనధాన్యాభివృద్ధి ఉంటుంది. విద్యార్థులు విజయాన్ని సాధిస్తారు. ప్రయత్న కార్యములు ఫలిస్తాయి. గృహంలో జరిగే మార్పులు సంతృప్తినిస్తాయి.శుభవార్తలు వింటారు.
- **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
మానసికానందం లభిస్తుంది. వినోదాల్లో పాల్గొంటారు. వృత్తి రీత్యా అభివృ ద్ధిని సాధిస్తారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుంటాయి.
- **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
ఋణప్రయత్నం ఫలిస్తుంది. చెడు సహవాసం వైపు వెళ్లరాదు. క్షణికావేశం పనికిరాదు. బంధు, మిత్రులతో జాగ్రత్తగా నుండుట మంచిది. అనుకో కుండా డబ్బు చేతికందుతుంది.
- **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)**
బంధు, మిత్ర విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. మానసి కాందోళన అధికమగును. అనారోగ్య బాధలను అధిగమిస్తారు.
- **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
ఆర్థిక ఇబ్బందులుండవు. నూతన వస్తు, ఆభరణాలను ఖరీదు చేస్తారు. స్నేహితులను కలుస్తారు. ఇతరులకు మంచి సలహాలు, సూచనలిస్తారు. సంఘంలో గౌరవం పెరుగుతుంది.
- **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
ఊహించని కార్యాల్లో పాల్గొనే అవకాశముంటుంది. వృత్తి ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి ఉంటుంది. ఆత్మీయులను కలియుటలో విఫలమవుతారు.
- **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
అద్భుతమైన అవకాశాలను పొందుతారు. శుభకార్య ప్రయత్నాలు సుల భంగా నెరవేరతాయి. ముఖ్యమైన శుభవార్తలు వింటారు. ఆత్మీయుల సహాయ సహకారాలు సంపూర్ణంగా లభిస్తాయి.



సర్వేశ్వరుడు

సంగమేశ్వరుడు

పవిత్ర భారతావనిలోని అనేక పుణ్యక్షేత్రాల్లో ఒకటైన పాలమూరు జిల్లాలోని సంగమేశ్వరము ఒకటి. ఇది కృష్ణ, తుంగభద్రలకూడలిగా ప్రసిద్ధమైంది. ఈ కూడలి గ్రామ వాసులు ఒక్కోచోట కాక పలుప్రదేశాల్లో నివసిస్తున్నట్టు తెలుస్తుంది. అలంపురం పట్టణంలో పునఃనిర్మించిన సంగమేశ్వరుని, ప్రతి శివరాత్రి ఉత్సవాలకు కూడలి గ్రామవాసులు శ్రమ, ప్రయాసలు పడి అందరు కలిసి, ఆ దేవదేవుని శివరాత్రి ఉత్సవాలు కన్నుల పండుగగా నిర్వహిస్తున్నారు. అందరు సంఘటితమై వారి వారి యోగక్షేమాలు తెలుసుకొని, బ్రహ్మాండమైన పూజా కార్యక్రమాలు నిర్వహించిన తర్వాత తమతమ గ్రామాలకు చేరుకుంటున్నారు.

పాలమూరు జిల్లా యందు అలంపురము తాలూకాలో కృష్ణా, తుంగభద్రల సంగమము (కూడలి) దగ్గర వెలసిన పుణ్యక్షేత్రమే సంగమేశ్వరం. ఈ సంగమేశ్వరం కొల్లాపూర్ తాలూకాకు, అటు కర్నూలు జిల్లా నందికొట్కూరు తాలూకా సరిహద్దులో కృష్ణ, తుంగభద్రల నడుమ వెలసి, నయనానందముగా చూపరులను ఆకర్షించు ప్రకృతి దృశ్యములకు ఆటపట్టు.



ఆ క్షేత్రము మహాశివరాత్రి పర్వదినమున వేలాది జన సమూహంతో, శివార్చనలతో దశదిశల మారుమ్రోగుచుండేది. కర్నూలు నుండి అలంపురమువరకు బస్సులో, అక్కడి నుండి కాలినడకన లేదా గుఱ్ఱము బండ్లమీద ప్రయాణించి సంగమేశ్వరానికి వెళ్తుంటారు. పాలమూరు వాసులు నాగర్‌కర్నూలు, కొల్లాపురం మీదుగా ఆర్టీసి బస్సులో ప్రయాణించి, తర్వాత చెల్లెపాడు బస్సులో ప్రయాణించి అయ్యవారి పల్లెలో దిగి, అక్కడినుంచి కాలినడక లేక బాడుగ ఎద్దుల బండ్లు కట్టించుకొని రెండు కిలోమీటర్లు ప్రయాణించి సంగమేశ్వరంచేరుకొంటారు.

కర్నూలు జిల్లా వాసులు ఆత్మకూరు మండలం, నందికొట్కూరు తాలూకాలోగల నెహ్రూనగర్ లేక నాగటూరు, కొణిదేలకు చేరుకొని అక్కడినుంచి నదిలో పడవలలో ప్రయాణించి సంగమేశ్వరానికి వస్తారు. వేసవి కాలములో అయితే కాలినడకన నదిని దాటి ఆ క్షేత్రాన్ని దర్శించవచ్చును. కాని, ఈ క్షేత్రం అంతగా అభివృది చెందలేదు.


1958 సం.లో శ్రీశైల క్షేత్రము దగ్గర జల విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణము చేయుటకు శంకుస్థాపనతో ఈ క్షేత్ర అభివృద్ధి కార్యక్రమములు ఆగిపోయినవి. ఈ క్షేత్రము జల విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్‌లో మునిగిపోయింది. శ్రీశైల ప్రాజెక్టు నీరు ముంపు కాక ముందు, పురావస్తుశాఖవారు, సంగమేశ్వరాలయాన్ని కడు జాగ్రత్తతో ఆలయ శిలలను తొలగించి తమ చాకచక్యముతో అలంపుర క్షేత్రంలో కూడలి దగ్గర ఎలా ఉన్నదో అలానే చూడముచ్చటగా నిర్మించి, వేద పండితులతో సంగమేశ్వరుని పునఃప్రతిష్ఠించారు. ఇట్టి ప్రసిద్ధిగల పుణ్యక్షేత్రమైన సంగమేశ్వర క్షేత్ర పుట్టుపూర్వోత్తరములనుమన తర్వాతి తరాలకు తెలిసిఉండడం మంచిదని నా భావన. ద్వాపర యుగంలో కౌరవుల మాయాజూదంలో పాండవులు పరాజితులయ్యారు. దానివల్లనే పరిసర అరణ్యంలో ఆశ్రమం నిర్మించుకొని నివసించేవారు. కౌరవులు వారిని మరింత అవమానపరచాలని, "ఘోష యాత్ర" నెపంతో బయలుదేరారు. మార్గమధ్యంలో గంధర్వులు, కౌరవులను తమ శత్రువులుగా భావించి, యుద్ధంలో కురువీరులందరిని పట్టి బంధించారు. ఈ విషయం తెలిసిన పాండవాగ్రజుడు అక్కడనే ఉన్న కౌరవ వీరులందరిని బంధవిముక్తులను గావించి రమ్మని భీమార్జునులకు ఆనతిచ్చాడు. తత్ఫలిముగా కురువీరులు గంధర్వుల చెర నుండి వీడి ఘోర పరాభవంతో హస్తినాపురికి చేరారు.

విషయం తెలిసిన వాసుదేవుడు, పాండవులను చేరి మీరు ఇక్కడినుంచి బహుదూరంలో ఉన్న దండకారణ్యంలో కొంతకాలం గడిపి రమ్మని ఆదేశించాడు. శ్రీకృష్ణుని ఆనతి మేరకు దండకారణ్యంలో పాండవులు ప్రవేశించి జీవించసాగారు. అక్కడి ప్రజలను ఆదరిస్తూ, వారి మన్ననలను పొందుతూ సంచార జీవితం గడిపేవారు. అలా సంచరిస్తూ కృష్ణ, తుంగభద్రల సంగమం (కూడలి) చేరుకున్నారు.ఇక్కడి ప్రకృతి, ఈ నదుల కూడలి ప్రదేశం చూడగానే వారందరూ ఎంతో ఆనందపరవశులయ్యారు.

ఇక్కడే పర్ణశాల నిర్మించుకొని కృష్ణ, తుంగభద్రల కూడలిలో నిష్కాముల్తై తమకు సంభవించిన కష్టాలను, బాధలను, అవమానాలను మరచి సుఖ జీవితాన్ని సాగించారు. పాండవులు, ఒకనాడు ధర్మరాజు తమ్ములను, ద్రౌపదిని పిలిచి ఈ సుందర ప్రదేశం రెండు నదుల సంగమం కావున శివుని పూజిస్తే బాగుంటుందని సంగమ స్థలం కనుక ఇక్కడ శివలింగాన్ని ప్రతిష్ఠించుకుంటే సంగమేశ్వరలింగంగా ప్రసిద్ధి వస్తుందని తన మనసులో మాటను చెప్పాడు. వారంతా కూడా శివపూజ కు తమ సంసిద్ధతను తెలియపర్చారు.

వెంటనే భీమసేనుడు, కాశీక్షేత్రం చేరి అన్నపూర్ణ, విశ్వనాథులను ప్రార్థించి, అక్కడ నున్న ఒక పవిత్ర శివలింగాన్ని తీసుకొని కృష్ణా, తుంగభద్రల సంగమానికి చేరుకున్నాడు. పాండవులు సకల పూజా ద్రవ్యాలు సేకరించి రెండు నదుల కలయిక గట్టుపై ఆ శివలింగాన్ని ప్రతిష్ఠించి, పూజా కార్యక్రమాలు సాగించారు. అలా కొంతకాలంపాండవుల పూజలందుకున్నాడు సంగమేశ్వరుడు. ఆ తరువాత ద్వాపర యుగం ముగిసింది. కలియుగం వచ్చింది. అధర్మం మూడు పాదాలతో నడిచింది. ఆ సమయంలో మానవ జాతిని జాగృతం చేయడానికి ఒక మహానుభావుడు ఉదయించాడు. అతడే బసవేశ్వరుడు. అంతరించిపోతున్న మానవ సంస్కారాలను, ధర్మాలను, కర్తవ్యాలను, భక్తి జ్ఞానాలను, జాగృతం చేసి సరికొత్త మానవ జగత్తుకు మూలపురుషుడైనాడు. నేటి కర్ణాటక తుంగభద్రల సంగమం (కూడలి)లో తపస్సుచేసి ఈశ్వరుని సాక్షాత్కారం పొందాడు. భక్తి మార్గం గొప్పదని మానవులకుతార్కాణంగా నిలిచాడు. శివభక్తిని ప్రచారం చేస్తూ దక్కను పీఠభూమిలో సంచరిస్తూ కృష్ణ, తుంగభద్రల కూడలికి వచ్చాడు. ధర్మరాజుచే ప్రతిష్ఠగావింపబడిన శివలింగాన్ని పూజించాడు. తన భక్తిజ్ఞానాల ద్వారా ఆ ప్రాంత విశిష్టతను సంపూర్ణంగా గ్రహించాడు. తాను ఆశ్రమం నిర్మించుకొని, కొంత కాలం శివపూజను చేస్తూ అక్కడున్నవారికి కూడా శివుని పూజ చేయమని ప్రబోధించాడు.

ఆ తర్వాత చాళుక్యరాజులు పాలన వచ్చింది. వారు ఈ ఆలయాన్ని అభివృద్ధి చేశారు. ఆలయం చెంతనే కూడలి గ్రామము నిర్మించారు. ఆ దేవదేవుని నిరంతర పూజా కార్యక్రమాలు నిర్వహించడానికి అక్కడ జంగమయ్యను నియమించారు. ఆనాడు చాళుక్యులు నియమించిన జంగమయ్య వంశీకులే నేడు కూడా పూజాదికాలు నిర్వహిస్తున్నారు.



- సాయికృష్ణ

అనంతకోటి కిరణుడు- తేజమయుడు- దినకరుడు- వే వెలుగుల జ్యోతిర్మయుడు- త్రైలోక్య చూడామణి- దినమణి- ఆదిత్యుడు- శుభదాయకుడు- లోకరక్షకుడు- భక్తాభీష్ట వరప్రదుడు- మార్తాండుడు, సత్య, ధర్మ దయామూర్తిగా, ఆదిదేవునిగా యుగయుగాలలో ఆరాధింపబడుచున్నాడు సూర్యభగవానుడు. కర్మసాక్షి.

సూర్యుడు దక్షిణాయనము నుండి ఉత్తరాయణమునకు తన ప్రయాణమును నడిపించే రోజుగా విశిష్టతను పొందిన రోజు కాలమానంలో మాఘమాసంలోని శుక్లపక్ష సప్తమి, రథసప్తమిగా పర్వదినమై శోభిల్లుచున్నది.

గాన మిహిరుడు అనీ, సర్వప్రాణులయందునూ స్నేహంగలవాడుగాన మిత్రుడనీ, లోకాన్ని పోషిస్తాడుగాన పూషుడు అనీ పేరు. చిత్రభానుడు అని పేరు కూడా వుంది. ఈ పేరుతో తెలుగు సంవత్సరముంది. అదే 'చిత్రభాను' సంవత్సరం.

ఈ రవి ఆకాశానికి మణివంటివాడుగాన 'ద్యుమణి' అని పేరు. పండితులకూ, కవులకూ చదువే ధనం ఎలాగో, సూర్యునికి కూడా ఆయన కాంతియే ధనం. అందుకే విభావసుడంటారు. కాలమానంలోని వారములలో మొదటిది భానువారం. ఇదే ఆదివారంగా, రవి వాసరంగా సూర్యునిగా ప్రారంభమౌతుంది. జ్యోతిష శాస్త్రంలో గ్రహరాజుగా, నయనరాజుగా ప్రముఖ స్థానం ఉంది.

తం సూర్యం ప్రణమామ్యహం

ఆదిత్యుడు 12 మాసాల్లో 12 రకాల రూపాలను ధరిస్తాడు గనుకనే 'ద్వాదశాత్మ' అనే పేరు వచ్చింది. నెలకో రూపాన్ని పొందుతూ ప్రకృతిని రక్షిస్తూ ఉంటాడు. ప్రతి మాసంలో ఆరేసి మంది పరిజనంతో పరిభ్రమిస్తుంటారు. ఈ పరిజనంలోని ఆరుగురి పేర్లు కృతస్థలి- హేసి- వాసుకి - రథకృత్తు - పులస్త్యుడు- తుంబురుడు అనువారు.ఈ ఆదిత్యుడు చైత్రంలో ధాత- వైశాఖంలో ఆర్యముడు- జ్యేష్ఠంలో మిత్రుడు- ఆషాఢంలో ఇంద్రుడు- భాద్రపదంలో వివస్వంతునిగా, ఆశ్వయుజంలో తృష్టగా- కార్తీకంలో విష్ణువనీ- మార్గశిరంలో తవ్యముడనీ, పుష్యమాసంలో క్రతువుగా కీర్తింపబడుచున్నాడు. సూర్యకిరణంలో ఏడు రంగులు ఉండటంవలన 'సప్తాశ్వుడ'ని పేరుంది. సూర్యునికి దినకరుడు- అహస్కరుడు- ప్రభాకరుడు- విభాకరుడు- భాస్కరుడు- సప్తాశ్వుడనే ఏడు పేర్లున్నాయి. సప్త అనే గుఱ్ఱం గలవాడనీ- ఏడు గుఱ్ఱాలు గల రథం ఎక్కేవాడనీ అర్థం.

మరో పేరు మార్తాండుడు. అనగా మృతమైయా బ్రహ్మాండమును బ్రతికించేవాడు. మేఘరూపంలో ఈ జగతిని తడుపుతాడు . నవగ్రహాలలో ప్రథమస్థానం ఆదిత్యునకే. అందుకే 'ఆదిత్యాయచ సోమాయ మంగళాయ బుధాయచ గురు, శుక్ర, శనిభ్యశ్చ రాహవే కేతవే నమః' అని స్తోత్రం చేస్తే సూర్యుడు అనుగ్రహిస్తాడు. మానవులకు గ్రహాల బలం చాలకపోతే గ్రహాలు నీచ స్థానాల్లో ఉండుటవలన కంటికి జబ్బులు వస్తాయి. శరీర ఆరోగ్యం పూర్తిగా ఆయన చేతిలోనే వుంటుంది. అందుకే 'ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్' అని శాస్త్రం.

సూర్యమహిమను అగస్త్య మహర్షి ఆదిత్య హృదయంలో పలు రకాలుగా వర్ణించి స్తుతించాడు. సనాతనమైన ఈ ఆదిత్య స్తోత్రమును త్రేతాయుగంలో శ్రీరామచంద్రునికి అగస్త్యుడు ఉపదేశించాడు. తద్వారా సకల శుభాలూ కల్గుతాయన్నాడు. యుద్ధరంగంలో విజయం లభిస్తుందని దీవించాడు.

సూర్యోదయ వేళలో ఆకాశంలో నక్షత్రాలన్నీ ఒక సమూహంగా, రథాకారంలో ఉంటుందిగాన ఈ పర్వదినానికి రథసప్తమి అని పేరు వచ్చింది. ఈ రోజునుండే వేసవి కాలం ప్రారంభమవుతుంది. నిత్య చైతన్యమూర్తి, జీవకోటికి ప్రాణశక్తని అందించే ఆరోగ్య ప్రదాత లోకనాథుడు- లోకపాలకుడు ఈ భాస్కరుడు.

నాగులచవితి నాడు మొదలైన చలి రథసప్తమి నాటికి తగ్గుననీ, ఎండలు ప్రారంభమవుతాయనీ తెలిపాడు. సూర్యగ్రహదోషంవలన పలు రకాల రోగాలు వస్తాయనీ, సూర్య ఆరాధనతో రోగాలు మాయమవుతాయి. సూర్యునికి అసాధ్యమేదియునూ లేదు. ఈ విషయాన్ని శ్రీకృష్ణభగవానుడు ధర్మరాజుకు ఈ విషయం ఉపదేశించాడు. శ్రీరాముని కులదైవం సూర్యభగవానుడు. ఇనకుల తిలకుడు శ్రీరాముడు సూర్యుని ప్రాతఃకాలంలో జపిస్తూ అర్ఘ్యమిచ్చేవాడు. అదితి, కశ్యపులు సూర్యశక్తినుపాసించారు. సూర్యుడు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. అదితి దేవతలను కాపాడమన్నది. సూర్యశక్తి ఆమె గర్భంలో చేరింది. ఉపవాసాలు చేసింది. వారించిన ముని మాటలతో అదితి గర్భాండమును పరిత్యజించగా, ఆ తేజంవలన నిప్పులు చెలరేగాయి. ముని వేద మంత్రాలతో స్తుతించాడు. అండం పగిలి దానినుండి ఒక సుదర్శన బాలుడు పుట్టి సూర్య నామముతో దేవతల నాయకుడై విజయం అందించాడు. విశ్వ నియంతయైనాడు. ఒకసారి శివుడు సూర్యుని గాంచి సప్తాశ్వవాహనా! నీవు శుభాలనొసగే కాశీపురం వెళ్లు. అచటి రాజు ధార్మికుడు. దివోదాసుడు. రాజు ధర్మవిరుద్ధమైన పనులు చేసినందున కాశీ పాడుబడి నిర్జనమవుతుంది. నీ బుద్ధిబలంతో రాజును ధర్మచ్యుతిని గావించు. దేవతలూ, యోగులూ ఈ పని చేయలేకపోయారు, తిరిగి వచ్చారు. ఈ జగతిలో ఎన్ని జీవరాసులున్నవో వాటి పనులన్నీ నీకు తెలుసుగాన నిన్ను లోకచక్షువంటారు. నిర్జనమైన కాశీనగరంలో నేను వసింపాలని భావిస్తున్నాను అన్నాడు మహాదేవుడు. సూర్యుడు కాశీ చేరి లోపల - వెలుపల సంచరించాడు. రాజులో ఏ అధర్మము గోచరించలేదు. పలు రూపాలు ధరించాడు. ధర్మమయము కాశీనగరంగాన తానూ మనసులో కలిగిన లోల వలన సూర్యుడు కాశీల లోలార్కనామంతో ప్రసిద్ధిగాంచిన వరుణ, అసి కలసి వారణాసి అయినది. కాశీకి దక్షిణ దిశలో 'అసీ'సంగమ సమీపాన లోలార్కుడుండెను. కాశీ నివాసుల యోగక్షేమములను చూస్తున్నాడు. ఆదివారంనాడు లోలార్క సూర్యుని దర్శించిన ఎంతో పుణ్యము. ఏ రోగాలూ దరి చేరవు. మేరు పర్వత శిఖరంపై తిరుగాడుచూ కమలముల వనాన్ని వికసింపచేస్తూ వుంటాడు. పీతవర్ణం కల్గి ఉంటాడు. వాయురూపంలో వైశాఖంలో వేడి గాలులు వీస్తూ ప్రాణులను ప్రభావితం చేస్తాడు. పితరులకు అధిపతి. శ్రాద్ధమందు పితరులకు తుష్టిగాన వీనిని తృప్తిపరచాలి.

యజ్ఞములలో స్వాహా, శ్రాద్ధములందు స్వధా, హవ్య, కవ్యములయందు సూర్యుడు వరుణునితో కలిసి స్వీకరిస్తాడు. తాపం కల్గించు సూర్యుని శరీరం సుదర్శనంవలె కమనీయం. సూర్యునికి మంద- శీఘ్ర గతులుంటాయి. వీటి ప్రకారం సంవత్సరాన్ని ఐదు రకాలుగా వర్గీకరించారని దేవీ భాగవతంలో వుంది. సంవత్సరం పరివత్సరం- ఇడావత్సరం- అనువత్సరం- ఇద్వత్సరం అని పేర్లు ఉన్నాయి.

-పి.వి.సీతారామమూర్తి

రథసప్తమినాడు ఆచరించవలసినవి



ఈ రోజున వేడువనే లేచి స్నానమాచరించి ప్రమిదలో నూనె పోసి వత్తి వసి దీపాన్ని వెలిగించి తలపై పెట్టుకొని నదులలో గానీ ప్రవాహంలో గానీ వదలిపెట్టాలి. నువ్వుల పిండితో శరీరం రద్దుకొని, ఏడు జిల్లేడు ఆకులు- ఏడు రేగు ఆకులు - ఏడు చిక్కుడు ఆకులలు తలపైనుంచి స్నానం చేయాలి. ఇంటికి వచ్చి సూర్య విగ్రహానికి గానీ, పటానికిగానీ పూజ చేయాలి. పండ్లు భక్ష్యాలు- పాలు పాయసం ఆదిత్యునికి నైవేద్యం పెట్టాలి. వ్రతకర్త ఆరోజు నూనెతో చేయబడని పదార్థాలు భుజించాలి. పిదప పటాన్ని తగినవారికి దానం ఇవ్వాలి. భక్తిశ్రద్ధలతో పూజ చేయాలి. సూర్యునికి అర్ఘ్యం ఇస్తూ "జననీత్వం హిలోకానాం - సప్తమీ సప్త సప్తికే సప్తమ్యహ్యాతికే దేవీ నమస్తే సూర్యమాతృతే' అని జపించాలి. ధ్యానించాలి. తరించాలి. జననం నండి మరణం వరకూ సూర్యుని ప్రనావం మనపై ఉంటుంది గాన ఈ భాస్కరుని ఆరాధించి ఆయన అనుగ్రహానికి పాత్రులు కావాలి. వేదాల్లో పురాణాల్లో సూర్యుని చరితం చక్కగా వర్ణింపబడినది. భారతంలో కుంతి కన్యగా వుండి దుర్వాసుని సేవించి ఆయన చెప్పిన మంత్రమును ధ్యానిచి సూర్యుని కరుణతో కర్ణుని పుత్రునిగా పొందినది. పాండవులు అరణ్యవాసంలో ధర్మరాజు సూర్యుని ధ్యానిచి అక్షయపాత్రను పొందాడు. సూర్యునివలన సప్త సంఖ్యకు ప్రాధాన్యత వచ్చింది. సమాజంలో గీతాసప్తాహాలు- నామసప్తాహాలు- భాగవత సప్తాహాలు జరుగుతున్నాయి. వివాహాల్లో సప్తపది అని వధూవరులచే ఏడు అడుగులు వేయిస్తారు. కుష్టురోగ పీడితుడైన మయూరుడు సూర్యుని ఆరాధించి ఆరోగ్యం పొంది సూర్య శతకాన్ని రచించాడు. హనుమంతునికి సకల విద్యలూ నేర్పి నవ వ్యాకరణ పండితునిగావించాడు. సత్రాజిత్తుకు దినమునకు నూరు బారువుల సువర్ణమునిచ్చే శమంతకమణిని ప్రసాదించాడు. సూర్యవైభవం వర్ణింపనలవికానిది. మకర సంక్రమణం సంక్రాంతి నాడు సూర్యుని ఆరాధన చేస్తారు. మానవుని బుద్ధికి అధిదేవత సూర్యభగవానుడు. జ్ఞానప్రదాత. 'చక్షోస్సూర్యో అజాయత' అని పురుషసూక్తం. జీవనవేదం. జీవదాత ఆదిత్యుడు.

'ఆదిత్యాయ నమో నమః'

నిర్మలమైన మనస్సే భగవంతుని ఆవాసం

'ధ్రువా! ఎందుకంత ఆవేదనతో ముందుకు వెళ్లుతున్నావు. పాలుకారే ఆ బుగ్గలు ఎండవేడిమి తట్టుకోలేక ఎర్రబారిపోతున్నాయి'అన్నాడు.

నమస్కారం చేసి 'ఓ త్రిలోకసంచారి! మహానుభావా! నేను మా పినతల్లి చేత పడరాని మాటలు పడ్డాను. ఆ మనస్సంతా పుండు అయిపోయింది. ఆ పుండును భగవంతుడనే ఔషధంతో మాన్పుకోవాలని వెళ్లుతున్నాను. మీరు నా ఆశీస్సులు అందచేయండి'అని మళ్లీ నమస్కారం చేశాడు ధ్రువుడు. 'నాయనా! ధ్రువకుమారా! ఏది జరిగినా దానికంతటికీ కారణం ఆ దేవాదిదేవుడే. నీవు యమునా నదీ తీర ప్రదేశంలో ఉన్న మధువనానికి వెళ్లి అక్కడ కూర్చుని సుఖదుఃఖాలను దూరంగా తరిమివేయి నీవు అన్నింటికీ కారణుడైన శ్రీహరిని మనస్సున నిలుపుకొని "ఓం నమో భగవతే వాసుదేవాయ" అనే వాసుదేవ మంత్రాన్ని జపం చేయి నీకు మేలు జరుగుతుంది. ఆ వాసుదేవుని దర్శనం పొందుతావు.'అని నారదుడు అన్నాడు. నారదుడు చెప్పిన మంత్రాన్ని మనసున నిలుపుకుంటూ 'స్వామీ నీవు నాకు మంచిమార్గాన్ని చూపావు. నీవు చూపిన దారిలో నడిచి ఆ వాసుదేవుని మెప్పించి ఎవరూ పొందలేనటువంటి ఉన్నత స్థానాన్ని నేను పొందుతాను'అని అంటూ నారదునికి ముమ్మారు ప్రదక్షిణలు చేసి నమస్కారం చేసి ముందుకు వెళ్లాడు. నారదుడు చెప్పినట్లుగా మనస్సును, చిత్తాన్ని ఏకాగ్రం చేసి వాసుదేవునిపైన నిలిపాడు. చిన్నవాడైనా చిన్మయునిపై అపారమైన అచంచలమైన నమ్మకంతో స్వామిని ప్రార్థించసాగాడు. ఒంటికాలుపై తపస్సు చేస్తున్నాడు. తులసిమాలలు ధరించిన స్వామిని తన మనసున నిలిపి తదేకచిత్తంతో వాసుదేవుని మంత్రం జపిస్తున్నాడు.

పురాణ వ్యక్తులు పూర్వజన్మలు


ధ్రువుని తపోగ్నితో లోకాలన్నీ తల్లడిల్లిపోసాగాయి. సర్వదేవతలు హాహాకారాలు చేశారు. దీనికి కారణం బాలుడైన ధ్రువుని తపస్సు అని తెలుసుకొని అందరూ నారాయణుని దగ్గరకు పరుగెత్తారు. వారిని చూడగానే 'మరేంభయంలేదు. ధ్రువుడు నా దర్శనంకోరి నాపై నమ్మకంతో తపస్సు చేస్తున్నాడు. అతని కోరికను నేను తీరుస్తాను. మీరు చింతించకండి'అని అభయం ఇచ్చాడు.

గరుడారూఢుడై స్వామి ధ్రువుని చెంత నిలిచాడు.

- డా. రాయసం. లక్ష్మి

మానవాభ్యుదయానికి మంగళతోరణం

విష్ణువు కొడుకు బ్రహ్మ, బ్రహ్మ కొడుకు మరీచి, మరీచి కొడుకు కశ్యపుడు, అతిథి కశ్యపుల కొడుకు సూర్యుడు. సూర్యుణ్ణే ఆదిత్యుడు అంటారు. కశ్యప మహర్షికి అదితి- దితి ఇద్దరు భార్యలు. అదితికి దేవతలు, దితికి దైత్యులు జన్మించారు. అధికారం కోసం ఇరువురి మధ్య వైరం వచ్చింది. దేవతలకు ప్రాణ సంకటం వచ్చింది. ఇది గమనించి అదితి కశ్యపులు సూర్యశక్తిని ఉపాసించారు. సూర్యుడు ప్రత్యక్షమై వారిని వరం కోరుకోమన్నాడు. అదితి దేవతలను కాపాడుమన్నది. సూర్యుడు అభయం ఇచ్చాడు. విశ్వమంతటా వ్యాపించి యున్న నా తేజస్సును వెయ్యి కిరణాలుగా చేర్చి నీ గర్భంలో స్థాపించెదను. పిదప దేవరూపమున జన్మించి నీ సంతానముల కష్టము తొలగించెదను అని చెప్పాడు. సూర్యశక్తి ఆమె గర్భంలో చేరింది. అదితి గర్భం దాల్చినది. తన సంతానానికి మేలు కలగాలని వ్రతాలు చేస్తుంటే భర్త కశ్యపుడు కోపించి, ఉపవాసాలు చేస్తుండడం మంచిది కాదు, గర్భస్థ శిశువును బలహీనుని చేయకుమన్నాడు.



శాంతంగా అదితి సమాధానం యిస్తూ, స్వామీ ఈ గర్భాండం సూర్యశక్తి ప్రసాదం. ఇది వైరులను సంహరిస్తుంది. దీని తేజాన్ని పరాక్రమాన్ని చూడండని అదితి అపానవాయువేగం చేత తన గర్భాండము పరిత్యాగం చేసింది. ఆ తేజంవలన బ్రహ్మాండములో నిప్పులు రేగాయి. ముని వేద మంత్రాలతో గర్భాండమును స్తుతించాడు. అండం పగిలి దాని నుండి ఒక సుదర్శన బాలుడు జన్మించాడు. ఈ బాలుడే సూర్య నామముతో దేవతల నాయకుడైనాడు. దేవతలకు విజయం లభించింది. విశ్వనియంత అయినాడు. శివుడు సూర్యునిగాంచి సప్తాశ్వవాహనా నీవు శుభాల నొసగే కాశీపురం వెళ్లమన్నాడు. ఈ జగతిలో ఎన్ని జీవరాసులున్నాయో వాటి చేష్టలన్నియో నీకు తెలుసు. అందుకే నిన్ను లోకచక్షువంటారు. సూర్యుడు కాశీ వెళ్ళాడు. ధర్మమయమైన కాశీనగరంలో ఉండాలనే కోర్కె మనస్సులో కలిగిందిగాన లోలార్క నాముడైనాడు. కాశీలో అనేక రూపాలు దాల్చినాడు. ప్రసిద్ధి చెందినాడు. ఇలా సూర్య చరిత్రసూర్యునికి గురించి విశేషాలను చెబుతుంది. త్రిమూర్త్యాత్మకుడు, జీవిత పరమావధికి దారి చూపే మహోదాత్త స్వరూపుడు, సూర్యనారాయణమూర్తి అని కీర్తించారు వాగ్గేయకారులు. మన్వాంతర ప్రారంభంలో దివాకరుడు సప్తమి రోజున రథాన్ని అధిరోహించాడని ప్రతి సంవత్సరం మాఘశుద్ధ సప్తమిరోజున వచ్చే పర్వదినాన్ని రథసప్తమిగా, సూర్యజయంతిగా పండుగ జరుపుకుంటాం. సప్త మ్యాంఖలు సూర్యేణ మూర్తిశ్చ కృతవాన్ భువిః అని, సూర్యభగవానుడు తొలిసారిగా భూమి మీద రథసప్తమినాడు సాక్షాత్కరించాడని చెపుతోంది-మత్స్యపురాణం. మాఘశుద్ధ సప్తమీ తిథి రోజున, అరుణోదయాత్పూర్వం ఆకాశంలో గ్రహ నక్షత్ర సన్నివేశం, రథాకారంగా ఉంటుందని దైవజ్ఞులు వివరించారు. "మాఘే మాసేసి తౌ పక్షే సప్తమీ కోటి భాస్కర కుర్వాత్ స్నానార్ఘ్య దానా భ్యాం ఆయురారోగ్య సంపదః" రథ సప్తమినాడు ప్రాతఃకాలమందే మేల్కొని, శిరసున జిల్లేడు ఆకులను ఉంచుకుని స్నానమాచరించి, అర్ఘ్య దానాచరణతో ఆయురారోగ్య ఐశ్వర్యములు కలిగి, సప్త జనుల పాపములు నశిస్తాయని చెప్పబడింది.

- రామారావు

జ్ఞానప్రదాయిని శారదాదేవి



సరస్వతీ నమస్తుభ్యం వందే కామరూపిణీ
విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతుమే సదా

మాఘ శుద్ధ పంచమిని శ్రీపంచమి, సరస్వతి జయంతి, మదన పంచమి, వసంత పంచమి అంటారు. జ్ఞానానికి అధిదేవత సరస్వతి. శాస్త్రం, విజ్ఞానం, చదువు, కళలు, సృజనాత్మకత, వాక్కులకు సంకేతంగా సరస్వతిని పూజిస్తాము.

బ్రహ్మ వైవర్త పురాణములో వాగ్దేవిని సాత్విక మూర్తిగా, అహింసా దేవతగా, ధవళ పద్మంపై శ్వేత వస్త్రాలతో ఆసీనురాలై మందస్మితై దర్శనమిస్తుందని చెప్పబడింది. సరస్వతి అనగా ప్రవాహమని కూడా అర్థం. సరస్వతీనది గురించి కూడా పురాణాలలో చెప్పబడింది. మకర సంక్రమణం తరువాత ఋతుమార్పు సంభవిస్తుంది. ఉత్తేజవంతమైన కిరణాలతో భానుడు ప్రసరిస్తాడు. ప్రాణధార అయిన జలంవల్ల తరువులు చివురిస్తాయి. తద్వారా చైతన్య వంతమైన జీవశక్తి మేలుకుంటుంది. జ్ఞాపకశక్తి, జ్ఞానం కలిగివుంటే సంపదలు కలిగివున్నట్టే.

శ్రీపంచమి సందర్భంగా

సరస్వతి జయంతి రోజున ఉదయత్పూర్వమే నిద్రలేచి శుచియై తెల్లని వస్త్రాలు ధరించి, సరస్వతీ దేవికి తెల్లని కమలాలుగానీ, తెల్లని మరే విధమైన పూలతోగాని అర్చించి, పాయసాన్నం నివేదించాలి. అలాగే సరస్వతీ కవచం పఠించటంవల్ల పాండిత్యం ప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం.

పరాశక్తి తొలి ఐదు రూపాల్లో సరస్వతి రూపం ఒకటి. కేవలం విద్య మాత్రమే కాకుండా సర్వశక్తి సామర్థ్యాలనూ భక్తులకు ప్రసాదించి అనుగ్రహిస్తుందని దేవీ భాగవతం వివరిస్తుంది. నవరాత్రి మరియు వసంత పంచమి ఉత్సవాలలో సరస్వతీ ఆరాధన ప్రముఖంగా ఉంటుంది.

ఆదిలాబాద్ జిల్లాలోని బాసర నిర్మల్ పట్టణానికి 35 కి.మీల దూరంలో గోదావరి ఒడ్డున వుంది. బాసరలో జ్ఞాన సరస్వతిగా కొలువై వున్న మాతకు భారతి, శారద, వాణి మున్నగు అనేక పేర్లతో అర్చించటం జరుగుతుంది. పిల్లల విద్యాభ్యాసం ఇక్కడ చేయిస్తారు. అన్ని సరస్వతీదేవి ఆలయాల్లోనూ ఈ వేడుక ఘనంగా జరుగుతుంది. అలాగే సస్యదేవత అయిన వసంతుని, ప్రేమ దేవతగా కాముని, అనురాగ దేవతగా రతీదేవిని కూడా పూజించటం కొన్ని ప్రాంతాలలో జరుగుతుంది. శివపార్వతుల ప్రేమానురాగాలను ఇనుమడింపజేసిన వసంతునికి ఉత్తర భారతంలో ప్రత్యేక స్థానం వుంది. ఆ రోజు పసుపు రంగు వస్త్రాలు ధరించి, పసుపు రంగు ధాన్యంతో తయారుచేసిన నైవేద్యాన్ని సమర్పించి పూజిస్తారు. వసంతాగమనాన్ని తేజోవంతమైన ప్రకృతితో మమేకమౌతూ బుద్ధికుశలతను కూడా కలిగి జనులు ఆనందోత్సాహాలతో జరుపుకోవడం సంప్రదాయంగా ఆచరింపబడుతోంది.

- దేగల అనితాసూరి

దుష్టులకు దండన తప్పనిసరే!

కొద్ది కాలం గడిచింది.

యథావిధిగా అందరూ ఎవరి పనులు వారు చేసుకొంటున్నారు. ఒకరోజు గోపాలురంతా కలసి దగ్గరనున్న అడవికి వెళ్లారు. దినమంతా బాగా అలసిపోయేట్టుగా ఆడుకున్నారు. ఇక ఇంటికి తిరిగి వెళ్దామనుకొన్నారు. దాహం వేసింది. దగ్గర ఎక్కడైనా నీటి చెలమ ఉందా అని చూస్తూ చూస్తూ కాళింది నదీతీరానికి వచ్చారు. ఆ కాళింది నీటిని చూసి వారు ఎంతో సంతోషంతో ఆ నీటిలో దిగి కాళ్లు చేతులు కడుక్కుంటూనే నీరు తాగారు. అంతే గోపాలురంతా ఆ కాళింది నీటిలోని విషానికి బలయ్యారు. అందరూ అసువులు బాసారు. పశువులూ ఆ నీటిని తాగబోయి ప్రాణాలు పోగొట్టుకున్నాయి. దాన్ని చూసిన బలరామకృష్ణులు హతాశులైనారు. కృష్ణుడు మనసులో కాళీయుని పని పట్టాల్సిందే కదా అనుకొన్నాడు. కాళీయుడున్న నది గట్టుననే ఒక పెద్ద మర్రి చెట్టు ఉంది. శాఖోపశాఖలుగా విస్తరించి ఉంది. దానిపైకి కృష్ణయ్య చేరుకున్నాడు.

శ్రీకృష్ణామృతం

చరణ శ్రీ

ఆంధ్రభూమి
చిత్ర

సినిమా సమాజంలో భాగమే

'మా' అధ్యక్షుడు శివాజీరాజా



ఇటీవల కాకతీయ కళా వైభోత్సవాల పేరుతో 'కళాబంధు' టి. సుబ్బిరామిరెడ్డి కళలను ప్రోత్సహిస్తూ కళాకారులను సత్కరిస్తూ కళల పట్ల, సంస్కృతి పట్ల తన గౌరవాన్ని చాటుకుంటూ వస్తున్నారు. ఈ సందర్భంగా కాకతీయ హెరిటేజ్ ట్రస్టు పాపారావు సినీ నటులను సత్కరించకూడదని విమర్శిస్తూ మాట్లాడడం సంచలనం రేపుతోంది. ఈ విషయంపై 'మా' అధ్యక్షుడు శివాజీ రాజా స్పందిస్తూ- " సుబ్బిరామిరెడ్డిగారు కాకతీయ కళా వైభవాలు పేరుతో మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇటీవలే హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్రమంతటా జరిపేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ విషయంపై కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ పాపారావు సినిమా నటీనటులను సత్కరించొద్దంటూ విమర్శించడం బాధాకరం. సినిమా కూడా సమాజంలో భాగమే. ప్రజలతో మమేకమైన కళ సినిమా. సినిమా కళాకారులు తొలినాళ్లనుండి ప్రజల పట్ల స్పందిస్తూ పలు సహాయ కార్యక్రమాలు అందిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. అలాంటి గొప్ప సినిమా రంగానికి చెందిన సినీ నిర్మాత టి.సుబ్బిరామిరెడ్డి సినిమా నటీనటులను సన్మానించే భాగంలో తొలుతగా మోహన్‌బాబు గారిని సత్కరించారు. ఇంకా ఎన్నో చోట్ల మరెన్నో వైవిధ్యమైన కార్యక్రమాలు జరగాల్సి వున్న ఈ సమయంలో పాపారావు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం విచారకరం. ఒక వైపు గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు తెలుగు భాషకు మరింత గౌరవాన్ని తెచ్చే విధంగా ప్రపంచ తెలుగు మహాసభలు జరిపి తనదైన ఔనత్యాన్ని చాటి తెలుగు భాషకు ఎల్లలు లేవు. కళకు సరిహద్దులు, బాషాభేదం లేదనే రీతిలో తెలుగు సినీ నటీనటులను ఆహ్వానించి గొప్పగా ఘనంగా సన్మానించారు. అలాగే మంత్రి కేటీఆర్ కూడా ప్రతీ నటుడిని పేరుపేరునా పలకరిస్తూ తనదైన అభిమానాన్ని చాటుకున్నారు. మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ కూడా నటీనటుల పట్ల ఎంతో అభిమానాన్ని కురిపించారు. ఏ సహాయానికైనా వెనుకాడకుండా ఆదరిస్తున్నారు. మొన్నటికి మొన్న తెలుగు నటుడు గుండు హన్మంతరావు అనారోగ్య పరిస్థితులు తెలుసుకొని సీఎం రిలీఫ్ నుండి ఐదు లక్షల రూపాయలను కేటీఆర్ అందించారు. సినిమా నటీనటుల పట్ల తన గౌరవాన్ని చాటుకున్న కేసీఆర్‌గారి పరిపాలనకు కృతజ్ఞతలు. ఇలాంటి సమయంలో పాపారావు సినీనటులపై విమర్శలు చేయడం ఎంత వరకు సబబు? అన్నది ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నాం"అని పేర్కొన్నారు.

సినిమాలే నా జీవితం

హీరో విక్రమ్



'ప్రయోగాత్మక సినిమాలతో పాటు కమర్షియల్ సినిమాలు చేయాలన్నదే నా కోరిక' అని అంటున్నారు హీరో విక్రమ్. ప్రయోగాల కథానాయకుడిగా కమల్‌హాసన్ తర్వాత ఆ స్థాయిలో గుర్తింపు పొందిన నటుడు. ఆయన చేసిన పాత్రలు ఇప్పటికీ ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. ఒక వైపు కమర్షియల్ సినిమాలు చేస్తూనే, ప్రయోగాలకు ఎప్పుడూ సిద్ధమనే విక్రమ్ తాజాగా 'స్కెచ్' చిత్రంతో మరోసారి ముందుకు వస్తున్నారు. విజయ్ చందర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా విక్రమ్ చెప్పిన విశేషాలు ఆయన మాటల్లోనే...

అదే స్కెచ్..

సాధారణంగా కిడ్నాప్ చేయడానికి లేదా ఏదైనా దోపిడీ చేయడానికి ఎవరినైనా చంపడానికో స్కెచ్ వేశారనే పదం వింటూంటాం. ఇందులో దాన్నే టైటిల్‌గా పెట్టుకొని తీశాం. ఆ పాయింట్ చెబితే కథ తెలిసిపోతుంది. ఈ చిత్రంలో నేను కార్లు లోన్ తీసుకొని వాయిదాలు చెల్లించని వారిపై నాకు గ్రూప్‌తో కలిసి వారివద్ద లోన్ రికవరీ చేస్తుంటాను. ఇందులో నాకొక రౌడీ గ్యాంగ్ కూడా వుంటుంది. ఈ సందర్భంగా ఓ పెద్ద వ్యక్తితో గొడవ జరుగుతుంది. ఆ గొడవ ఎలాంటి పరిణామాలకు దారితీసిందనేదే స్కెచ్.

కథకు స్ఫూర్తి..

ఈ కథను దర్శకుడు ఏడేళ్ల క్రితం రాసుకున్నారు. తమిళనాడులో జరిగిన ఓ రియల్ సంఘటన ఆధారంగా రూపొందించిన కథ. ఈ కథ నాకు చెప్పడానికి దర్శకుడు రెండు నెలలపాటు తిరిగాడు. నేను బిజీగా వుండడంతో కుదరలేదు. తర్వాత కథ విని చాలా ఎగ్జయింటింగ్ అయ్యా. అంత బాగా నచ్చింది. ప్రస్తుతం లోకల్‌గా వుండే గూండాల నేపథ్యంలో కథ సాగుతుంది. రియాలిటీకి దగ్గరగా వుంటూ మంచి ఫాంటసీ కూడా వుంటుంది. ముఖ్యంగా కథలో చాలా ట్విస్ట్‌లు వుంటాయి.

ప్రయోగాలే కాదు..

విక్రమ్ అనగానే ప్రయోగాత్మక సినిమాలే కాదు, కమర్షియల్ సినిమాలు చాలా వున్నాయి. ఈ రెండూ నాకు రెండు కళ్లలాంటివి. ఈ కథలో సందేశం అంటూ ఏమీ లేదు. పక్కా కమర్షియల్ దారిలోనే తీశాం. నేను చేసిన 'ధూల్', 'సామి', 'మల్లన్న' వంటి సినిమాల తరహాలోనే ఈ 'స్కెచ్' వుంటుంది. దానికితోడు హీరోయిజం కొత్తగా వుండడమే గాకుండా పంచ్ డైలాగులు కావాలని తగ్గించాను.

తమన్నాతో కెమిస్ట్రీ..

ఈ చిత్రంలో తమన్నా పాత్ర చాలా కొత్తగా వుంటుంది. ఇందులో ఆమె బ్రాహ్మణ అమ్మాయిగా కనిపిస్తుంది. చాలా సీరియస్ పాత్ర. నేనేమో మెకానిక్ కమ్ రౌడీని. ఓ సాఫ్ట్ అమ్మాయికీ మాస్ అబ్బాయికి మధ్య జరిగే రొమాన్స్ బావుంటుంది. ముఖ్యంగా మా ఇద్దరి మధ్య మంచి కెమిస్ట్రీ కుదిరింది. తమన్నా అద్భుతమైన నటి. 'బాహుబలి' తర్వాత ఆ రేంజ్‌లో తనకు బాగా నచ్చిన కథ ఇదని చెప్పింది.

తెలుగులో చేస్తా..

తెలుగులో స్ట్రెయిట్ సినిమా చేయాలని నేనూ చూస్తున్నాను. మంచి కథలొస్తే తప్పకుండా చేస్తా. అయినా ప్రస్తుతం సినిమా రేంజ్ మారింది. ఇప్పుడు సబ్ టైటిల్స్‌తో ఒక భాషా చిత్రాన్ని మరో భాష వాళ్లు చూస్తున్నారు. అంతెందుకు? 'బాహుబలి' సినిమా తెలుగు సినిమా మాత్రమే కాదుకదా? అది గ్లోబల్ మూవీ. అలాగే 'రోబో', 'అపరిచితుడు' లాంటి చిత్రాలు అన్ని భాషల వారు చూశారు. 'బాహుబలి' సినిమా సౌత్ సినిమాకు గేట్లు తెరిచింది. దక్షిణాదిలో మంచి టాలెంట్ వున్న వాళ్లున్నారని నిరూపించింది.

అర్జున్‌రెడ్డితో మా అబ్బాయి..

మా అబ్బాయి ధృవ్ న్యూయార్క్‌లో మేథడ్ యాక్టింగ్ నేర్చుకుంటున్నాడు. తనని మూడేళ్ల తర్వాత హీరోగా పరిచయం చేయాలని అనుకున్నాను. కానీ, అర్జున్‌రెడ్డిలాంటి మంచి సినిమా రావడంతో హీరోగా ఓకే అన్నాను. చాలా మంచి కథ ఇది. ముఖ్యంగా నటనకు మంచి ఆస్కారముంది. ఈ సినిమా తర్వాత మళ్లీ తను డైరెక్షన్ కోర్సు చేస్తాడు.

రాజకీయాల్లోకి..

నాకు పంచ కట్టుకోవడమే రాదు. రాజకీయాల్లోకి ఎలా వస్తాను? ఆ ఆస్కారం లేదు. ఎందుకంటే నాకు సినిమాయే జీవితం. స్వతహాగా నేను సిగ్గరిని. అందుకే రాజకీయాలు పడవు. వాటి జోలికి వెళ్లనుగాక వెళ్లను.

తదుపరి చిత్రాలు.. ప్రస్తుతం గౌతమ్ మీనన్‌తో 'ధృవ్ నక్షత్రం' చేస్తున్నాను. దాంతో పాటు 'సామి' సీక్వెల్, అలాగే కమల్‌హాసన్ బ్యానర్‌లో ఓ థ్రిల్లర్ చేయనున్నాను. దాంతోపాటు 'కర్ణ' అనే చిత్రం ఫిబ్రవరిలో మొదలవుతుంది. 'మహాభారతం' నేపథ్యంలో తెరకెక్కే ఈ చిత్రంలో పలు భాషలకు చెందిన ప్రముఖ నటీనటులుంటారు. మూడు వందల కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కే సినిమా అది. ఆస్కార్ స్థాయిలో వుంటుంది.

- శ్రీనివాస్ ఆర్.రావ్

తొలిప్రేమ పాటలు



వరుణ్‌తేజ్, రాశీఖన్నా జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర సినీచిత్ర పతాకంపై బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న 'తొలిప్రేమ' చిత్రంలోని పాటలు హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సీడీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హీరో వరుణ్‌తేజ్ మాట్లాడుతూ - ఈ సినిమా కోసం ఏ టైటిల్ పెడదామా అని ఆరు నెలలుగా ఆలోచించాం. దాంతో దర్శకుడు వెంకీ 'తొలిప్రేమ' టైటిల్ పెడదామని చెప్పారు. నాకు ఇష్టమున్నా కొద్దిగా భయమేసింది. ఆ టైటిల్ పెట్టుకుని ఏదైనా తేడాచేస్తే పరిస్థితులు మరోలా వుంటాయి అని అన్నాను ఎందుకంటే అది బాబాయ్ బ్రాండ్ మార్క్ చిత్రం. తప్పకుండా అప్పటి 'తొలిప్రేమ'ను ప్రేక్షకులు ఎలా ఆదరించారో ఈ చిత్రాన్ని కూడా తప్పకుండా ఆదరిస్తారు. నా మనసుకు దగ్గరైన కథ. థమన్ మంచి సంగీతాన్ని అందించాడు. ఈ చిత్రంలో నా హైట్‌కు సరిపోయేలా హీరోయిన్‌గా రాశీఖన్నా కుదిరింది అన్నారు. దర్శకుడు వెంకీ మాట్లాడుతూ - నేను పరిశ్రమకొచ్చిన తొలిరోజుల్లో నన్ను నమ్మిన వ్యక్తి ఈ రోజు పరిశ్రమ నన్ను నమ్మేలా చేసిన వ్యక్తి దిల్ రాజు. ఈ కథ చెప్పినప్పుడు వరుణ్‌కైతే బావుంటుందని ఆయన చెప్పారు. వరుణ్‌కి కథ వినిపించాను. చాలా ఎగ్గయింటింగ్ అయ్యాడు. ఈ సినిమాతో మా నమ్మకాన్ని నిలబెట్టిన వ్యక్తి బాపినీడు. థమన్ చాలా కష్టపడ్డాడు. కెమెరామెన్ జార్జ్ నేను కన్న కలలను అందంగా తెరపై ఆవిష్కరించారు. ఈ సినిమాకు పనిచేసిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు అన్నారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ - పవన్ కళ్యాణ్‌కు సంచలన విజయాన్ని అందించిన 'తొలిప్రేమ' టైటిల్‌తో వరుణ్‌తేజ్ చేస్తున్న ఈ 'తొలిప్రేమ' మంచి విజయాన్ని అందుకుని హీరోగా వరుణ్‌కి కూడా మంచి బ్రేక్ ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాశీఖన్నా, థమన్, దిల్ రాజు పాల్గొన్నారు.

ఆడియోలో 'దివ్యమణి'



సురేష్ కమల్, వైశాలి, కిమయా హీరో హీరోయిన్లుగా మెహమాయా ఎంటర్‌టైన్ మెంట్స్, రెడ్‌నోడ్ మీడియా బ్యానర్లపై గిరిధర్ గోపాల్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'దివ్యమణి'. ఈ చిత్రంలోని పాటలు హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ నర్తకి, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత యామిని కృష్ణమూర్తి ఆడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో సురేష్ కమల్ మాట్లాడుతూ - నటుడిగా ఇది నా తొలి చిత్రం. ప్రపంచమంతా యోగా నేర్పడం కోసం తిరిగిన నాకు తెలుగునేలంటే ఇష్టం. గిరిధర్ చెప్పిన కథ నచ్చడంతో హీరోగా నటిస్తున్నాను. ఈ చిత్రంలో యాక్షన్ సన్నివేశాల్లో రియల్‌గా చేశాను. తప్పకుండా ఈ చిత్రం అందరికీ నచ్చుతుంది అన్నారు. దర్శక, నిర్మాత గిరిధర్ గోపాల్ మాట్లాడుతూ - మనిషి తనని తాను జాగృతి పరుచుకోవడానికి సృజనాత్మకత ఎంతో అవసరం. ఆ ప్రయత్నంగా ఈ చిత్రాన్ని చేశాను. సినిమాలో పాటలు హైలైట్‌గా నిలుస్తాయి. అందరికీ నచ్చే కథ, కథనాలతో తెరకెక్కించిన ఈ సినిమా తర్వాత యామిని కృష్ణమూర్తి జీవిత కథతో ఓ చిత్రాన్ని చేయనున్నాం అన్నారు. యామిని కృష్ణమూర్తి మాట్లాడుతూ - ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా వుంది. తప్పకుండా ఈ చిత్రం మంచి విజయాన్ని సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రామ్-లక్ష్మణ్, ప్రాడికూన, సాయికుమార్, బలభద్రపాత్రుని రమణి, ప్రసాదరావుతదితరులు పాల్గొన్నారు.

పక్కా ఇంటిలిజెంట్



సాయిధరమ్‌జ్ హీరోగా సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై.లి. పతాకంపై వి.వి.వినాయక్ దర్శకత్వంలో ప్రముఖ నిర్మాత సి.కల్యాణ్ నిర్మిస్తున్న భారీ చిత్రం 'ఇంటిలిజెంట్'. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 9న విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా నిర్మాత సి.కల్యాణ్ మాట్లాడుతూ- ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన పబ్ సాంగ్ షూటింగ్ జరుగుతోంది. ఈ పాట చిత్రీకరణతో మొత్తం షూటింగ్ పూర్తవుతుంది. ఫిబ్రవరి 9న ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం అన్నారు. సాయిధరమ్‌తేజ్, లావణ్య త్రిపాఠి, నాజర్, బ్రహ్మానందం, పోసాని కృష్ణమురళి, ఆకుల శివ, కాశీ విశ్వనాథ్, ఆశిష్ విద్యార్థి, షాయాజీ షిండే, రాహుల్‌దేవ్, దేవ్‌గిల్, వినీత్‌కుమార్, జె.పి, పథ్వీ, రఘుబాబు, కాదంబరి కిరణ్, విద్యుల్లేఖా రామన్, సప్తగిరి, తా.రమేష్, భద్రం, నల్లవేణు, రాహుల్ రామకృష్ణ, వెంకీ మంకీ, రాజేశ్వరి నాయర్, సంధ్య జనక్, ఫిష్ వెంకట్, శ్రీహర్ష, శివమ్ మల్హోత్రా, రవిరామ్ తేజ, తేజారెడ్డి నటిస్తున్న ఈ చిత్రానికి కథ, మాటలు: శివ ఆకుల, సినిమాటోగ్రఫీ: ఎస్.వి.విశ్వేశ్వర్, సంగీతం: తమన్, ఫైట్స్: వెంకట్, డాన్స్: శేఖర్, జాని, నిర్మాత: సి.కల్యాణ్, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వి.వి.వినాయక్.

'శృతి'మించుతోంది!

గ్లామర్ భామ శృతిహాసన్ మళ్లీ ఫామ్‌లోకి వస్తున్నట్టుంది. ఈమధ్య సినిమాల విషయంలో పెద్దగా పట్టించుకోని ఈ అమ్మడు చాలా అవకాశాలను వద్దని చెప్పింది. గత కొన్ని రోజులుగా బాయ్‌ఫ్రెండ్‌తో షికారులు చేస్తున్న ఈ భామ ఇప్పుడు కెరీర్‌పై ఫోకస్ పెట్టేందుకు రెడీ అయినట్టుంది. అందుకే హాట్ హాట్ ఫొటోలతో మరోసారి రెచ్చిపోయేందుకు సిద్ధమయింది. తాజాగా ఫెమినా మ్యాగజిన్ కోసం ఈ అమ్మడు తన అందాలని పచ్చిగానే ఆరబోసింది. శృతి ఫొటోలు చూసిన జనాలు షాక్ అవుతున్నారు. అంతకుముందే మరో మ్యాగజిన్ కోసం ఈ అమ్మడు ఇంకో హాట్ ఫోజులో రెచ్చిపోయింది. మొత్తానికి శృతి వ్యవహారం చూస్తుంటే మళ్లీ హీరోయిన్‌గా క్రేజ్ తెచ్చుకునేందుకు తన గ్లామర్ ఆయుధాన్ని సిద్ధం చేస్తోంది అనిపిస్తోంది కదూ. ముందు ముందు ఇంకెన్ని హాట్ ఫోజులు చూడాల్సి వస్తుందో మరి!

ప్రయో'జన' సినిమా!

బుక్ రివ్యూ



ప్రయో 'జన' సినిమా,
రచన: దేవరాజు మహారాజు
పేజీలు: 448, వెల: రూ. 360,
ప్రతులకు: విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు

సినిమాల గురించి వివిధ కోణాల్లో పరిశీలిస్తూ ఇంతవరకు శతాధిక గ్రంథాలు తెలుగు భాషలో వెలువడ్డాయి. ఈ విలక్షణ ప్రయో'జన' సినిమా గ్రంథ రచయిత డా.దేవరాజు మహారాజు సమాజానికి చెందిన పలు అంశాలపై పదుల సంఖ్యలో గ్రంథాలు వ్రాసి ఎన్నెన్నో పురస్కారాలు అందుకొన్న ప్రజ్ఞాశాలి. తాజాగా వారి కలం నుంచి వెలువడ్డ గ్రంథం ప్రయో'జన' సినిమా. టైటిల్‌లోనే సమాజానికి సినిమా యొక్క ప్రయోజనం ఏమిటి అనే ప్రశ్నతోబాటు ఈ గ్రంథంలో దానికి జవాబు దొరకుతుంది అనే సూచన కూడా స్ఫురిస్తుంది.

448 పేజీల ఈ పుస్తకంలో ప్రధానంగా 22 అధ్యాయాలున్నాయి. ఒక్కో అధ్యాయంలో రెండు నుంచి ఇరవై నాలుగు వరకూ ప్రకరణలున్నాయి. వీటిల్లో యానిమేషన్ చిత్రాలు, లఘు చిత్రాలు, డాక్యుమెంటరీలు, వైజ్ఞానిక చిత్రాలు, ఫిలిం సొసైటీలు, ఫిలిం జర్నలిజం, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, వివిధ భాషా చిత్రాలు, బాలల చిత్రాలు వంటి వివిధ అంశాలు క్షుణ్ణంగా వివరించి విశ్లేషించారు. ఈ పుస్తకం తెలుగు భాషలో వుంది గనుక తెలుగు సినిమాతో పరిచయం వున్న, ఆసక్తి వున్న పాఠకులు ఆ దిశగా ఏమి వ్రాశారో అన్న ఉత్సుకత చూపిస్తాడు. తెలుగులో తొలి బాలల చిత్రం 'భక్తధృవ- అనసూయ' (1936), ఆ తరువాత నిర్మాత, దర్శకుడు కె.ఎస్.ప్రకాశరావు అందరూ బాల నటీనటులతో తీసిన 'బాలానందం' (1954) గురించి ప్రస్తావన లేకపోవడం పాఠకుల్ని నిరుత్సాహపరుస్తుంది. ఇక ఇతర భాషా చిత్రాల గురించిన ప్రకరణల్లో సమాంతర లేక ఆఫ్ బీట్ లేక సహజ లేక ప్రయోజనం గల చిత్రాల గురించి ఆయా దర్శకుల గురించి వివరించడం ప్రశంసనీయం. ఆ దిశగా 'స్వప్నదానం' (కె.జి.జార్జి), చిదంబరం (అరవిందన్) సతి (అపర్ణ సేన్), ఏక్సిడెంట్ (శంకర్‌నాగ్) వంటి పలు చిత్రాల గురించి క్షుణ్ణంగా ప్రస్తావించారు. తెలుగు భాషా చిత్రాల ప్రకరణంలో 186వ పేజీలో ఎల్.వి.ప్రసాద్ గురించి వ్రాస్తూ 1954లో మద్రాసులో గృహలక్ష్మి చిత్రానికి దర్శకత్వం వహించారని వ్రాశారు. అది పొరపాటు. ఆ సంవత్సరం 1946, ఆ చిత్రం పేరు 'గృహప్రవేశం'. మా భూమి (గీతాబసు), దాసి (నరసింగరావు), చిల్లరదేవుళ్ళు (మాధవరావు) చిత్రాల గురించి వివరించి ఆ కేటగిరిలోనే వచ్చిన మరోమలుపు, ఈ చరిత్ర ఏ సిరాతో.. (వేజెళ్ల సత్యనారాయణ), ఊరుమ్మడి బ్రతుకులు, నిమజ్జనం (బి.ఎస్.నారాయణ) చిత్రాలకు చోటులేకపోవడం విస్మయాన్ని కలిగిస్తుంది. అక్కినేని నాగేశ్వరరావు సినీ జీవిత ప్రస్తానాన్ని వివరించి ఆయన తీసిన సుడిగుండాలు, మరోప్రపంచం గురించి ఉదహరించారు. అయితే అంతకుపూర్వం 1954లో సహజమైన కథతో 'తోడు దొంగలు' చిత్రాన్ని నిర్మించి కేంద్ర ప్రభుత్వం వారి పురస్కారం అందుకొని, పౌరాణిక పాత్రలకు ప్రాణప్రతిష్ఠ చేసి రాజకీయ రంగంలో సంచలనం సృష్టించిన ఎన్.టి. రామారావు గురించి కనీసం ఒక పేరా అయినా ఉదహరించకపోవడం విస్మయాన్ని కల్గిస్తుంది. హిందీ చిత్ర రంగంలో దిలీప్‌కుమార్, అశోక్‌కుమార్, దేవానంద్, రాజ్‌కపూర్ గురించి వ్రాసి, తెలుగు ప్రకరణంలో ఎన్‌టిఆర్‌కు ఆ మాత్రం విలువ ఎందుకు లేకపోయిందో అర్థంకాదు. తమిళ చిత్ర రంగం గురించిన ప్రకరణంలో శివాజీ గణేశన్, కమల్‌హాసన్, ప్రభుదేవాల గురించి ప్రస్తావించిన రచయిత, అటు చిత్ర రంగాన్ని ఇటు రాజకీయాలను ప్రభావితం చేసిన ఎం.జి.రామచంద్రన్, జయలలితలను విస్మరించటం పాఠకుల్ని విస్మయానికి గురిచేస్తుంది. ఇక సంగీత రంగ ప్రకరణంలో హిందీ చిత్ర రంగంలో లబ్ధప్రతిష్ఠులైన లతా మంగేష్కర్, నౌషద్, ముఖేష్, ఎ.ఆర్.రెహమాన్ గురించి విపులంగా వివరించి తెలుగు సంగీత రంగాన్ని ప్రభావితం చేసిన సాలూరి రాజేశ్వరరావు తెలుగు సంగీత ప్రియులను ప్రాతఃస్మరణీయం. 'స్వాతంత్ర్యము మా జన్మ హక్కండి' అని గళమెత్తిన ఘంటసాల గురించి ప్రస్తావించకపోవడం, ఆయన పేరిట విడుదలైన పోస్టల్ స్టాంపునైనా వేయకపోవటంతో నిశ్చయంగా తెలుగు పాఠకుడు నిరాశచెందుతాడు. చార్లి చాప్లిన్‌తో ప్రారంభించి చైనా, జపాన్, జర్మనీ మొదలగు దేశాల్లోని చిత్రాల గురించి ప్రస్తావించడం ప్రశంసనీయం. సునిశితంగా పరిశీలిస్తే ఈ గ్రంథం ఫిలిం సొసైటీ ఉద్యమంతోనూ, సమాంతర చిత్రాలతోనూ మరియు జాతీయ, అంతర్జాతీయ చలన చిత్రోత్స వంలోనూ పురస్కారాలందుకున్న చిత్రాల గురించి చర్చించుకునే వారికి చేరువైనంతగా ఈ గ్రంథం తెలుగు సినిమాలను అభిమానించే సగటు తెలుగు పాఠకుడు ఎంతవరకు ఆదరిస్తారో వేచిచూడాలి.

- ఎస్.వి. రామారావు